ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 18.07.2026 | సంపుటి : 12 సంచిక : 359 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370






# ధరణి అక్రమాలపై సిట్ ఏర్పాటు



## ఇకపై పంచాయతీల నిధులు నేరుగా బ్యాంకులో జమ



- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేత
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు సీతారామల అంచనా వ్యయాల పెంపు
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వస తుల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బులెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థుల కు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ధి చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

మిగతా 2లో..

**మరిన్ని కీలక నిర్ణయాలు..**

- టెండర్ల ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం
- అన్ని శాఖల్లో టెండర్ల ప్రక్రియ ఒకే తీరుగా ఉండేలా చట్టం
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కో-ఆప్షన్ సభ్యులుగా నియామకం.. ఇందుకోసం మున్సిపాలిటీస్ చట్టం- 2019ను సవరించే ప్రతిపాదనకు ఆమోదం
- శంషాబాద్ సమీపంలో రైల్ హబ్ ఏర్పాటు



### పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు

# 'ఆరోగ్య భరోసా'

### నగదురహిత వైద్య సేవలు ప్రారంభం

**హైదరాబాద్,జూలై17(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు ప్రక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు

మిగతా 9లో..

# ఓటు లేకపోయినా భారత పౌరులే

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం కోల్పోయినట్లు కాదని వ్యాఖ్యానించింది. అంతేకాదు.. ఈ జాబితా నుంచి తొలగించబడిన వ్యక్తులకు సంక్షేమ పథకాలను నిరాకరించవచ్చా? లేదా? అన్న విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో 'సర్'పై వచ్చిన అభ్యంతరాలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఎన్నికల సంఘంతో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో తమ పేరు కోల్పోయిన వారి అప్పీళ్లను ప్రత్యేక ట్రిబ్యునళ్లు పరిష్కరిస్తున్నాయి. ఈ క్రమంలో తిరస్కరణకు గురైన వ్యక్తులకు సం క్షేమ పథకాలు నిరాకరించకుండా ప్రభు త్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటరు జాబితాలో పేరు తొలగించిన వెంటనే.. ప్రజా పంపిణీ వ్యవస్థ తో పాటు పలు సంక్షేమ పథకాల ప్రయోజ నాలు సంబంధిత వ్యక్తికి అందకుండా బెం గాల్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. దాదాపు 34లక్షల అప్పీళ్లు ట్రిబ్యునళ్ల ముందు పెండింగు దశలోనే ఉన్నాయని.. ఇప్పటివరకు కేవలం 38 వేల అప్పీళ్లకు మాత్రమే పరిష్కారం లభించిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. దీనిపై ఇప్పటికే (బిహార్ 'సర్' విషయంలో) క్లారిటీ ఇచ్చామని పేర్కొంది. ఎన్నికల సంఘానికి కేవలం ఓటరు

మిగతా 2లో..

## భూమి కొన్నంత మాత్రాన దేశపౌరులు కాలేరు

కోల్‌కతా హైకోర్టు కీలక తీర్పు

న్యాయవాదుల సంక్షేమానికి

## తెలంగాణ కృషి ప్రశంసనీయం

రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం

సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు

ప్రయాణికులను 'రెండో తరగతి' అని

## అనడం సరికాదు

సెకంట్ క్లాస్ కేవలం రైలు కోచ్ గుర్తింపునకే పరిమితం కావాలి: సుప్రీం

రైల్వేప్రయాణికుల భద్రతపైనా కీలక వ్యాఖ్యలు

వివరాలు లోపలి పేజీల్లో..



### సరూర్‌నగర్ బీఆర్‌ఎస్ సభకు

# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

### షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ధర్మాసనం

**హైదరాబాద్,జూలై17(జనంసాక్షి):** బీఆర్‌ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్‌ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది.

మిగతా 2లో..

కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా..

## నిరుద్యోగుల గళం వినిపిస్తాం

సదస్సుకు అనుమతిని అడ్డుకున్నా హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది: కేటీఆర్

2లో..

# 60% సర్ డిజిటలైజేషన్ పూర్తి

### రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్,జులై17 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ పక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ పక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్లను అడిగి తీసుకోవాలన్నారు.

మిగతా 2లో..

### జైషే మహ్మద్‌తో సంబంధం ఉన్న

## ఐదుగురి అరెస్ట్

2లో..

## మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయం

2లో..

# బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్

### అధికార లేబర్ పార్టీ పక్షనేతగా ఎన్నిక



**లండన్(జనంసాక్షి):** బ్రిటన్ నూతన ప్రధాని ఎవరన్న దానిపై సందిగ్ధత వీడింది. అధికార లేబర్ పార్టీ పక్షనేతగా ఆండీ బర్న్‌హామ్ ఎన్నికయ్యారు. లండన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో లేబర్ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్ షబానా మహ్మద్ ఈ మేరకు ప్రకటించారు. 10 డౌనింగ్ స్ట్రీట్‌లో వచ్చే వారం ఆండీ బర్న్‌హామ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా కింగ్ ఛార్లెస్-3 సోమవారం

మిగతా 9లో..

# హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

### 78 రైల్వే స్టేషన్లకు వర్చువల్ ప్రారంభోత్సవం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైంది. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి.

**రైలు ఫీచర్లు ఇవే..:**
1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల

మిగతా 2లో..

# ఉద్రిక్తతలు తారాస్థాయికి..


## అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత ఆందోళనకరం

మా మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేస్తోంది: ఇరాన్

ప్రతిగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై క్షిపణులతో ఐఆర్‌జీసీ దాడి

ఘటనలో పలు ఫైటర్ జెట్‌లు రీఫ్యూయెలింగ్ విమానాలు ధ్వంసం





**టెహ్రాన్(జనంసాక్షి):** హార్మూజ్‌పై నియంత్రణ కోసం అమెరికా చేస్తున్న దాడులను సమర్థంగా తిప్పికొడుతున్నట్లు ఇరాన్ ప్రకటించింది. తమ దేశ భూభాగంలోని వివిధ ప్రాంతాల్లో అమెరికా చేస్తున్న దాడులకు ప్రతీకారంగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై క్షిపణులతో దాడి చేసినట్లు వెల్లడించింది. అనేక యుద్ధవిమానాలు, రీఫ్యూయెలింగ్ విమానాలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. మరికొన్ని ఫైటర్ జెట్లను కూడా తీవ్రంగా దెబ్బతీసినట్లు పేర్కొంది. మూడు ఇరాన్ క్షిపణులను నేల కూల్చినట్లు జోర్డాన్ మిలిటరీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు, ఇరాన్‌షహర్‌లో తమ సైనికులను హతమార్చినందుకు ప్రతీకారంగా సిరియాలోని అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్‌పైనా దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ప్రకటించింది. అయితే, ఈ స్థావరం నుంచి తమ దళాలు పూర్తిగా వైదొలగుతున్నట్లు

మిగతా 2లో..

ప్రజాప్రతినిధులపై కేసులతో పదవుల తొలగింపు..

## రాజ్యాంగ సవరణ బిల్లు వాయిదా

వివాదాస్పద బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకూడదని ఎన్డీయే నిర్ణయం

**న్యూఢిల్లీ,జూలై17(జనంసాక్షి):** దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాబోయే వర్షాకాల సమావేశాల్లో ఈ వివాదాస్పద బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకూడదని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లుపై అధ్యయనం చేస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన నివేదిక సమర్పణకు మరికొంత సమయం కావాలని కోరడంతో ఈ నిర్ణయం

మిగతా 2లో..

### వేర్వేరుగా కాదు.. అందరం

# కలిసి ఏఐని అభివృద్ధి చేద్దాం

### అప్పుడే కృత్రిమ మేధలో అద్భుతఫలితాలు

### ప్రపంచ దేశాలకు జిన్‌పింగ్ పిలుపు



**బీజింగ్(జనంసాక్షి):** కృత్రిమ మేధ అభివృద్ధిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఒక్కో దేశం వేర్వేరుగా అభివృద్ధి చేయడం కంటే, ప్రపంచ దేశాలన్నీ కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేస్తే ఇంకా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. షాంఘైలో నిర్వహించిన ప్రపంచ కృత్రిమమేధ సదస్సు -2026 ప్రారంభం సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఏఐ అద్భుత వేగంతో దూసుకుపోతున్న తరుణంలో దాన్ని మానవాళి శ్రేయస్సు కోసం ఉపయోపడేలా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఏఐ వల్ల ఉత్పన్నమవుతున్న ప్రశ్నలకు మన కచ్చితంగా సమాధానాలు వెతకాల్సిన అవసరముంది. ఆలోచనా జ్ఞానం ఉన్న యంత్రాలతో మనం ఎలా కలిసిపోవాలి? అల్గారిథమ్‌లో నిర్ణయాధికారం

మిగతా 2లో..

# సరూర్‌నగర్ బీఆర్ఎస్ సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

## కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా..
# నిరుద్యోగుల గళం వినిపిస్తాం

### సదస్సుకు అనుమతిని అడ్డుకున్నా హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది: కేటీఆర్

హైదరబాద్,జూలై17(జనంసాక్షి): బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ’ జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే యువ సంగ్రామ సదస్సును అడ్డుకొని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే... గౌరవ హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ’కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా... యువత తరఫున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుంది. యువతీ యువకులారా.. తరలిరండి.. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం. రేవంత్ సర్కార్ మెడలు వంచుదాం. హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దాం. ఛలో సరూర్‌నగర్ స్టేడియం. నేటి ఉదయం 10 గంటలకు’ అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నిక వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది.


**WANAPARTHY DISTRICT GAZETTE EXTRAORDINARY PUBLISHED BY AUTHORITY**

**Gazette No. 46/2026** **DATE: 07.07.2026.**
**File No: G/500/2026**
**The Right to Fair Compensation and in Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013**
**(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనాలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 1 యొక్క సెక్షన్ (2013/30 కేంద్ర చట్టం) 1(1) మరియు రాష్ట్ర రూల్ (1) 25 నుసరించి**

**ఫారం - VI**
**ప్రాథమిక ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వానికి **మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం** /land acquired for purpose of formation of "MGKLI - Major 01 of Distributary - 8 of Package - 29". వరకు భూమి ఎకరములు **00-13** గుంటలు వనపర్తి జిల్లాలో గోపాల్ పేట్ మండలంలో గల **చాకల్‌పల్లి గ్రామం** పరిమితిలో అవసర నిమిత్తం సేకరించనైనది. భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైంది.

పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి గోపాల్ పేట్ మండలంలో గల **చాకల్ పల్లి గ్రామములో** నిర్దేశించిన కొలతల ప్రకారం వచ్చిన విస్తీర్ణం **ఎకరములు 00-13 గుంటల** భూమి భూసేకరణ నిమిత్తం ఈ క్రింది చూపిన విధముగా కలదు.

షెడ్యూల్
గ్రామం : చాకల్ పల్లి మండలం : గోపాల్ పేట్ జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నం. | భూమి రకం తరి / మెట్ట | భూమి వర్గీకరణ | భూ సేకరణ కొరకు పరతిపాదిత భూ విస్తీర్ణం ఎ-గు | పట్టాదారు/అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు శ్రీ/శ్రీమతి/కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 59 | మెట్ట | పట్టా | 00.05 | పెద్ద నరసింహా తండ్రి చిన్న రాములు | 58 | VB | VB | 61 |
| 2 | 61 | మెట్ట | పట్టా | 00.08 | శాంతమ్మ భర్త చెన్న రాయుడు | 57 | 77, 78 | 59, 60 | 63, 62 |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గుం.లు) | | | | 00.13 | | | | | |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసం చట్టం 2013 (నెం. 30/2013) లోని నిబంధన 11(1) ప్రకారం సరసమైన పరిహారం మరియు పారదర్శకత వివరముల కొరకు కార్యాలయం పని సమయములో ఏదైనా పని రోజున జిల్లా కలెక్టర్, వనపర్తి, భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి.II పెబ్బేర్ కార్యాలయంలో భూమి యొక్క ప్రణాళికను పరిశీలించవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం తగిన ప్రభుత్వం ఆఫీసర్ - కమ్ - కలెక్టర్ / భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి. II పెబ్బేర్ వద్ద మరియు అతని సిబ్బందికి భూమిపైకి ప్రవేశించడానికి మరియు భూమిని ప్రవేశపెట్టడానికి, ఏదైనా భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి సంతోషిస్తున్నాము మరియు చెప్పిన చట్టంలోని సెక్షన్ 12 అమలు చెయ్యడానికి పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అవసరమైన అన్ని చర్యలను చెయ్యండి.

చట్టం యొక్క సెక్షన్ ప్రకారం (4) 11, ఏ వ్యక్తి ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా భూమి యొక్క ఏదైనా లావాదేవీకి కారణం కాదు, అమ్మకం అనుమతి లేకుండా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా ముందస్తు / అటువంటి భూమిపై ఏదైనా ఆక్రమణలను సృష్టించకూడదు.

అధీకృత అధికారి చట్టం యొక్క ఏదైనా ఉంటే సముపార్జనకు అభ్యంతరాలు, మరియు వారి భూముల పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న ప్రభావితమైన వ్యక్తుల నుండి వచ్చిన / ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి కింద భూసేకరణ 15 లోపు భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తి చట్టం లోని సెక్షన్ (అరవై రోజులు) 60 అధికారికి తెలియజేయగలరు.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ. ఎస్.పి., యూనిట్ - 2 పెబ్బేర్
సం/- అదనపు కలెక్టర్ , వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 500/LA/PP/Advt/Pub/2026-27


# ధరణి అక్రమాలపై ‘సిట్’ ఏర్పాటు

ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

# ఉద్రిక్తతలు తారాస్థాయికి..

గత ఫిబ్రవరిలోనే అమెరికా మిలిటరీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ నిజంగానే దాడి చేసిందా?లేదా? అనే దానిపై స్పష్టత లేదు.

**దాడులు ఉధృతం చేసిన అమెరికా**

మరోవైపు, అమెరికా దళాలు కూడా ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. అహ్వాజ్, క్వెషం, బుషెహర్, దస్తీ, బోట్సన్, సిరిక్, బందర్ అబ్బాస్ తదితర ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలను దెబ్బతీసేలా దాడులు నిర్వహిస్తున్నాయి. బందర్-ఇ- ఖమీర్ ప్రాంతంలో మూడు వంతెనలు దాడులకు గురయ్యాయి. హర్మూజ్ ప్రావిన్స్‌లో రోడ్డు రైల్వే నెట్‌వర్క్‌ను అమెరికా టార్గెట్ చేసింది. ఇరాన్‌షహర్‌లో ఎయిర్‌పోర్టుపై దాడి చేసింది. దీంతో నగరంలో విద్యుత్తు సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. కిష్ ద్వీపంలో దాడులతో అక్కడ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చాబహార్‌లోని మారిటైమ్ కంట్రోల్ టవర్‌పై మూడోసారి అమెరికా దాడి చేసింది.

**అమెరికా దాడులు చేస్తోంది.. తక్కువ విద్యుత్ వాడండి: ఇరాన్**

పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. అమెరికా- ఇరాన్ పరస్పర దాడులతో ఆ ప్రాంతం భగ్గుమంటోంది. తాజాగా ఇరాన్ చేసిన ప్రకటన అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ధ్రువీకరించింది. విద్యుత్ తక్కువగా వాడాలని దేశ పౌరులను కోరింది. ఈ మేరకు ఆ దేశ విద్యుత్ శాఖ వెల్లడించింది. ఇరుదేశాల మధ్య ఇటీవల మరోసారి ఉద్రిక్తతలు చెలరేగిన తర్వాత.. విద్యుత్ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ అంగీకరించడం ఇదే తొలిసారి. ముఖ్యంగా దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం కోరింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతోపాటు, విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రజలు వీలైనంత తక్కువ విద్యుత్ వినియోగించాలని కోరింది. అయితే, తమ విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసిందా? సరఫరా లైన్లను ధ్వంసం చేసిందా? అనే దానిపై ఇరాన్ స్పష్టత ఇవ్వలేదు. హర్మూజ్ జలసంధిపై నియంత్రణ కోసం ఇరాన్‌తోపాటు అమెరికా పోటీపడుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇదివరకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దానిని నిజం చేస్తూ తాజాగా అమెరికా దళాలు.. ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తున్నాయి.

### జైషే మహ్మద్‌తో సంబంధం ఉన్న ఐదుగురి అరెస్ట్

గాంధీనగర్,జులై17(జనంసాక్షి):ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా గుజరాత్ పోలీసులు జైషే మహమ్మద్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించారు. పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఐదుగురిని అరెస్టు చేశారు. బిలాల్ అబిద్ షేరా, మహమ్మద్ అయూబ్ కడివాల్, మహమ్మద్ షఫీ ముఖి, మహమ్మద్ హసన్ కరాడియా, మహమ్మద్ సునాసరగా వారిని గుర్తించారు. న్యాయస్థానం వీరికి జులై 24 వరకు పోలీసు కస్టడీ విధించింది. ఇటీవల ఎనిమిది మంది జైషే అనుమానితులను గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్టాల్లో అరెస్టు చేశారు. దేశంలో ఉగ్రకార్యకలాపాలు నిర్వహంచేందుకు ఒక నెట్‌వర్క్ కోసం వారు యత్నిస్తున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నప్పుడే ఈ ఐదుగురి పేర్లు బయటకు వచ్చాయి.

# ఓటు లేకపోయినా భారత పౌరులే

జాబితా, పర్యవేక్షణ అధికారం మాత్రమే ఉందని, పౌరసత్వాన్ని నిర్ణయించలేదని మరోసారి స్పష్టం చేసింది. పౌరసత్వంపై అనుమానంతో ఎవరినైనా ఓటరును జాబితా నుంచి తొలగిస్తే.. వారి పౌరసత్వ హోదాను నిర్ధరించుకునేందుకు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఈసీపైనే ఉంటుందని తెలిపింది. ‘సర్’ పర్యవసానాలపై దాఖలైన ఈ పిటిషన్‌ను జులై 25కు ముందే లిస్టు చేస్తామని పేర్కొంది.

## వేర్వేరుగా కాదు.. అందరం కలిసి ఏఐని అభివృద్ధి చేద్దాం

భాగమైనప్పుడు.. దానికి ఎలా భద్రత కల్పించాలి? పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి? అందరికీ ఏఐని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర ప్రశ్నలపై ప్రపంచ దేశాలన్నీ కలిసి నిర్ణయం తీసుకోవాలి” అని అన్నారు. అన్ని దేశాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఏఐని అభివృద్ధి చేయాలని చైనా కోరుకుంటోందని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఏఐని ప్రోత్సహించేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలతోపాటు, అసోసియేషన్ ఆఫ్ సైత్‌ఈస్ట్ ఆసియన్ నేషన్స్, అరబ్ లీగ్, ది షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్, ది ఆఫ్రికన్ యూనియన్, లాటిన్ అమెరికా, బ్రిక్స్ దేశాలకు చైనా పూర్తి సహకారం అందిస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. రానున్న ఐదేళ్లలో ఈ దేశాలకు 5000 రిసెర్చ్ ప్రాజెక్టులతోపాటు శిక్షణ, సెమినార్ కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

## హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

వేగంతో ప్రయాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

**2014కు పశ్చిమాసియా సంక్షోభం తలెత్తితే రైల్వేలు కుప్పకూలేవి:మోదీ**



పశ్చిమాసియా ఉద్రిక్తతలను ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ సంక్షోభాన్ని తమ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని వెల్లడించారు. 2014కు ముందు ఈ పరిస్థితి వచ్చి ఉంటే.. దేశ రైల్వే వ్యవస్థ కుప్పకూలి ఉండేదన్నారు. అప్పట్లో చాలా వరకు రైలు డీజిల్‌తోనే నడిచేవని పేర్కొన్నారు. శుక్రవారం హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.“మనం రైల్వేల చరిత్రను పరిశీలిస్తే.. 19వ శతాబ్దంలో ఆవిరియంత్రం ఆధారంగా నడిచేవి. 20వ శతాబ్దంలో డీజిల్, విద్యుత్ శక్తి ఇంధనంగా ఉండగా.. 21వ శతాబ్దపు రైల్వే హైడ్రోజన్ శక్తితో నడుస్తోంది. ఈ రోజు ప్రారంభించిన రైలును దేశీయంగా తీర్చిదిద్దారు” అని మోదీ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్‌లో ఇంధన నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. చమురు దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడిన భారత్‌లో ఆ ప్రభావం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో దేశంలో హైడ్రోజన్ రైలు ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సంసిద్ధమవుతుతోంది. 2036లోనే ఈ క్రీడలు నిర్వహించాలనుకుంటున్నట్లు ప్రధాని ఆకాంక్ష వ్యక్తం చేశారు. దానికి ముందు 2030లో కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు దేశం సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# భూమి కొన్నంత మాత్రాన దేశపౌరులు కాలేరు

### కోల్‌కతా హైకోర్టు కీలక తీర్పు

కోల్‌కతా(జనంసాక్షి):భూమి కొన్నంత మాత్రాన.. ఈ దేశ పౌరుడిగా పరిగణించలేమని కలకత్తా హైకోర్టు తెలిపింది. చొరబాటు ఆరోపణలతో అరెస్టైన ఓ వ్యక్తి.. తాను బెంగాల్‌లో భూమి కొనుగోలు చేశానని, ఈ దేశ పౌరుడినేనంటూ పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అతడి వాదనను తోసిపుచ్చింది. ఆస్తులు కొనుగోలు చేసినంతమాత్రాన ఇక్కడి పౌరులు కాలేరని స్పష్టం చేసింది. చొరబాటు ఆరోపణలతో నసీర్ మొల్లా అనే వ్యక్తిని బెంగాల్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. ప్రస్తుతం నిర్బంధ కేంద్రంలో ఉన్నాడు. ఈ క్రమంలో నసీర్ భారత పౌరుడేనని పేర్కొంటూ అతడి తరఫున బంధువు కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం మాత్రం అతడు విదేశీయుడని, ఈ విషయాన్ని ఆయనే స్వయంగా అంగీకరించినట్లు వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. భారత పౌరుడు అని నిరూపించుకునేందుకు సంబంధిత దస్త్రాలను అందించాలని సూచించింది. అయినప్పటికీ.. భూమి కొనుగోలుకు సంబంధించి డాక్యుమెంట్లు మినహా ఇతర ఏ దస్త్రాలనూ నసీర్ కోర్టుకు సమర్పించలేకపోయాడు. దీంతో అవి పౌరసత్వాన్ని రుజువు చేసుకునే పత్రాలు కావని పేర్కొన్న న్యాయస్థానం చివరి అవకాశం ఇచ్చింది. జులై 20లోగా డాక్యుమెంట్లను అందించాలని స్పష్టం చేసింది.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

న్యూఢిల్లీ,జూలై17(జనంసాక్షి): న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి. పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సం దర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుం బ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

## మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

హైదరాబాద్,జూలై17(జనంసాక్షి): హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25,30 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీలు) నీటిని తరలించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు మళ్లించేందుకు సుమారు 4 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగరంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించేందుకు జలమండలి కార్యాచరణ చేపట్టింది. అలాగే నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, భవిష్యత్ డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రయాణికులను ‘రెండో తరగతి’ సరికాదు

న్యూఢిల్లీ,జూలై17(జనంసాక్షి): రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత, ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇకపై ప్రయాణికులను 'రెండవ తరగతి ప్రయాణికులు' అని సంబోధించవద్దని రైల్వే శాఖను ఆక్షేపించింది. 'క్లాస్' అనే విభజన కేవలం రైలు కోచ్‌లకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రయాణికులను అలా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన కోర్టు.. ప్రమాద సమయంలో టికెట్ పోయినంత మాత్రాన పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. బాధిత కుటుంబాలు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని, సదరు ప్రయాణికుడికి టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖదేనని స్పష్టం చేసింది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను మానవతా దృక్పథంతో, ఉదారంగా అమలు చేయాలని ధర్మాసనం హితవు పలికింది. భద్రతా నిబంధనలు కాగితాల్లో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలు లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. రైల్వేల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, రైల్వే భద్రతను కూడా మెరుగుపరచవచ్చని కోర్టు సూచించింది. అదే సమయంలో ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డ్ ప్రయాణాలు చేయవద్దని ధర్మాసనం హెచ్చరించింది.



## త్వరలో పాలిమర్ నోట్లు..

### పైలట్ ప్రాజెక్ట్‌కు ఆర్‌బీఐ సన్నాహాలు!

న్యూఢిల్లీ(జనంసాక్షి):మార్కెట్‌లోకి త్వరలో పాలిమర్ నోట్లు రంగ ప్రవేశం చేయనున్నాయి. కొత్త తరహా కరెన్సీని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సన్నాహాలు చేస్తోంది. 2027 నాటికి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నది ఆర్‌బీఐ ఆలోచనగా ఉందని ఎన్డీటీవీ ప్రాఫిట్ తన కథనంలో పేర్కొంది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత రూ.10, 20 విలువైన బ్యాంక్ నోట్లను ఆర్‌బీఐ వినియోగంలోకి తీసుకురానుంది. వీటిపై అభిప్రాయాలను సేకరించి పూర్తి స్థాయిలో 2027 నుంచి వినియోగంలోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. పాలిమర్ నోట్లు వచ్చినప్పటికీ.. పేపర్ కరెన్సీ ఎప్పటిలానే కొనసాగుతుంది. దశలవారీగా పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి చలామణీకి రానున్నాయి. పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల వెల్లడించారు. ఈ కొత్త తరహా కరెన్సీ నోట్లను ముద్రించడానికి ఉపయోగించే ప్రత్యేకమైన పదార్థమైన పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల తయారీ, సరఫరా కోసం ఆర్‌బీఐ నోట్ల ముద్రణా విభాగం గ్లోబల్ ఆసక్తి వ్యక్తీకరణను (ఇూఎ) జారీ చేసింది. ఆగస్టు 18 నాటికి బిడ్లు దాఖలు చేయాలని సూచించడం ఈ వాదనలనకు బలం చేకూర్చింది. నకిలీ నోట్లను అరికట్టడం, కరెన్సీ నోట్ల మన్నికను పెంచడం ఈ పాలిమర్ నోట్ల ముఖ్య ఉద్దేశం. ఇవి తడిని తట్టుకోగలవు. చిరిగి పోవడం, నల్లగా మారడం వంటి సమస్యలు ఉండవు. ఆస్ట్రేలియా, కెనడా, యూకే, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఇప్పటికే పాలిమర్ నోట్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

### ప్రజాప్రతినిధులపై కేసులతో పదవుల తొలగింపు..

# రాజ్యాంగ సవరణ బిల్లు వాయిదా

### వివాదాస్పద బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకూడదని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం

తీసుకుంది. ఈ మేరకు పార్లమెంట్ అనెక్స్‌లో బీజేపీ ఎంపీ, జేపీసీ ఛైర్‌పర్సన్ అపరాజిత సారంగి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో బిల్లుపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, న్యాయపరమైన చిక్కులు, రాజ్యాంగపరమైన అంశాలను పరిశీలించేందుకు మరింత సమయం అవసరమని కమిటీ అభిప్రాయపడింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు, అరెస్టుల అంశానికి సంబంధించి కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. బిల్లు ప్రకారం.. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు వంటి ప్రజాప్రతినిధులు 30 రోజుల పాటు జైలులో ఉండి బెయిల్ పొందలేని పరిస్థితి ఏర్పడితే పదవులు కోల్పోయే విధంగా నిబంధనలు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించగా.. అధికార పక్షం మాత్రం పాలనలో పారదర్శకత, నైతికత పెంచేందుకు ఈ మార్పులు అవసరమని వాదిస్తోంది.

### హర్మూజ్‌లో గణనీయంగా

# తగ్గిన రవాణా

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. దీంతో హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 24 గంటల వ్యవధిలో ఈ మార్గం నుంచి కేవలం మూడు నౌకలే ప్రయాణించాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు..! బుధవారం 11 నౌకలు హర్మూజ్‌ను దాటగా.. గురువారం ఆ సంఖ్య మూడుకు పడిపోయినట్లు షిప్పింగ్ డేటా వెల్లడించింది. ఇరాన్ సంబంధిత నౌకలపై అమెరికా దిగ్బంధనం, వరుస దాడుల నేపథ్యంలో చాలా నౌకలు తమ ప్రయాణాన్ని నిలిపివేసుకుంటున్నాయని తెలిపింది. కొన్ని నౌకలు హర్మూజ్ నుంచి యూటర్న్ తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయని పేర్కొంది.


## గుడ్డు కొనాలంటే.. గుడ్లు తేలేయాల్సిందే..!

- రికార్డు స్థాయిలో గుడ్డు ధర రూ.8
- ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్వాడీలపై భారం



**సంగారెడ్డి బ్యూరో, జూలై 18( జనం సాక్షి) :** పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు రోజు రోజుకు పెరుగుతున్న కూర గాయల ధరల ప్రభావం గుడ్డు మీద పడింది. రికార్డు స్థాయిలో ధరలు పెర గడంతో వ్యాపారుల్లో ఆశలు చిగురుస్తుండగా, గుడ్డుతో పూట గడుస్తుందని భావించే సామాన్యులు మాత్రం నిరాశతో నిట్టూరుస్తున్నారు. రాష్ట్రంలో కోడిగుడ్ల ఉత్పత్తి సగానికి పడిపోవడంతోనే ఈ పరిస్థితి ఎదుర వుతోందని అమ్మకందారులు చెబుతున్నారు. నిత్యావసర ధరల పెరుగుదలతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్యుడికి.. ఇప్పుడు కోడిగుడ్డు కూడా చుక్కలు చూపిస్తోంది. పేదల పాలిట కొంగుబంగారంగా, చౌకగా దొరికే ఏకైక ప్రోటీన్ ఆహారంగా ఉన్న కోడిగుడ్డు ధర.. ఇప్పుడు అమాంతం పెరిగి ఆల్ టైమ్ రికార్డులను సృష్టిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో గుడ్డు ధరలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోయాయి. నిన్న మొన్నటి వరకు ఐదు, ఆరు రూపాయలు పలికిన ఒక్కో గుడ్డు ధర.. ఇప్పుడు బహిరంగ మార్కెట్లో ఏకంగా ఎనిమిదిన్నర నుంచి తొమ్మిది రూపాయల వరకు పలుకుతోంది. ఒక సామాన్య కుటుంబం ముప్పై గుడ్ల ట్రే కొనాలంటే.. ఇప్పుడు ఏకంగా 230 నుండి 250 రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.. దీంతో ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు గుడ్లు పెట్టడానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

## సింగూరు నుంచి దిగువకు నీటి విడుదల



**పుల్కల్, జూలై 17 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టు నుంచి శుక్రవారం మంజీరా బ్యారేజ్ కు నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రాజెక్టు పదవ గేటు ద్వారా 2.50 మీటర్ల హైట్ లేపి 8035 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తింటున్నావు ఈ నీటిని త్రాగు అవసరాల దృష్ట్యా విడుదల చేశామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.నీటి విడుదల నేపథ్యంలో మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.నది పరివాహక గ్రామాల ప్రజలు,మత్స్యకారులు నదిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.అలాగే నది పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సీఎం ప్రజావాణి వినూత్న కార్యక్రమం

- మధ్య ప్రదేశ్ రాష్ట్ర తహసీల్దార్ల ప్రశంస
- సీఎం ప్రజావాణి పని తీరును వివరించిన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్
- సీఎం ప్రజావాణిలో 260 దరఖాస్తులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణి కార్యక్రమం వినూత్నంగా సాగుతోందని, అందుకే ప్రత్యేకంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర వివిధ హోదాలో ఉన్న అధికారులు తరచుగా సీఎం ప్రజావాణిని సందర్శించి కొత్త అంశాలు నేర్చుకుంటున్నామని ఆ రాష్ట్ర తహసీల్దార్లు పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన 239వ సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ తహసీల్దార్లు సందర్శించారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ వారికి ప్రజావాణి పని తీరును వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి కేంద్ర బిందువుగా ఉందని వారు కితాబునిచ్చారు. శుక్రవారం సీఎం ప్రజావాణిలో 260 దరఖాస్తులు అందాయి.

## బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారం

- గర్భం దాల్చిన బాలిక..తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఇద్దరు యువకులపై ఫోక్సో కేసు నమోదు

**నల్లగొండ, జూలై17 (జనంసాక్షి) :** ఓ బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన నల్లగొండ జిల్లాలో చోటుచేసుకుంది. నిందితులిద్దరూ చిన్నారిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. ఈ ఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. కొంతకాలంగా నిందితులిద్దరూ చిన్నారిని బెదిరించి లైంగిక దాడికి తెగబడుతున్నారు. పాఠశాలకు వెళ్లే బాలికకు తొలుత ఓ యువకుడు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. అనంతరం ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆ తర్వాత మరో యువకుడికి ఈ విషయం తెలిసింది. దీంతో అందరికీ చెబుతానంటూ బెదిరింపులకు దిగాడు. ఎవరికీ చెప్పకుండా ఉండాలంటే తాను చెప్పినట్లు వినాల్సిందేనని హెచ్చరించాడు. ఆపై అతను కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా కొంత కాలం జరిగిన తర్వాత చిన్నారి గర్భం దాల్చింది. విషయం ఇంట్లో తెలియడంతో చిన్నారిని తల్లిదండ్రులు గట్టిగా నిలదీశాడు. దీంతో అసలు విషయాన్ని ఆమె వెల్లడించింది. వెంటనే పోలీసులను బాధిత తల్లిదండ్రులు ఆశ్రయించారు. తమ కుమార్తెకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. మరోవైపు యువకులు చేసిన పనికి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి చిన్నారుల మాన, ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

## రైతన్న వినూత్న ఆలోచన

- బైకుకు నాగలి కట్టి దౌర కొడుతున్న రైతన్న



**కడెం, జూలై 17 (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో రైతన్నలకు పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చుల భారం తగ్గించుకునేందుకు అన్నదాతలు ఒక్కొక్కరు ఒక విధంగా వినూత్న పద్ధతులు అనుసరిస్తున్నారు. అదేవిధంగా కడెం మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన ముంజ తిరుపతి గౌడ్ అనే యువరైతు వ్యవసాయ రంగంలో తన వినూత్నమైన ఆలోచనలతో రైతన్నలను ఆశ్చర్యపరుస్తున్నాడు. తిరుపతి గౌడు తనకున్న భూమి ఎకరం చేనులో పత్తి సాగు చేశాడు. పత్తి చేనులో కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడంతో దౌరా కొట్టేందుకు ఎడ్లు దొరకకపోవడంతో తమ తండ్రి నారాయణతో కలిసి బైక్ కు వెనక భాగంలో నాగలి కట్టి దున్నుతూ కలుపు మొక్కలని తొలగించాడు. ఇది చూసిన పలువురు రైతన్నలు శభాష్ రైతన్న అంటూ ప్రశంసలు కురిపించారు.

# జెండా పండుగ నాటికి విద్యార్థులకు యూనిఫాంలు

- ఇప్పటికే కేజీబీవీ స్టూడెంట్స్‌కు అందిన దుస్తులు
- చకచకా సాగుతున్న కుట్టు పని
- నాణ్యమైన యూనిఫాంల అందజేతే ప్రభుత్వం లక్ష్యం
- విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్





**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆగస్టు 15 కల్లా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫాంలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రైవేటు.. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులు మన్నికైన యూనిఫాంలు ధరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడకుండా నాణ్యమైన వస్త్రంతో తయారు చేయిస్తోంది. విద్యార్థులకు అందజేసే యూనిఫాంలకు సంబంధించిన వస్త్రం సరఫరా మొదలు కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు మఫత్‌లాల్ వంటి పేరుగాంచిన సంస్థ నుంచి యూనిఫాం వస్త్రాన్నిసేకరించింది.

ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లోని 85 వేల మంది విద్యార్థినులకు మన్నికైన యూనిఫాం చేరింది. పాఠశాలలు... గురుకులాలకు ఆగస్టు 15 నాటికి పూర్తి స్థాయిలో యూనిఫాంలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్రాండెడ్ షూ.. సాక్సులు.. టై, బెల్టులు, కస్తూర్బాగాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు పూర్తి నాణ్యత ప్రమాణాలతో కూడిన యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా అందిస్తోంది. ఇప్పటికే పలు మైనారిటీ కళాశాలల్లో విద్యార్థులకు యూనిఫాంతో పాటు టై, బెల్టులు, సాక్సులు అందాయి.

### గతంలో గందరగోళం..

గతంలో పాఠశాల విద్యా విభాగం, ఏ గురుకుల విభాగానికి ఆ గురుకుల విభాగం విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి వేర్వేరుగా కొనుగోలు చేసి అందజేసేవి.. దాంతో అనేకరకాల హెచ్చుతగ్గులు కనిపించేవి. కొన్ని పొరపాట్లు జరిగేవి.. ఆ సమస్యలను అధిగమించి సామగ్రి సేకరణ.. పంపిణీ ఒకే విధంగా ఉండేలా ఈ ఏడాది ప్రభుత్వం సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ తీసుకువచ్చింది. ఇందుకోసం రూ.687.78 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీన్ని ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే అభివృద్ధి వ్యయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది.

### జోరందుకున్న కుట్టు పని...

మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతలకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఈ క్లాత్ ను స్థానికంగా ఉండే మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టిస్తున్నారు.. ఒక్కో యూనిఫాంకు ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది. రాష్ట్రంలో మహిళా సంఘాలకు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్యం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే యూనిఫాంల కుట్టుపని జోరందుకుంది. ఆగస్టు 15 నాటికి అన్ని పాఠశాలలు.. గురుకులాలకు అందజేయ డానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

### నాణ్యమైన కిట్ ..

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు (నలుపు, తెలుపు - సాక్సులతో), బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్ తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టును ప్రభుత్వం అందజేస్తోంది.

### కాలేజీల విద్యార్థులకు కిట్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులపైనా ప్రత్యేకంగా దృష్టిసారించింది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగు, బెల్టు, టై, నల్లటి బూట్లు, సాక్సులు అందజేస్తోంది. విద్యార్థులకు యూనిఫాంతో పాటు అందజేసే కిట్ లోని ప్రతి ఒక్కటి నాణ్యతగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టెండర్లను పిలిచింది. మిగిలిన ఆర్డర్లను టీజీఎస్ సీఓ, టీజీఎల్ ఐపీసీ, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌లకు ప్రభుత్వం అప్పజెప్పింది.

### ఆర్డర్లతో ఆదాయం

యూనిఫాం, బెడ్డింగ్ ఆర్డర్లలో 25-30శాం తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో 25శాతం యూనిఫాం వస్త్రం (సుమారు 56 లక్షల మీటర్లు), 100 శాతం దుప్పట్లు (6,49,381), 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. ఈ ఆర్డర్‌తో చేనేత కార్మికులకు ఆదాయం సమకూరనుంది.

# 850 కిలోల నెయ్యి సీజ్

- రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్
- కమిషనర్ సంగీత సత్యనారాయణ వెల్లడి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు.

కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలి. తేమ శాతం 0.5 శాతానికి మించకూడదు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం--2006 ప్రకారం నిషేధం అని ఆమె వివరించారు.

### 850 కిలోల స్వాధీనం

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 15 నెయ్యి సాంపిల్స్‌ను సేకరించారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

### వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

వినియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# 'కెన్ బెట్వా' ఆందోళనకూ నేటితో 14 రోజులు

***దేశ రాజధాని ఢిల్లీ, జంతర్ మంతర్ లో కాక్రోచేస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన, సోనమ్ వాంగ్చుక్ చేస్తున్నా నిరాహార దీక్ష మనందరికి తెలిసిందే. అలాగే మధ్యప్రదేశ్ లోని కెన్ అండ్ బెట్వా ప్రాంతాలకి సంబందించిన ఆదివాసీలు కూడా గత 14రోజులుగా హంగర్ స్ట్రైక్ చేస్తున్నారు. నదుల్లోనే చితి కట్టెలు పేర్చుకొని, వాటి మీద పడుకొని, కట్టెలకు కట్టేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'కెన్-బెట్వా ప్రాజెక్ట్ మోసపూరితమైనదని, అభివృద్ధి పేరు చెప్పి ఈ ప్రభుత్వం అక్రమంగా వారి భూముల్ని లాక్కుంటుందని, నెత్తిన వున్న కొద్దిపాటి నీడని కూడా లాగేసుకొని, ఉపాధి లేకుండా చేస్తుందని, ఏ ఆధారం లేకుండా ఇక బతుకెలా బతికేదని."వాళ్ళ ఆవేదన. అది అరణ్యరోదనై పోయింది.***

ఏ ఒక్క మెయిన్ స్ట్రీమ్ మీడియా దీని గురించి మాట్లాడలేదు. అవన్నీ అమీర్ ఖాన్ మూడో పెళ్ళి గురించి, మోడీ దేశ పర్యటనల గురించి, సియా గోయల్ చేసిన మర్డర్ గురించి ఇన్ డెప్త్ అనాలసిస్ చేయడంలో, డిబేట్స్ పెట్టడంలో బిజీగా ఉన్నాయ్. ఒక మనిషిని చంపిన కారణంగా సియా గోయల్ మీద గత 20 రోజులుగా, డైలీ డే అండ్ నైట్ లైవ్ డిస్కషన్స్ అండ్ డిబేట్స్ పెడుతూనే వున్నాయి ఈ చానెల్స్. మంచి విషయమే. అదే సమయంలో, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, లీక్ అయిన నీట్ పేపర్స్ మూలాన 20కి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకొని చనిపోతే, వాటి గురించి ఏ చర్చ పెట్టలేదేందుకు? కేంద్రంలో అధికారంలో వున్న నేతలకు వ్యతిరేక మవుతుందనా? ఈ ఆత్మహత్యలన్ని, నిస్సందేహంగా ప్రభుత్వం చేసిన హత్యలే, ఇండైరెక్ట్‌గా ప్రభుత్వం చేసిన హత్యలే.. మరి వీటి మీద ఎలాంటి డిస్కషన్ గాని డిబేట్స్ గానీ మీడియా చేయలేదు... ఎందుకు చేయలేదో ప్రజలకు తెలియంది కాదు.

14 రోజులుగా ఆదివాసీలు, 'కెన్ - బెట్వా ప్రాజెక్ట్' వద్దని, కట్టెలకు తమను తాము కట్టేసుకుని నదిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ వుంటే, ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లు కూడా లేదు. దీని మీద ప్రభుత్వ వాదన ఎప్పటిలానే ఉంది. బుందేల్‌ఖండ్ ప్రాంతం తరచూ కరువుతో బాధపడుతుందని, కేన్ నదిలో వున్న అదనపు నీరుని బేత్వా నదికి మళ్లిస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, తాగునీటి సమస్య తగ్గిపోతుందని, విద్యుత్ ఉత్పత్తి కూడా జరుగుతుందని, రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది.

వాస్తవానికి ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే దౌధన్ డ్యామ్ వల్ల పెద్ద ఎత్తున అడవి, అనేక ఆదివాసీ గ్రామాలు నీటిలో మునిగిపోతాయి. అందులో మొదట పన్నా టైగర్ రిజర్వ్‌లోని వేల హెక్టార్ల అడవి నీటిలో మునిగిపోతుంది. పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, ఘరియాళ్లు, అరుదైన పక్షుల నివాస ప్రాంతాలు ధ్వంసమవుతాయి. అక్కడి ప్రజలు గ్రామాలని ఖాళీ చేయాల్సి వుంటుంది. అనేక గ్రామాలు నీటిలో మునిగిపోతాయి. ముఖ్యంగా ఆదివాసీలు, చిన్న చిన్న రైతులు వారి భూముల్ని, ఇళ్ళని కోల్పోతారు. వీటికి తోడు పర్యావరణ నష్టం కూడా వాటిల్లుతుంది. 'కేన్ నదిలో అసలు మిగులు నీరు వుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని' నీటి వనరుల నిపుణులు, పర్యావరణవేత్తలు అంటున్నారు. 'ఒక నది సహజ ప్రవాహాన్ని మరో నదికి మళ్లించడం వల్ల మొత్తం నదుల ప్రవాహంపైనే ప్రతికూల ప్రభావం పడవచ్చు' అని అంటున్నారు.

ఇవేవి పట్టించుకోని ప్రభుత్వం, అక్రమంగా వారిని వెళ్ళగొట్టి ఆ భూముల్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. వాస్తవానికి రాజ్యాంగంలోని 5 వ షెడ్యూల్ ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో నివసించే ఆదివాసీలకే అక్కడి భూమి, ఆ వనరుల మీద హక్కు వుంటుంది. 1996 పెసా ప్రకారం భూసేకరణ, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గ్రామసభ అభిప్రాయాన్ని తప్పనిసరిగా తీసుకోవాల్సి వుంటుంది. ఆదివాసీల వ్యక్తిగత, సామూహిక అటవీ హక్కులను గుర్తిస్తూ., 2006 లో షెడ్యూల్డ్ ట్రైబ్ అండ్ అదర్ ట్రెడిషినల్ ఫారెస్ట్ డ్వాల్లర్స్ (రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) యాక్ట్, (ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ - ఎఫ్‌ఆర్‌ఏ) వచ్చింది. దీని ప్రకారం అటవీ భూమిని ఇతర అవసరాలకు మార్చే ముందు, సంబంధిత గ్రామసభ సమ్మతిని (అమల్లోని విధానాల ప్రకారం) కీలకంగా పరిగణించాలి. ఒకవేళ ప్రభుత్వం భూమిని తీసుకున్నా రైట్ టు ఫెయిర్ కంపెన్సన్ ట్రాన్సపరెన్సీ అండ్ టాన్సపరెన్‌సేషన్ ఇన్ ల్యాండ్ అక్విజేషన్, రిహాబిటగేసన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం ఆ నిర్వాసితులకి న్యాయమైన పరిహారం ఇవ్వాలి. పునరావాసం కల్పించాలి. ప్రభుత్వం ఇవేవి చేయకుండా.. వాళ్ళకి ఎలాంటి ఆధారం చూపించకుండా ఎప్పటిలానే తన తరహా పద్ధతిలో గుట్టు చప్పుడు కాకుండా వీళ్ళని అడ్డు తొలగించే ప్రయత్నం చేస్తుంది.

వేల హెక్టర్ల నేల నీటి మునకలో పోతుందనే భయం, ఆందోళన మూలంగా.. "మా బతుక్కి ఏది భరోసా?" అంటూ అక్కడి ప్రజలు ఈ నెల (జులై) 3వ తారీఖు నుండి అందోళనకి దిగారు. "ఈ ప్రాజెక్ట్‌కి వ్యతిరేకంగా నిలబడ్డందుకు పోలీసుల చేత లాఠీ దెబ్బలు కూడా తిన్నాం అని, చిన్న పెద్ద తేడా లేకుండా ముసలి, ముతక దాక అంతా ఈ ప్రొటెస్ట్‌లో భాగం అయ్యారని ఆదివాసీలు ఆవేదనతో చెబుతున్నారు. 'లా చదువుతున్న ఒక అమ్మాయిపై, పోలీసులు ఏకంగా 8 తప్పుడు కేసుల్ని పెట్టారని, 14 రోజులుగా తిండి తిప్పలు లేకుండా ఇక్కడ నిరసన చేస్తున్నా, ఏ ఒక్కడు పట్టించుకోట్లేదని, కనీసం ఎవ్వరు అడగటానికి కూడా రాలే' దని కన్నీరు మున్నీరవుతున్నారు. అయినా కూడా, ఈ 'కెన్ - బెట్వా ప్రాజెక్ట్' నిరసన, పోలీసుల దౌర్జన్యాల వార్తలేవీ మన న్యూస్ చానెల్స్‌లో రావడం లేదు. ప్రజల పక్షాన, బాధితుల పక్షాన నిలబడే మీడియా ఎప్పుడో కన్ను మూసింది.

ఇక మన దేశ ప్రధాని సంగతి ఎలాగు తెలిసిందే. ఆయనకు దేశ పర్యటనలు చేసేందుకే తీరికలేదు. పైగా ఇప్పుడు ముంబైలో బోని కపూర్ బిడ్డ పెళ్ళి హడావిడిలో వున్నారు. ఇక ఈ ఆదివాసీల గోడు, సోనమ్ వాంగ్చుక్ నిరాహార దీక్షను, ప్రజాసంఘాలే పట్టించుకోవాలి. 2014 నుండి 2026 మధ్య రాష్ట్రాల వారీగా మధ్యప్రదేశ్ నుండి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు మొదలు వివిధ రాష్ట్రాల్లో ఆదివాసీ భూములపై జరిగిన ప్రధాన ప్రాజెక్టులు, వాటి వల్ల నివాసాన్ని కోల్పోయిన గ్రామప్రజల గురించి మనం వింటూనే వున్నాం, ఏళ్ళ తరబడిగా వాళ్ళు.. "జల్.. జంగల్.. జమీన్.!" నినాదాల మీద ఉద్యమాలు చేస్తూనే వున్నారు... ఎంతోమంది తమ ప్రాణాల్ని సైతం కోల్పోతున్నారు. అయినా సిగ్గులేని ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టైనా వుండదు. దేశానికి పేరు తీసుకొచ్చిన ఒక గొప్ప సైంటిస్ట్, ఇంజనీర్ 18 రోజులుగా తిండి తిప్పలు లేకుండా చావు బతుకుతుల్లో వుంటే, ఆయనను తన చావుకి తనని వదిలేసిన ప్రభు త్వం, ఈ మట్టి మనుషులు గోడు వినిపించు కుంటుందని ఆదివాసీలు అనుకోవడం వాళ్ళ అమాయకత్వమే.



- దియా విఘ్నేష్

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 జూలై 2026

# ఒక మనిషి తినడం మానేశాడు..
# ఒక దేశం వినడం మానేసింది

*ప్రజాస్వామ్యంలో ఒక మనిషి ఆమరణ నిరాహార దీక్ష చేయడం అనేది సాధారణ రాజకీయ సంఘటన కాదు. అది ఒక సమాజం యొక్క నైతిక ఆరోగ్యాన్ని పరీక్షించే క్షణం. ఎందుకంటే ఒక మనిషి తన శరీరాన్ని క్రమంగా మరణానికి అప్పగిస్తూ కూడా ఒక మాటను, ఒక డిమాండ్ ను, ఒక ఆవేదనను వినిపించడానికి ప్రయత్నిస్తున్నాడు అంటే సమస్య కేవలం ఒక రాజకీయ వివాదం కాదు. అక్కడ సంభాషణ విఫలమైంది.వినాల్సిన స్వరం వినిపించబడలేదు. ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాథమిక బాధ్యత అయిన "వినడం" అనే గుణాన్ని అది కోల్పోయింది. నేడు ప్రముఖ పర్యావరణ విద్యావేత్త సోనం వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు నాకు కనిపిస్తున్నది ఆ వ్యక్తి ఆకలి కాదు; ఒక సమాజపు అంతరాత్మ.*





ప్రజాస్వామ్యంలో మాటకు తలుపులు మూసుకుపోయాయని ఒక పౌరుడు భావించినప్పుడు అతను తన శరీరాన్ని ఒక వాదనగా మార్చుకుంటాడు. ఆమరణ నిరాహార దీక్ష వెనుక ఉన్న విషాదం ఇదే. అది ఆహారాన్ని తిరస్కరించడం కాదు. తన ఆవేదనను నిర్లక్ష్యం చేసిన వ్యవస్థను ఎదుర్కొనే చివరి ప్రయత్నం.

ఆకలి శరీరాన్ని బాధిస్తుంది. కానీ నిర్లక్ష్యం మనసుని వేధిస్తుంది. ఒక మనిషి తన సమస్యకు సమాధానం కోసం ఎదురుచూస్తూ తన స్వరం ఎక్కడా ప్రతిధ్వనించకపోతే అతను చేసిన డిమాండ్లకంటే వాటిపై కనిపించే ప్రభుత్వ మౌనమే పెద్దదిగా కనిపిస్తుంది. అక్కడే ప్రజాస్వామ్యం పరీక్షకు నిలబడుతుంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడంలోనే కాదు. ప్రజల మాటలను వినడంలో కూడా జీవిస్తుంది. నేడు సోనం వాంగ్చుక్ ఆకలితో కూర్చున్నాడు.అయితే ఆయన పోరాటం అన్నం కోసం కాదు. అది ఒక సమాజపు భవిష్యత్తు కోసం మనిషి ఎంత దూరం వెళ్ళగలడో చూపించే సంకల్పంగా మారింది. ఆయన శరీరం బలహీనపడుతున్న కొద్ది ఒక ప్రశ్న బలపడుతుంది. ఆయన ఎన్ని రోజులు నిరాహార దీక్ష చేస్తాడన్నది కాదు.ఆయన లేవనెత్తిన డిమాండ్లకు సమాధానం ఎప్పుడు వస్తుందన్నది.ఆ ప్రశ్నకు సమాధానం ఎప్పుడు వస్తుందో కాలమే చెప్పాలి. కానీ ప్రశ్న ఇంకొకటి ఉంది. ఒక పౌరుడు తన స్వరాన్ని వినిపించడానికి కాదు. వినిపించిన స్వరానికి సమాధానం పొందడానికి ఆమరణ నిరాహార దీక్ష వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒక సమాధానంతో ముగియాల్సిన విషయం ఇంత తీవ్రమైన రూపాన్ని ఎందుకు దాల్చింది?అన్నదే.

అలాంటి పరిస్థితులు ఒక్కసారిగా ఏర్పడవు. ప్రతి అధికారం కాలక్రమేనా తనకంటూ ఒక మానసిక తర్కాన్ని నిర్మించుకుంటుంది. ఆ తర్కం బలపడిన కొద్ది డిమాండ్ లోని న్యాయం కంటే అందులోని సవాలే ఎక్కువగా కనిపిస్తుంది. అప్పుడు సమస్య యొక్క న్యాయం వెనక్కి వెళ్లి అధికారపు ప్రతిష్ట ముందుకు వస్తుంది. సమాధానం ఇవ్వడం కంటే ఆలస్యం చేయడం సులభం అవుతుంది. మనిషి కంటే ఫైల్ ముఖ్యమవుతుంది.చివరికి అది ప్రజాస్వామ్యం మీదే ఒక ప్రశ్నగా నిలుస్తుంది.

ఇక్కడి నుంచే అధికారం ఒక మౌన గోడను నిర్మించుకుంటుంది. ఆ గోడ రాళ్లతో కాదు. పదాలతో నిర్మితమవుతుంది. "పరిశీలనలో ఉంది". "చర్చలు జరుగుతున్నాయి".వంటి పదాలు కొన్నిసార్లు స్పందనలా వినిపించినా, ప్రజల దృష్టిలో అవే గోడకు ఇటుకలుగా కనిపిస్తాయి. వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్ష విషయంలో కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇలాంటి విమర్శనలనే ఎదుర్కొంటుంది. ఒక మనిషి ఇంత స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు అతని ఆందోళనను గుర్తించే కనీస రాజకీయ మర్యాద కూడా కనిపించడం లేదని భావన ప్రజల్లో పెరుగుతుంది.

ఇక్కడ ప్రజలను కలవర పెడుతున్నది కేవలం వాంగ్చుక్ నిరాహార దీక్ష మాత్రమే కాదు. ఆ దీక్షకు అధికార వర్గం నుంచి కనిపిస్తున్న ప్రతిస్పందన కూడా. ఒకవైపు అతని ఆరోగ్యం క్షీణిస్తుంది అనే వార్తలు వస్తుంటే, మరోవైపు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజకీయ కార్యక్రమాలతో పాటు విందులు,వినోద కార్యక్రమాల్లో పాల్గొంటున్న దృశ్యాలు చర్చకు వస్తున్నాయి. రాజకీయంగా ఇందులో వివరణలు ఉండొచ్చు. కానీ ప్రజలు దృశ్యాలను కూడా చదువుతారు. ఒకవైపు ఆకలితో పోరాడుతున్న మనిషి, మరోవైపు కదలిక లేని అధికార ధోరణి ఈ వ్యత్యాసమే ప్రజల మనసుల్లో ఆందోళన తో పాటు అనుమానం కూడా కలిగిస్తుంది.

అయితే ఇక్కడ ప్రశ్నించాల్సింది ప్రభుత్వాన్ని మాత్రమే కాదు. సమాజాన్ని కూడా. ఎందుకంటే ప్రతి ఆమరణ నిరాహార దీక్ష ముందు ఒక అధికారం ఉంటుంది. దాని వెనుక ఒక సమాజం కూడా ఉంటుంది. ఒక మనిషి తన జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టుకునే స్థితికి చేరుకున్నప్పుడు అక్కడ ఒక వ్యక్తి మాత్రమే కనిపించడు.వ్యవస్థ యొక్క వైఫల్యం కూడా కనిపిస్తుంది.అందుకే అతను మన ముందుంచిన నైతిక సవాలను విస్మరించే హక్కు ఎవరికీ లేదు. నేడు ప్రమాదం ప్రభుత్వం మౌనం మాత్రమే కాదు సమాజం అలవాటు పడిన మౌనం కూడా.

అందుకే నేడు మన ముందున్న దృశ్యంలో కనిపిస్తున్నది ఒక ఆమరణ నిరాహార దీక్ష మాత్రమే కాదు. ఒక అద్దం. ఆ అద్దంలో వాంగ్చుక్ మాత్రమే కనిపించడం లేదు. మన రాజకీయ సంస్కృతి, అధికారపు అహంకారం కనిపిస్తోంది. ఒక మనిషి తన శరీరాన్ని నిరసనగా నిలబెట్టాడు. ఆ ప్రయత్నానికి సమాధానం ఈరోజు రాకపోవచ్చు.రేపూ రాకపోవచ్చు. కానీ చరిత్రకు ఒక అలవాటు ఉంది. అది ఆకలితో కూర్చున్న మనిషిని మాత్రమే గుర్తుంచుకోదు. అతను అడిగిన జవాబుదారితనాన్ని ఎవరు స్వీకరించారు. ఎవరు వినన‌ట్టుగా నటించారు.అన్నదాన్ని కూడా గుర్తుపెట్టుకుంటుంది. ప్రజలు తీర్పు చెప్పడానికి ఆలస్యం చేయవచ్చు. కానీ చరిత్ర ఎప్పుడు ఆలస్యం చేయదు.



**ఆయిరబోయిన బిక్షపతి.**
**(అగల్ జోయా).**
**7993248717.**

# టెలికాం వినియోగదారుడి స్వరం వినేదెవరు?

ఒకప్పుడు మొబైల్ ఫోన్ అంటే మాట్లాడుకోవడానికి మాత్రమే ఉపయోగపడే సాధనం. నేడు అది మన బ్యాంకు, కార్యాలయం, తరగతి గది, మార్కెట్, ప్రభుత్వ సేవలకు ప్రధాన ద్వారం. యూపీఐ లావాదేవీల నుంచి టెలీమెడిసిన్ వరకు, ఆన్‌లైన్ విద్య నుంచి అత్యవసర సేవల వరకు ప్రతి రంగం ఇప్పుడు టెలికాం నెట్‌వర్క్‌పైనే ఆధారపడుతోంది. డిజిటల్ ఇండియా విజయగాథకు టెలికాం రంగమే ప్రధాన ఆధారం. అయితే కనెక్టివిటీ ఒక మౌలిక అవసరంగా మారిన ఈ సమయంలో, వినియోగదారుల హక్కులు కూడా అంతే ప్రాధాన్యం పొందుతున్నాయా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. భారత టెలికాం రంగం 5జీ విస్తరణలో వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ, ఒక రంగం విజయాన్ని టవర్ల సంఖ్యతో, డేటా వినియోగంతో లేదా సాంకేతిక పురోగతితో మాత్రమే కొలవలేం. చివరకు సేవను వినియోగించే పౌరుడి అనుభవమే అసలైన ప్రమాణం. ఈ కోణంలో చూస్తే సాధారణ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు చిన్నవిగా కనిపించినా, వాటి ప్రభావం మాత్రం పెద్దది. కాల్‌కు ముందు వినిపించే రికార్డెడ్ సందేశాలు అందులో ముఖ్యమైనవి. రీఛార్జ్ గడువు సమీపిస్తోందని గుర్తు చేయడం తప్పు కాదు. కానీ ఆ సమాచారం ఇవ్వడానికి కాల్ కనెక్ట్ కావడానికే ఆలస్యం చేయడం ఎంతవరకు సమంజసం? వైద్య అత్యవసరం కావచ్చు, ప్రమాదం కావచ్చు, కుటుంబ అత్యవసరం కావచ్చు. అలాంటి సందర్భాల్లో ప్రతి సెకను విలువైనదే. ముందుగా కాల్ కనెక్ట్ కావాలా? లేక రీఛార్జ్ గుర్తు చేయాలా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. సాంకేతికంగా కాల్‌కు ఆటంకం కలిగించకుండా అదే సమాచారాన్ని అందించే అవకాశం ఉన్నప్పుడు, వినియోగదారుడి సౌకర్యానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

సేవల నాణ్యత విషయంలోనూ వినియోగదారుల అసంతృప్తి పెరుగుతోంది. 5జీ సేవలపై భారీ అంచనాలు ఏర్పడినా, అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయి సేవలు అందడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కాల్‌లు మధ్యలో నిలిచిపోవడం, భవనాల లోపల సిగ్నల్ బలహీనంగా ఉండటం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోలేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఏ ప్రాంతంలో ఏ స్థాయి సేవ అందుబాటులో ఉందో స్పష్టంగా తెలియజేయడం, సేవల నాణ్యతపై పారదర్శక సమాచారాన్ని అందించడం సంస్థల బాధ్యత.

కస్టమర్ సేవల విషయంలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కృత్రిమ మేధ యంత్రాలు సాధారణ ప్రశ్నలకు ఉపయోగపడతాయి. కానీ క్లిష్టమైన సమస్యల విషయంలో బాధ్యతగల అధికారితో నేరుగా మాట్లాడే అవకాశం లేకపోవడం వినియోగదారులను నిరాశకు గురిచేస్తోంది. సాంకేతికత మానవ సేవకు ప్రత్యామ్నాయం కాకూడదు. దానికి తోడ్పడే సాధనంగా మాత్రమే ఉండాలి. ఈ పరిస్థితికి మార్కెట్ నిర్మాణంలో వచ్చిన మార్పులు కూడా ఒక కారణంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు అనేక సంస్థల మధ్య తీవ్రమైన పోటీ ఉండేది. నేడు మార్కెట్ కొద్దిమంది ప్రధాన సంస్థల చుట్టూ కేంద్రీకృతమైంది. పోటీ తగ్గినప్పుడు ధరలు మాత్రమే కాదు, సేవల నాణ్యత, వినియోగదారుల ఎంపికలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో టెలికాం నియంత్రణ సంస్థ పాత్ర మరింత కీలకంగా మారుతోంది. వినియోగదారుల హక్కులను కాపాడడంలో నిబంధనలు రూపొందించడం మాత్రమే సరిపోదు. అవి సమర్థంగా అమలవుతున్నాయా? ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కారమవుతున్నాయా? సేవల నాణ్యతపై సంస్థలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాయా? అనే అంశాలను కూడా కఠినంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత నియంత్రణ వ్యవస్థపై ఉంది.

టెలికాం రంగం విజయాన్ని ఇకపై కొత్త టవర్లు, కొత్త సాంకేతికత లేదా పెరుగుతున్న డేటా వినియోగంతో మాత్రమే కొలవలేం. ఒక సాధారణ వినియోగదారుడు ఎలాంటి ఆటంకం లేకుండా కాల్ చేయగలుగుతున్నాడా? తన అవసరానికి తగిన ప్రణాళికను స్వేచ్ఛగా ఎంచుకోగలుగుతున్నాడా? తన ఫిర్యాదుకు సకాలంలో పరిష్కారం పొందగలుగుతున్నాడా? అనే ప్రశ్నలే అసలైన ప్రమాణాలు. డిజిటల్ భారత్ నిర్మాణం అంటే ప్రతి గ్రామానికి సిగ్నల్ చేరడం మాత్రమే కాదు; ప్రతి వినియోగదారుడికి న్యాయం చేరడం కూడా.

**కింజరాపు అమరావతి**
**kinjarapuamaravathi588@gmail.com**

## తెలివైన మోసం

ఓట్లు కొంటాడు స్వలాభ పంటకు
నోట్లెరువు వేస్తాడు గెల్పు పంటకు
గెలుపు ధర పలుకుతుంది సీటుకు
అమాయక ఓటర్లు మోసంతో ఇంటికి


**రేడియమ్**
**9291527757**



# కాంక్రీట్ వనంలో శ్వాసకోస రోదన

## మన నగరాలకు పచ్చని ఊపిరి ఎప్పుడు?

మనిషి పుట్టింది ప్రకృతి ఒడిలోనే. కానీ, కాలక్రమేణా ఆ ప్రకృతిని కాదనుకుని ఇటుకలు, సిమెంట్, ఇనుముతో కూడిన ఓ పెద్ద కాంక్రీటు సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. అదే మన ఆధునిక నగరం. ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, ఆధునిక వసతుల వేటలో మనుషులు పల్లెలను వదిలి పట్టణాల వైపు పరుగు తీస్తున్నారు. ఈ క్రమంలోనే మన నగరాలు రోజురోజుకూ విస్తరిస్తూ, పచ్చదనాన్ని మింగేస్తూ, శ్వాస తీసుకోడానికే కష్టపడుతున్నాయి. ఒకప్పుడు వేయి సరస్సుల నగరం గా, చల్లని గాలులకు నిలయంగా పేరొందిన హైదరాబాద్‌లో ఇవాళ మండుటెండల్లో ఓ చిన్న చెట్టు నీడ కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నగరాల్లో పచ్చదనం తగ్గితే కేవలం ఉష్ణోగ్రతలు పెరగడం మాత్రమే కాదు, మనిషి శారీరక, మానసిక జీవన నాణ్యత మొత్తం అతలాకుతలం అవుతుందని పర్యావరణ నిపుణులు ఘోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని, ప్రభుత్వ చర్యలను విస్తృతంగా పరిశీలించాల్సి ఉంది.



**కనుమరుగవుతున్న చెరువులు.. కుంచించుకుపోతున్న పచ్చదనం:**

హైదరాబాద్ నగర పరిధిలో, దాని చుట్టుపక్కల శివారు ప్రాంతాల్లో కలిపి ఒకప్పుడు మొత్తం 1,728 చెరువులు ఉండేవని చరిత్ర పుటలు, పాత మ్యాపులు స్పష్టంగా చెబుతున్నాయి. అయితే, గత నాలుగైదు దశాబ్దాలుగా సాగిన వేగవంతమైన, ప్రణాళికారహిత నగర విస్తరణలో ప్రస్తుతం కేవలం 700 చెరువులే మిగిలాయి. అంటే వెయ్యికి పైగా సహజ జల వనరులను మనం పూర్తిగా కనుమరుగయ్యేలా చేసుకున్నాం. ఇటీవలి అధికారిక గణాంకాల ప్రకారం చూసినా, అక్రమ కబ్జాల కారణంగా హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతంలో 282 చెరువులు పూర్తిగా మాయమవగా, మరో 209 చెరువులు తమ సహజ ఆనవాళ్లనే కోల్పోయి చిన్న గుంటలుగా మారిపోయాయి. వీటిలో 44 చెరువులు వందశాతం కబ్జాకు గురయ్యాయని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా వెల్లడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నిజానికి, చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు. అవి నగర శీతోష్ణస్థితిని సమతుల్యంగా ఉంచే సహజసిద్ధమైన ఎయిర్ కండిషనర్లు. వర్షం పడినప్పుడు ఆ నీటిని ఇంకించే పెద్ద స్పాంజిలు. పక్షులు, జలచరాలు, చిన్నచిన్న వన్యప్రాణులకు అవి జీవనాధార ఆవాసాలు. అలాంటి వనరులు కనుమరుగైతే అకాల వరదలు రావడం, భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోవడం, వాతావరణం విపరీతంగా వేడెక్కడం వంటి దుష్పరిణామాలు తప్పవు.

**జీవన నాణ్యతపై పడుతున్న ప్రత్యక్ష దెబ్బ:**

పచ్చదనం మరియు జల వనరులు తగ్గినప్పుడు నగరాల్లో "అర్బన్ హీట్ ఐలాండ్" ప్రభావం తీవ్రమవుతుంది. అంటే కాంక్రీటు కట్టడాలు, తారు రోడ్లు, ఎత్తైన భవనాలు పగటిపూట సూర్యరశ్మి ద్వారా వచ్చే వేడిని ఎక్కువగా పీల్చుకుని, రాత్రిపూట కూడా ఆ వేడిని వాతావరణంలోకి వదులుతాయి. దీనివల్ల రాత్రి పూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గవు. దీని పర్యవసానంగా పట్టణ ప్రజల్లో వడదెబ్బలు, శ్వాసకోశ సమస్యలు, తీవ్రమైన గుండె జబ్బులు పెరుగుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.మొక్కలు, చెట్లు లేని ప్రాంతాల్లో వాహనాల కాలుష్యం, ధూళి కణాలు నేరుగా గాలిలో కలిసిపోయి శ్వాసకోశాల్లోకి చేరుతాయి. ఇది ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అంతేకాక, పచ్చదనం లోపించిన ఇరుకైన పరిసరాల్లో నివసించే ప్రజల్లో మానసిక ఒత్తిడి, ఆందోళన స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటాయని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పార్కులు, చెరువు గట్లు, మైదానాలు లేని కాలనీల్లో పిల్లలకు ఆటస్థలాలు కరువవుతున్నాయి. పెద్దలకు ఉదయం పూట నడవడానికి, వ్యాయామం చేయడానికి స్థలం దొరకడం లేదు. ఫలితంగా ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు పట్టణ జనాభాను వేగంగా కబళిస్తున్నాయి.

**తెలంగాణ ప్రభుత్వ చర్యలు: హరిత హారం, హైడ్రా పాత్ర:**

ఈ పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మునుపటి కంటే 33 శాతానికి పెంచాలనే ఉద్దేశంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖలతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వంటి సంస్థలు సంయుక్తంగా ఈ పచ్చదనం పెంపును పర్యవేక్షిస్తున్నాయి. గడిచిన కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, 2024 లో 20.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, అందులో 16.75 కోట్ల (దాదాపు 84 శాతం) మొక్కలను నాటగలిగారు. 2025 వ సంవత్సరంలో 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని, అందులో 15.64 కోట్ల మొక్కలను నాటడం జరిగింది. ఇక ఇటీవలి కాలంలో చూసుకుంటే, ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఏకంగా 10 కోట్ల మొక్కలను నాటి 99 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇవన్నీ కాగితాలపై సానుకూల పరిణామాలే అయినప్పటికీ, నాటిన మొక్కల్లో వాస్తవంగా ఎన్ని బతికి పెద్ద వృక్షాలుగా మారుతున్నాయనేదే ఇక్కడ క్షేత్రస్థాయిలో ఉన్న అసలైన ప్రశ్న.మరోవైపు, నగరంలో కనుమరుగవుతున్న చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చెరువుల కబ్జాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల కాలంలో ఐటీ కారిడార్, కోకాపేట, మాదాపూర్ వంటి అత్యంత ఖరీదైన పరిసరాల్లో దాదాపు రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు శిఖం భూములను అక్రమ కట్టడాల నుంచి విడిపించి స్వాధీనం చేసుకుంది. శేరిలింగంపల్లి పరిధిలోని ఈదులకుంట చెరువును ఏకంగా రెవెన్యూ మ్యాప్ నుంచే తొలగించి నిర్మించేందుకు చేసిన పెద్ద యత్నాన్ని సైతం, హైడ్రా సంస్థ తన శాటిలైట్ చిత్రాల ఆధారంగా గుర్తించి అడ్డుకుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో కబ్జాలు జరగకుండా ఉండేందుకు నగరంలోని 264 కీలకమైన చెరువులపై 900 సీసీ కెమెరాలతో కూడిన అత్యాధునిక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇలాంటి గట్టి చర్యలు నగర జల వనరులను, తద్వారా స్థానిక పర్యావరణాన్ని కాపాడటానికి ఎంతో దోహదపడతాయి.


**ముందున్న పరిష్కార మార్గాలు.. పౌరుల బాధ్యత:**

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కేవలం ప్రభుత్వ చట్టాలు, అధికారిక కార్యక్రమాలు మాత్రమే సరిపోవు. ఇందులో ప్రజల భాగస్వామ్యం, దీర్ఘకాలిక ప్రణాళికలు అత్యంత కీలకం. కేవలం లక్షల సంఖ్యలో మొక్కలు నాటడం కాకుండా, నాటిన ప్రతి మొక్కకూ దత్తత పద్ధతిలో స్థానిక పౌరులకు లేదా సంస్థలకు బాధ్యత అప్పగించాలి. వాటి మనుగడ రేటును పెంచేలా కఠిన పర్యవేక్షణ చేయాలి.ప్రతి కొత్త లేఅవుట్, గేటెడ్ కమ్యూనిటీ నిర్మించేటప్పుడు, ఆ స్థలంలో నిర్దిష్ట శాతం భూమిని పచ్చదనానికి మరియు వర్షపు నీటి ఇంకుడు గుంతలకు కేటాయించడాన్ని చట్టబద్ధంగా తప్పనిసరి చేయాలి. స్థలం తక్కువగా ఉండే నగర ప్రాంతాల్లో భవనాల పైకప్పులపై టెర్రస్ గార్డెన్స్, ఫ్లైఓవర్ పిల్లర్లు, పెద్ద గోడల వెంట నిలువు తోటలను (వర్టికల్ గార్డెన్స్) విరివిగా ప్రోత్సహించాలి. చెరువులు, కుంటల చుట్టూ ఉన్న బఫర్ జోన్లను ఖచ్చితంగా గుర్తించి, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలకూ అనుమతులు ఇవ్వకూడదు. స్థానిక పాఠశాలలు, కాలేజీల్లో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక తరగతులు, ప్రాజెక్టులు నిర్వహించి, రేపటి తరాన్ని ప్రకృతి ప్రేమికులుగా మార్చాలి.

నగరమంటే కేవలం రద్దీ రోడ్లు, ఎత్తైన భవనాలు, ఐటీ పార్కులు, ట్రాఫిక్ సిగ్నళ్లు మాత్రమే కాదు. అది మనుషులు, జంతువులు, చెట్లు, నీటి వనరులు అన్నీ కలిసి సామరస్యంగా జీవించాల్సిన ఒక సజీవ పర్యావరణ వ్యవస్థ. తెలంగాణ ప్రభుత్వం హరిత హారం, హైడ్రా వంటి వినూత్న చర్యల ద్వారా సరైన దిశలోనే అడుగులు వేస్తున్నప్పటికీ, నిజమైన మార్పు అనేది సమాజంలోని ప్రతి పౌరుడి నుంచి రావాలి. మన వంతు బాధ్యతగా ఇంట్లోనో, వీధిలోనో ఒక్క మొక్కనైనా నాటి, దాన్ని ప్రాణప్రదంగా కాపాడుకోవాలి. పచ్చదనం తగ్గితే మనం కోల్పోయేది కేవలం చెట్లను మాత్రమే కాదు, మన ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను, మన భవిష్యత్తు తరాల జీవన భద్రతను కూడా. ఈ చేదు సత్యాన్ని సకాలంలో గుర్తించి పర్యావరణ పరిరక్షణ వైపు ముందడుగు వేయడమే నేడు మనందరి తక్షణ కర్తవ్యం!

**డా . సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# ఆదిలోనే హంస పాదు
# హెల్త్ కార్డులు ఎక్కడ?




ప్రకటించినప్పుడు ప్రజలు కేవలం ప్రకటనను కాదు, దాని వెనుక ఉన్న నమ్మకాన్ని విశ్వసిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లు వంటి వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీ ఒక పరిపాలనా ప్రకటన మాత్రమే కాదు, వారి జీవిత భద్రతకు ఇచ్చే హామీ కూడా. అలాంటి అత్యంత కీలకమైన ఆరోగ్య భద్రతా పథకమైన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలులో తెలంగాణ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం మరోసారి ప్రభుత్వ వాగ్దానాల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రకటించిన తేదీకి డిజిటల్ హెల్త్ కార్డులు అందించలేకపోవడం, నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తి చేయకపోవడం, అమలు మార్గదర్శకాలు కూడా సిద్ధం చేయకపోవడం పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ.

ఆరోగ్య భద్రత అనేది ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే జీతభత్యాల కంటే తక్కువ ప్రాధాన్యం ఉన్న అంశం కాదు. ఉద్యోగ జీవితమంతా ప్రభుత్వానికి సేవ చేసిన వ్యక్తులు వృద్ధాప్యంలో ఎక్కువగా ఎదుర్కొనేది అనారోగ్య సమస్యలనే. గుండె జబ్బులు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, కీళ్ల సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెన్షనర్లలో అధికంగా కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో నగదు రహిత వైద్య సేవలు వారికి విలాసం కాదు, జీవనావసరం. ఒకసారి పెద్ద ఆసుపత్రిలో చికిత్స అవసరమైతే లక్షల రూపాయల ఖర్చు అవుతోంది. భారతదేశంలో మొత్తం ఆరోగ్య వ్యయంలో ఇప్పటికీ కుటుంబాలే నేరుగా భరించే వ్యయం సుమారు నలభై శాతం వరకు ఉందని వివిధ ఆరోగ్య అధ్యయనాలు సూచిస్తున్నాయి. అనారోగ్యం కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుంటే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బలమైన ఆరోగ్య భద్రతా వ్యవస్థ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.

ఇక్కడ మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్ల నుంచి ఆరోగ్య పథకం కోసం విరాళాల రూపంలో మొత్తాలను మినహాయించడం ప్రారంభించింది. ఉద్యోగులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. అయితే ప్రభుత్వం మాత్రం అదే స్థాయిలో తన బాధ్యతను నిర్వర్తించలేకపోయింది. నిధులు వసూలు చేసి సేవలు అందించకపోతే అది పరిపాలనా వైఫల్యమే కాకుండా నైతిక ప్రశ్న కూడా అవుతుంది. ఉద్యోగుల నుంచి డబ్బు తీసుకోవడంలో చూపిన వేగం, వారికి హెల్త్ కార్డులు ఇవ్వడంలో ఎందుకు కనిపించలేదు అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే.

ఇంకా ఒక కీలకమైన అంశం ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల అభ్యంతరాలు. ప్రభుత్వం నిర్ణయించిన ప్యాకేజీ ధరలు ప్రస్తుత వైద్య ఖర్చులకు సరిపోవని ఆసుపత్రులు చెబుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఖర్చు నియంత్రించాలని చూస్తుంటే, మరోవైపు ఆసుపత్రులు తమ నిర్వహణ వ్యయాలను చూపుతున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య సమన్వయం సాధించకుండా పథకాన్ని ప్రకటించడం ముందుచూపు లేని నిర్ణయం. ఆసుపత్రులు సేవలు అందించకపోతే హెల్త్ కార్డులు చేతిలో ఉన్నా ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందువల్ల ఈ సమస్యను పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించాలి. ప్రభుత్వం, వైద్య నిపుణులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల మధ్య పారదర్శకమైన చర్చలు జరగాల్సిన అవసరం ఉంది.

ఇక్కడ ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిన మరో వాస్తవం ఏమిటంటే, ప్రభుత్వ ఉద్యోగి కూడా చివరకు ఒక సాధారణ పౌరుడే. అతను తన జీవితంలో అత్యంత ఉత్పాదకమైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేస్తాడు. పదవీ విరమణ తర్వాత అతనికి అవసరమయ్యేది కొత్త హామీలు కాదు, ఇప్పటికే ఇచ్చిన హామీల అమలు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఆసుపత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా ఆరోగ్య భద్రత కల్పించడం సంక్షేమ ప్రభుత్వ లక్షణం. హెల్త్ కార్డు లేక అత్యవసర చికిత్స ఆలస్యమైతే దాని ప్రభావం కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాదు, ప్రాణనష్టం కూడా కావచ్చు.

తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ రాష్ట్రంగా తనను తాను తరచూ ప్రకటించుకుంటుంది. అలాంటప్పుడు సంక్షేమం అంటే కొత్త పథకాల ప్రకటనలు మాత్రమే కాదు, ప్రకటించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం కూడా. ప్రతి పథకం ప్రారంభోత్సవం ఒక ప్రచార కార్యక్రమంగా మారి, అమలు మాత్రం నిరవధికంగా వాయిదా పడితే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకులు కాదు. వారు ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్వాములు. వారి నమ్మకాన్ని కోల్పోతే పరిపాలనా వ్యవస్థపై కూడా దాని ప్రభావం పడుతుంది.

ఈ సమస్యకు పరిష్కారం కూడా అంత క్లిష్టమైనది కాదు. ముందుగా ప్రభుత్వం డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి ఖచ్చితమైన గడువును ప్రకటించి, ఆ గడువును తప్పకుండా పాటించాలి. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి మినహాయించిన నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత చూపాలి. నెట్‌వర్క్ ఆసుపత్రుల పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించే కార్యాచరణ ప్రకటించాలి. వైద్య సేవల ప్యాకేజీ ధరలను శాస్త్రీయ అధ్యయనం ఆధారంగా పునఃసమీక్షించాలి. అత్యవసర చికిత్సలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే ప్రత్యేక హెల్ప్‌డెస్క్, ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో సమన్వయ అధికారులను నియమించి ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించే విధానం తీసుకురావాలి.

ముఖ్యమంత్రి స్వయంగా ఈ అంశాన్ని సమీక్షించడం కూడా అవసరం. ఎందుకంటే ఇది కేవలం ఒక శాఖకు సంబంధించిన పరిపాలనా సమస్య కాదు. లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు సంబంధించిన సామాజిక బాధ్యత. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రజాస్వామ్య పాలనలో కనీస ప్రమాణం. ఆ ప్రమాణాన్ని నిలబెట్టడంలో విఫలమైతే ప్రజల విశ్వాసం క్రమంగా దెబ్బతింటుంది.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. వారి జీతాల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్న నిధులకు తగిన సేవలు మాత్రమే కోరుతున్నారు. పెన్షనర్లు అదనపు వరాలు అడగడం లేదు. వృద్ధాప్యంలో అనారోగ్య భారాన్ని తగ్గించే కనీస ఆరోగ్య భద్రత మాత్రమే కోరుతున్నారు. ఇది వారి హక్కు, ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా ఈ హెల్త్ కార్డుల వ్యవహారాన్ని అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకోవాలి. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని నెట్‌వర్క్ ఆసుపత్రులు, ఉద్యోగ సంఘాలు, సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి అన్ని వివాదాలకు ముగింపు పలకాలి. ప్రకటించిన పథకం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఉద్యోగి, ప్రతి పెన్షనర్ చేతిలో పనిచేసే హెల్త్ కార్డుగా, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్య సేవగా మారినప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీకి నిజమైన అర్థం ఉంటుంది. అదే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పరిపాలనకు అసలైన ప్రమాణం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూలై 17 (జనం సాక్షి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా రాణించాలంటే విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రభుత్వ ఎంఏఎల్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్ లో భాగంగా కంప్యూటర్, ఏఐ టెక్నాలజీపై పాఠశాల విద్యార్థులకు థియరీతోపాటు ప్రయోగపూర్వకంగా అవగాహన కలిగేలా బోధించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు తరచూ గైర్హాజరైతే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను అర్థం చేసుకోలేకపోతారని, ప్రతి నిత్యం వస్తేనే వివిధ పాఠ్యాంశాలపై మంచి పట్టు సాధించవచ్చన్నారు. వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, 2026-27 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల నుంచే జిల్లా టాపర్ ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఈ పాఠశాలలో అదనపు తరగతి గదులు కూడా నిర్మించడంతో ప్రవేశాలు ఇంకా పెరగాలని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు విష్ణును ఆదేశించారు.

**యస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

అంతకుముందు 16వ వార్డ్ భీమ్ నగర్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 256కు సంబంధించి బిఎల్ ఓలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరికైనా రెండు ఓట్లు ఉంటే గుర్తించి వారు ఏదో ఒక చోటే మ్యాపింగ్ అయ్యేలా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఓటర్లకు ఇచ్చిన ఎన్నిమరేషన్ పత్రాలను పూరించాక తిరిగి తీసుకొని డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకే ఎన్నికల సంఘం ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, ఎన్నికల డిటీ ఉదయ్ కిరణ్,ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ తిమ్మప్ప, బిఎల్ఓ సునీత, తదితరులున్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ యోగేష్



**శంకర్‌పల్లి, జూలై 17 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ పేర్కొన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితా సవరణలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంకా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి వెంటనే ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో లేదా సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలని కోరారు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని ఓటర్ తమ ఓటు హక్కును కోల్పోతారని, సమర్పించని యెడల ఓటరు దే బాధ్యతని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగ రెడ్డి, కౌన్సిలర్స్, పార్టీల ప్రతినిధులు,మేనేజర్ అంజన్ కుమార్, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సభను విజయవంతం చేయండి

**ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, జూలై 17 (జనం సాక్షి) :** నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జూలై 18న ఉదయం 10 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు యువత సమస్యలపై పార్టీ కార్యాచరణను ప్రకటించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## మల్కాజ్‌గిరి సమస్యలపై ఆర్మీ ఉన్నతాధికారితో ఎమ్మెల్యే భేటీ



**అల్వాల్, జూలై 17 (జనంసాక్షి) :** మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతానికి తెలంగాణ - ఆంధ్ర సబ్ ఏరియా ప్రధాన కార్యాలయంలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) శ్రీనివాస్ వీఎస్ఎంను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. మచ్చబొల్లారం ప్రాంతంలో చెత్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు డైరీ ఫామ్ రోడ్డులోని ఆర్మీ భూమిలో ఒక ఎకరం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే అదనపు రహదారుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాల, ఆర్మీ భూముల సరిహద్దు సమస్యను విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. యాప్రాల్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చి, వలేరియన్ గ్రామర్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఆర్మీ రహదారిపై బస్సులు సహా ప్రజా రవాణా నిరంతరాయంగా సాగేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌకూర్‌లోని శ్రీ సాయి రక్ష అవెన్యూ నివాసుల సంక్షేమ సంఘం సమీపంలో ఆర్మీ శిక్షణ సమయంలో సంభవిస్తున్న పేలుళ్ల ప్రభావంతో ఇళ్ల గోడలు, కిటికీలు దెబ్బతింటున్నాయని, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కౌకూర్ దర్గా నుంచి సింగయిపల్లి బిట్స్ పిలానీ వెళ్లే మార్గానికి అవసరమైన అనుమతుల అంశంపైనా చర్చించి, ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతులను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని జీఓసీ శ్రీనివాస్ వీఎస్ఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంతో మల్కాజ్‌గిరి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పలు సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, చక్రపాణి రెడ్డి, ఫాదర్ వినయ్ రెడ్డి, భరత్, సంబంధిత కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కాటేదాన్‌లో వైభవంగా శ్రీజగన్నాథ రథయాత్ర



**శంషాబాద్, జూలై 17 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ డివిజన్ టాటా నగర్‌లో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర భక్తుల హరేకృష్ణ నామస్మరణలు, కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలతో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగిందని తెలిపారు. అనంతరం స్వామివారికి మహా హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శీను, కిలారి వెంకటరమణ, భీమ రాయుడు, నరేష్, వీరస్వామి, మోహన్, రిషి, గణేష్, సుధామా, బాపి, బాబు, నీళ్ల సిద్ధూ, రామ్, పింటూ, దిలీప్, పింటూ ఒడిశాకు చెందిన శ్రీ జగన్నాథ స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాంకేతికతతో మరింత సమర్థ పోలీసింగ్

- కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును సమీక్షించిన జిల్లా ఎస్పీ



**గద్వాల నడిగడ్డ, జూలై 17 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీస్ కంట్రోల్ రూమ్, కమాండ్ కంట్రోల్ సెంటర్,ఐటీ సెల్ విభాగాల పనితీరును జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శుక్రవారం సమీక్షించారు. కార్యాలయాల పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సాంకేతిక పరికరాల వినియోగం, సేవల నాణ్యతను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థలో పోలీస్ కంట్రోల్ రూమ్ సమన్వయానికి కేంద్ర బిందువుగా పనిచేస్తుందని, ఐటీ సెల్ జిల్లాలో నమోదయ్యే నేరాల దర్యాప్తుకు సాంకేతిక సహకారం అందించడంతో పాటు గద్వాల పట్టణం లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యాలయాల్లోని కంప్యూటర్లు, ఇతర పరికరాలు, రికార్డులను ఎప్పటికప్పుడు శుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని, 5ఎస్ విధానానికి అనుగుణంగా పరిశుభ్రత, రికార్డు నిర్వహణ ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. డయల్ 100, పెట్రో కార్లు, నైట్ పెట్రోలింగ్, హైవే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, బీట్ సిబ్బంది కార్యకలాపాలను కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సమయంలో సమన్వయం చేయాలని సూచించారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లా కేంద్రంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అనుమానాస్పద కదలికలను గుర్తించి సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించడం ద్వారా నేరాల నివారణకు మరింత సమర్థవంతంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై వెంకట్‌స్వామి, ఐటీ సెల్ ఎస్సై షకూర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు అభ్యర్థులు పూర్తి అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.శుక్రవారం జిల్లా కేంద్రం లోని అశోక్ నగర్ కు వెళ్లే మార్గంలో గల లయన్స్ క్లబ్ భవనంలో ఆ క్లబ్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ యువకులను ఉద్దేశించి ఆమె మాట్లాడు తూ సుమారు 15 సంవ త్సరాల క్రితం తాను కూడా ఇలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యాననీ తెలిపారు. ఇప్పటికీ ఎంతో మంది ఆసక్తితో చదువుకో వడం చూస్తే చాలా సంతోషంగాఉంటుందన్నారు. శిక్షణ పొందుతున్న వారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాయబోయేది కేవలం ఒక పరీక్ష మాత్రమే. మనం 10వ తరగతి, ఇంట ర్మీడియట్, డిగ్రీ పరీక్షలు ఎలా రాశామో, ఇదీ అలాంటి మరో పరీక్షగానే భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణ బట్టాడ్,ఆత్మారామ్ ఎడ్కే, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, శ్రీనివాస్ లాహోటీ, బాలాజీ, జనార్దన్, సచిన్ మంగగ్లీ, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతూ పట్టుబడిన 11 మంది అరెస్ట్



**మర్పల్లి, జూలై 17 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మర్పల్లి ఎస్సై అబ్దుల్ రావుఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి కోమటి రాజు పొలం దగ్గర పేకాట ఆడుతున్నారని నమ్మదగ్గ సమాచారం మేరకు అక్కడికి వెళ్ళాము. అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నాము. వారి వద్ద నుండి 25 వేల 840 రూపాయలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత జూదానికి తోపాటు చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. యువత ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలని అన్నారు.

## తాండూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల అక్రమాలపై బీజేపీ ఆందోళన

- అర్హులకే ఇళ్లు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**తాండూరు, జూలై 17 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో జరుగుతున్న అక్రమాలను ఎత్తిచూపుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు మెమోరాండం సమర్పించారు. బీజేపీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కమిషనర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అక్రమాలు - వెంటనే విచారణ జరపాలి.

**సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాలపై ఫిర్యాదు**

తాండూరు మున్సిపాలిటీలో డీఈ, మేనేజర్ సిబ్బంది కొరతతో కార్యాలయం కుంటుపడుతోందని, వెంటనే పర్మినెంట్ డీఈ, మేనేజర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, 33వ వార్డు కౌన్సిలర్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బందారు శ్రీకాంత్, పట్టణ మైనార్టీ మోర్చా అధ్యక్షులు షాబుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బిచ్చప్ప, చందు, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు

- మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై. మహేందర్ రెడ్డి



**మోమిన్‌పేట, జూలై 17 (జనం సాక్షి) :** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని అందించే పంటను సాగు చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇజ్రా చిట్టంపల్లి అనుబంధ గ్రామం పల్లెగుట్ట తండాలో రైతు సుభాష్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఆయిల్ ఫామ్ పెంపకంపై రైతులకు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించక పోవడంతో ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయలేక మండలం వెనుకబడి పోతుందని సంబంధిత అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 1000 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట వేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఎంఏ సత్తార్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణారెడ్డి, మండల ఉద్యానవన శాఖ అధికారి అక్షిత రెడ్డి, గ్రామ సర్పంచ్ వందన విజయ్, హెచ్ ఈ ఓ రాజేందర్, డ్రిప్పు ఇన్చార్జి వీరేష్, మండల పార్టీ అధ్యక్షులు మన్నేశంకర్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ సిరాజుద్దీన్ వెంకట్ రెడ్డి,చంద్రయ్య, దన్ గరి నర్సింలు, ఆనందం, లాయకలి, ఆయా గ్రామాల రైతులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 20న చలో రంగారెడ్డి కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి



**హయత్‌నగర్, జూలై 17 (జనం సాక్షి) :** భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 20న నిర్వహించే 'చలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీడబ్ల్యూఎఫ్ఐ) నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని లేబర్ అడ్డా వద్ద శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. సీడబ్ల్యూఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి పొట్టేపాకు రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ఇన్సూరెన్స్, హెల్త్ పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం - 1996 బలహీనపడే ప్రమాదం ఉందని అన్నారు. సామాజిక భద్రత కోడ్ పేరుతో వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని, సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగిస్తున్నట్లు ఆరోపించారు. కార్మికుల సంక్షేమ నిధులు కార్మికుల కోసమే వినియోగించాలని, ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన జీవో నెం.12ను రద్దు చేసి సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, సీసీఎస్ హెల్త్ టెస్టులను రద్దు చేసి కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, సహజ మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, 55 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇవ్వాలని, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, గృహవసతి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డా అధ్యక్షుడు రాజు అంజయ్య, కార్యదర్శి అంజయ్య గౌడ్, సహాయ కార్యదర్శి చుక్క రాములు, మల్లేష్, రాము, నిర్మలమ్మ, లక్ష్మమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 జూలై 2026

# వర్షాభావ పరిస్థితుల్లో కూరగాయల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లాలోని 252 గ్రామపంచాయతీలకు ఐదు రకాల కూరగాయల విత్తనాల పంపిణీ
- 60 - 70 రోజుల్లో దిగుబడి ఇచ్చే కూరగాయల సాగుకు ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూలై 17 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు బోరు బావుల నీటి సామర్థ్యాన్ని బట్టి 60 - 70 రోజుల్లో దిగుబడినిచ్చే కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 64.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనందున, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు తమ బోరు బావుల్లో అందుబాటులో ఉన్న నీటి సామర్థ్యాన్ని అంచనా వేసుకుని,అధిక నీరు అవసరమయ్యే పంటల విస్తీర్ణాన్ని తగ్గించి,60 నుంచి 70 రోజుల్లో కోతకు వచ్చే స్వల్పకాలిక కూరగాయల పంటలను సాగు చేయడం ఉత్తమమని సూచించారు. రైతులకు ప్రోత్సాహంగా జిల్లాలోని 252 గ్రామ పంచాయతీలకు ఐదు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని కుటుంబ అవసరాలతో పాటు అదనపు ఆదాయం పొందే విధంగా కూరగాయల సాగును చేపట్టాలని కోరారు. రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితుల్లో టమాటా, వంకాయ, మిరప, బెండ, మునగ, చిక్కుడు, గోరుచిక్కుడు, పాలకూర,సొరకాయ, కాకరకాయ, బీరకాయ, దోసకాయ వంటి పంటలకు అనువైన స్వల్పకాలిక, కరువును తట్టుకునే రకాలను సాగు చేయాలని తెలిపారు. ముఖ్యంగా టమాటా,వంకాయ పంటల్లో అంటుకట్టిన నారుమొక్కలను వినియోగించడం,విడతల వారీగా నర్సరీలను ఏర్పాటు చేయడం ద్వారా తేమ ఒత్తిడిని తగ్గించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు.కరువు పరిస్థితుల్లో నేలలో తేమను కాపాడేందుకు వరి గడ్డి,పంట అవశేషాలు వంటి సేంద్రియ మల్చింగ్‌ను వినియోగించాలని, పశువుల ఎరువు, వర్మీకంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. అలాగే గట్లు,కాలువల పద్ధతి, ఎత్తైన మడులపై సాగు,బిందు సేద్యం, మైక్రో స్ప్రింక్లర్ విధానాలను అవలంబించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.పంటల కీలక దశలలో మాత్రమే ప్రాణరక్షక నీటిపారుదల అందించడం,కలుపు నివారణ చర్యలు చేపట్టడం,నీటిలో కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు.కరువు పరిస్థితుల్లో త్రిప్స్, తెల్లదోమలు, పేనుబంకలు, నల్లి వంటి రసం పీల్చే కీటకాల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటలను నిరంతరం పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించే సమీకృత తెగుళ్ల నివారణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన చోట జీవ నియంత్రణ పద్ధతులు,వేప ఆధారిత పురుగుమందులు, శాస్త్రీయంగా సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఉల్లిపాయ సాగు చేసే రైతులు ఖరీఫ్ సీజన్‌కు అనువైన రకాలను ఎంపిక చేసుకోవడంతో పాటు నర్సరీ నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బిందు సేద్యం,మైక్రో స్ప్రింక్లర్ విధానాలను వినియోగించడం,వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు అందించడం ద్వారా కరువు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.సూక్ష్మ పోషకాలు,నీటిలో కరిగే ఎరువులను శాస్త్రీయ సూచనల మేరకు వినియోగించడం ద్వారా పంటల దిగుబడి, నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు.వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని,నీటిని ప్రతి చుక్కను పొదుపుగా వినియోగిస్తూ తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ శాస్త్రీయ సలహాలను పాటిస్తే వర్షాభావ పరిస్థితుల్లో కూడా మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# అడ్వకేట్‌పై దాడికి నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



**మక్తల్, 17 (జనంసాక్షి) :** న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ మక్తల్ న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం ఉందెకొడ్ గ్రామానికి చెందిన అడ్వకేట్ నీరజ్‌పై జరిగిన దాడి ఘటనకు నిరసనగా న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మక్తల్ జూనియర్ సివిల్ జడ్జికి వినతిపత్రం అందజేశారు. దాడి ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ కోర్టు విధులకు హాజరు కావడం లేదని తెలిపారు. అనంతరం కోర్టు ప్రాంగణం వెలుపల నినాదాలు చేస్తూ, అడ్వకేట్ నీరజ్‌కు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. న్యాయవాదిపై దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దత్తాత్రేయ, ఆడెం శ్రీనివాసులు, కె. సూర్య ప్రకాష్, రంకుల ఆనంద్, రవి కుమార్ గౌడ్, శివ కుమార్, సురేందర్, పొర్ల ఆనంద్, బండారి శ్రీనివాస్, దినేష్ వర్మ, భరత్ కుమార్, వెంకటేష్ గౌడ్, సునీత, సతీశ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల కదలికలు, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించాలి

- నిషేధిత వస్తువులు జైలు లోపలికి రాకుండా తనిఖీలు చేపట్టాలి
- కంది సెంట్రల్ జైలులో భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 17 (జనం సాక్షి) :** ఖైదీల కదలికలు, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలోని సెంట్రల్ జైలును జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) పరితోష్ పంకజ్ సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. జైలు సూపరింటెండెంట్ సంజయ్ రాయ్‌తో కలిసి జైలు ఆవరణ, ప్రధాన ప్రవేశ ద్వారాలు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఖైదీల కదలికలు, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిషేధిత వస్తువులు జైలు లోపలికి రాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సూచించారు. జైలులో ఆకస్మిక తనిఖీలను తరచూ నిర్వహించడంతో పాటు సందర్శకుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, వారి తనిఖీలను కఠినంగా చేపట్టాలని పేర్కొన్నారు. జైలు పరిసరాల్లో 24 గంటల నిఘా కొనసాగిస్తూ సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా చూడాలని, జైలు గోడలు, ప్రవేశ ద్వారాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసి సెంట్రీ విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు భద్రతా సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, జైలు భద్రత విషయంలో పోలీసు శాఖ, జైలు శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తో పాటు జైలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆకునూరు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం

- భువనగిరి ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా
- అభివృద్ధికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు
- ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి
- ఆకునూరులో పలు అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపన



**చేర్యాల, జూలై 17 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం మేజర్ గ్రామపంచాయతీ ఆకునూరు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆకునూరులో ఇటీవల 50 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు మహిళా సంఘాల భవనాలతో పాటు 4 లక్షల వ్యయంతో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ మరుగుదొడ్ల భవనాన్ని ప్రారంభించారు. గిడ్డంగుల గోదాము నిర్మాణానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తో పాటు జిల్లా కలెక్టర్ కె. హైమావతి కలిసి భూమి పూజ నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే లకు మహిళలు బోనాలు, మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎంపీ సహకారంతో సీసీ రోడ్లు, మహిళా సంఘాల భవనాలు, డ్రైనేజీ కాలువల నిర్మాణం తదితర గ్రామ అభివృద్ధి పనులకు సుమారు రూ. కోటి 20 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతి లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, ఏసీపీ సదానందం, గ్రామ ఉపసర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు అందె లక్ష్మి, సూర అనిత, జూపల్లి కార్తీక్ రెడ్డి, తాటికొండ శేఖర్, భూమిని భాస్కర్, గణపురం బాలనరసమ్మ అంజయ్య, మంతపురి భాగ్యలక్ష్మి, స్వర్గం రాజేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ వినీత్




**నారాయణపేట, జూలై 17 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంత మైన పోలీసు సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయా లని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.ముందుగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహి స్తున్న రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులు, పిటిషన్లు, వారెంట్ల అమ లు, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఒక్కొక్కటిగా పరిశీలించి అధికారులకు పలు సూచ నలు చేశారు.పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ఆదే శించారు. కేసుల్లో అవసర మైన సాక్ష్యాధారాలను సమగ్రంగా సేకరించి, పటి ష్టమైన ఛార్జిషీట్లు దాఖలు చేయడం ద్వారా నేరస్థుల కు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో బీట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్లను సమర్థవంతంగాకేటాయించి గ్రామాలను క్రమం తప్పకుండాసందర్శించాలని సూచించారు. గ్రామస్థుల తో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసు కోవడం ద్వారా పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.అలాగే పాత నేరస్తులు, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాల నియంత్రణలో ఇంటెలిజెన్స్ సమాచారాన్నిసమర్థవంతంగా వినియోగించాలని అధికారులనుఆదేశించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలునిర్వహించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా, మర్యాదపూర్వకంగా స్వాగ తించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడు వులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ స్టేషన్‌పై సానుకూల అభిప్రాయం ఏర్పడేలా సిబ్బంది వ్యవహరించాలని చెప్పారు.స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బం ది క్రమశిక్షణ, విధుల నిర్వ హణ, కార్యాలయ నిర్వహణ వంటి అంశాలను కూడా ఎస్పీ పరిశీలించి అవసర మైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ప్రజలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీ సందర్భంగా మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, ఇంచార్జి ఎస్సై మహేశ్వరి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ప్రముఖ హోప్ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి



**రేగోడ్, జూలై 17 (జనంసాక్షి) :** సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని సంగారెడ్డి లోని హోప్ న్యూరో హాస్పిటల్ ప్రముఖ న్యూరో వైద్యుడు కృష్ణమూర్తి అన్నారు.ఈ సందర్భంగా రేగోడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సంగారెడ్డి లోని హోప్ న్యూరో డాక్టర్ కృష్ణ మూర్తి తన స్వంత మండలం రేగోడ్ జర్నలిస్ట్ లకు హెల్మెట్ లను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఈ హెల్మెట్ లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.సమాజ సేవలో జర్నలిస్ట్ ల పాత్ర చాలా కీలకమని కొనియాడారు. వారు సమాజ సేవలో ముందుండి ప్రజలకు సమాజంలో జరిగే వార్తలను సేకరించి వారిని ప్రజలకు అందిస్తూ అనునిత్యం ప్రజా సేవలో జీవిస్తూ ఉంటారని తెలిపారు. వారికి రక్షణ ఉండాలనే ఉద్దేశ్యంతో నేడు హెల్మెట్‌ల ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ప్రతి ఒక్కరు సమాజంలో సేవా దృప్పదం కలిగి ఉండాలని అన్నారు. ఎస్సై పోచయ్య మాట్లాడుతూ బైక్ నడిపే ప్రతి ఒక్కరు తప్పకుండ హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదం జరిగినప్పుడు తలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దత్తారెడ్డి, మాజీ సర్పంచ్ మన్నే భాస్కర్, మండల జర్నలిస్ట్ అధ్యక్షులు శంకర్ గౌడ్, మండల జర్నలిస్ట్‌లు, హోప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఏ.శ్రీనివాస్, పాండు నాయక్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి



**అమీన్పూర్, జూలై 17 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ శిబిరాలను శుక్రవారం ఆయన లేదు పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరాల నిర్వహణ తీరును పరిశీలించి, బీఎల్వోలు మరియు అధికారులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వం గడువు పొడిగించిన నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు సంబంధిత సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పట్టణ ప్రాంతాల్లో నెమ్మదిగా జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నమోదు ప్రక్రియ వేగవంతంగా ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బి ఎల్ ఓ లు అధికారులు మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అమీన్‌పూర్, తహసీల్దార్ అమీన్‌పూర్ వెంకటేష్, సిఎంసి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఏఎంసీ అమీన్‌పూర్ ప్రసాద్, దీూా సూపర్వైజర్ లు, దీూాలు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక
- అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 17 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డుప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షి త ప్రయాణం కల్పించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధ్యక్ష తన, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమక్షంలో జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అవసరమైన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాల ని సూచించారు. పాఠశాల ల పరిసరాలను స్కూల్ సేఫ్టీ జోన్‌లుగా అభివృద్ధి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు సౌకర్యవం తమైన మార్గం కల్పించా లని, ప్రధాన రహదారులపై పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచిం చారు. ప్రతి శాఖ తమ పరిధిలోని రోడ్డు భద్రతా పనులపై నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని, జాతీయ రహదారులపై అవసరమైన చోట అదనపు అంబులె న్సులు, అత్యవసర స్పంద న కేంద్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహిం చాలని, ప్రమాద బాధితు లకు సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించా రు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపా రు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్లు వాహనాలు నడపడం, ఫిట్‌నెస్ లేని వాణిజ్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిం చాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్ర తపై గ్రామాలు, పాఠశాల లు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించా లని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల కు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరిం చి, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు.ఈ సమావే శంలో రవాణా శాఖ, పోలీసు శాఖ, రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల అధికారులు, ఆర్టీసీ, 108 అంబులెన్స్ సేవలు, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆపద్బాంధవులు సాహసం

- కనీసం రోడ్డు మార్గం లేదు
- ఇప్పటికీ తప్పని డోలీ మోత కష్టాలు
- అంబులెన్స్ వెళ్ళడానికి లేని రోడ్డు మార్గం
- అయిన ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సేవకులు





**ఏటూరునాగారం, జులై 17(జనంసాక్షి) :** ప్రభుత్వాలు మారిన మారుమూల గిరిజన ప్రాంతాల బతుకులు మారడం లేదు, రోడ్డు మార్గం లేక అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని మైళ్ళ దూరం డోలీ మోతతో రోడ్డుకు చేరిన జ్వర పీడితుడు.విధుల్లో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేసే 108 ఆపద్బాంధవులు చేసిన ఈ గొప్ప పనికి యావత్ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా ఏజెన్సీ ఐటిడిఏ ఏటూరునాగారం మండలం గుర్రాలాబావికి చెందిన గోత్తి కోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య 18 సంవత్సరాలు, గత నాలుగు రోజుల నుండి జ్వరం రావడంతో దగ్గరలోని ఆర్ఎంపి దగ్గర చికిత్స తీసుకున్నాడు. అప్పటికి నయం కాకపోవడంతో రక్త కణాలు తగ్గి అపార్మరక స్థితిలోకి వెళ్ళిపోయాడు. గమనించిన బంధువులు ఏటూరునాగారం అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా విషయం తెలుసుకున్న ఈఏంటి శివలింగంప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వెళ్ళి చూడగా తీర కనీసం రోడ్డు మార్గం లేని బురద కాలి నడకన, అంబులెన్స్ వెళ్లలేని దారి ఉండడంతో ఎలాగైనా ప్రాణాలు నిలిపాలని ఎదురుగా వెళ్ళి డోలీ సహాయంతో రోడ్డు, అంబులెన్స్ వరకు భుజాన మోసుకొచ్చారు. అనంతరం బాధితుని పరీక్షించగా అపస్మారక యువకునికి బాడీలో చక్కెర స్థాయి పడిపోయి, తీర్వ జ్వరం ఉండడాన్ని గమనించి ఈఆర్సిపి డాక్టర్ మౌనిక సూచన, సలహాల మేరకు కావలసిన సూదులు, మందులు, గ్లూకోజు బాటిల్ ఇచ్చి హుటాహుటిన మెరుగైన వైద్యసేవల కి ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి తరలించి పూర్తి వివరణను వైద్యులకు వివరించి చేర్పించారు.

ఇంతటి గొప్ప మానవత్వాన్ని చాటుకున్న అంబులెన్స్ సేవకులు,ఉపకారులకు యావత్ ప్రజానీకం అభినందించారు. ప్రాణం విలువ లెక్క కట్టనిది,ప్రాణం మీదకు వచ్చినప్పుడు అంబులెన్స్ కి కాల్ చేసి వచ్చి తీసుకెళ్లి ప్రాణాన్ని కాపాడుతుందన్న నమ్మకాన్ని నిలబెట్టుకున్న అంబులెన్స్ నిర్వహణ సంస్థకు, సిబ్బందికి స్థానికులు శభాష్ అంటున్నారు.

## రైల్వే జీఎం, డీఆర్ఎంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య భేటీ

- కాజీపేట నూతన బస్టాండ్ భూకేటాయింపుపై వినతి
- కాజీపేట బస్టాండ్ భూకేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయండి



**కాజీపేట, జూలై 17(జనం సాక్షి) :** కాజీపేటలో ప్రతిపాదిత నూతన బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డా. ఆర్. గోపాలకృష్ణన్‌లను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భూ మార్పిడి అంశంపై వారితో ఎంపీ విస్తృతంగా చర్చించారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ పరిధిలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన విలువ ప్రాతిపదికన మార్పిడి చేయాలని రైల్వే శాఖ 2025 జూన్ 4న ప్రతిపాదించినప్పటికీ, ఏడాదికిపైగా గడిచినా ప్రక్రియ ముందుకు సాగలేదని ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు. భూ మార్పిడి కోసం వరంగల్–హనుమకొండ ప్రాంతంలో అనువైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. భూ మార్పిడి ప్రక్రియను పూర్తి చేసేందుకు రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి, అవసరమైన చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొత్త కాజీపేట బస్టాండ్ నిర్మాణం పూర్తయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రి-సిటీ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్, జాతీయ రహదారులకు సమీపంలో ఆధునిక బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, బస్సుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, ప్రజా రవాణా అనుసంధానం మెరుగుదల వంటి ప్రయోజనాలు కలుగుతాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల నమోదు పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలో కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నమోదు, యూనిఫాం పంపిణీ, చల్లగరిగలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుపై విద్యా, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చల్లగరిగ పబ్లిక్ స్కూల్ ప్రతిపాదనలు వెంటనే పంపాలని, సమావేశానికి గైర్హాజరైన టిజిఈడబ్ల్యుఐడిసి డీఈ, ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. 5 నుంచి 8వ తరగతి డ్రాపౌట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఐఎంఆర్ఎస్ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. యూనిఫాం కుట్టు పనులు వేగంగా పూర్తి చేస్తున్న స్వయం సహాయక సంఘాలను అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డీఆర్డీఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

### ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడీఓసీలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మిల్లెట్స్, పప్పుదినుసులు, కూరగాయలు, పామాయిల్ సాగు చేయాలని సూచించారు. ఆరుతడి, తక్కువ రోజుల పంటలను ప్రోత్సహించాలని, బిందు, తుంపర్ల సేద్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. బోరు బావులతో వరి సాగు చేయొద్దని, నీటి కొరతతో పంట నష్టం వస్తుందని తెలిపారు. కూరగాయల సాగుకు ఎకరాకు రూ. 9600 ప్రోత్సాహకం ఇస్తున్నామన్నారు. జిల్లా కంటింజెంట్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జేడీఏ బాబూరావు, జేహెచ్ఓ తిరుపతి, ఏడీలు శ్రీపాల్, రమేష్, ఏఈవోలు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



**నర్సంపేట జూలై 17 ( జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పతకం తో ఆటో డ్రైవర్ల జీవనోపాది పోయి కార్మికులు కుటుంబా అవసరాలు ఎల్లక అప్పులు తెచ్చి కట్టలేక ఆత్మహత్య లు చేసుకుంటున్నారని బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, నవ తెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ అన్నారు. అయోధ్య నగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పుప్పల దేవేందర్ ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు ఆటో డ్రైవర్లు 800 పైగా ఆత్మహత్య లు చేసుకున్నారు ఇవన్నీ ప్రభుత్వ హత్యలే అని అన్నారు. ఆటో డ్రైవర్లు కు ఇస్తా అన్న జీవన భృతి నేటికీ ఇవ్వడం లేదని అన్నారు. దేవేందర్ కుటుంబానికి 10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లో తోకల కరుణాకర్, మడి పెద్ది రమేష్, సిహెచ్.రాజు, జి.రమేష్, ఎంరాజు, దేవేందర్, ఎన్.సోమ్లా , జె.శ్రీనివాస్, కుమారు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



**రామకృష్ణాపూర్, జూలై 17(జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రజలకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ 4వ వార్డు, మందమర్రి మున్సిపాలిటీ 19వ వార్డుల్లో ఓటరు జాబితా సవరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం డిజిటలైజేషన్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో జిల్లాలో ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు సేకరించిన ఫారాల వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అర్హులైన ఓటర్లు స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునే అలవాటు పెంపొందించాలని తెలిపారు. కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు ఆధునీకీకరించి అవసరమైన అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

## ప్రతిభ కనబరిచే పోలీసు క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం

- పథకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులకు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ అభినందన



**ములుగు ప్రతినిధి,జూలై17(జనం సాక్షి):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 (క్లస్టర్--ఎ) పోటీల్లో ములుగు జిల్లా పోలీసు సిబ్బంది నాలుగు పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) తెలిపారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీసు సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మైదానంలో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-ఎ లోని 14 క్రీడా విభాగాల పోటీలు విజయవంతంగా ముగిశాయి.ఈ పోటీల్లో పతకాలు సాధించిన ములుగు జిల్లా పోలీసు క్రీడాకారులను జిల్లా ఎస్పీ అభినందించి, వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జట్టు సమన్వయం,పరస్పర సహకారం, నిరంతర సాధన,లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు.పోలీసు విధుల్లో క్రమశిక్షణ,సమన్వయం, జట్టు స్ఫూర్తి, శారీరక దృఢత్వం అత్యంత కీలకమని,ఈ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. నేరాల దర్యాప్తు నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు ప్రతి బాధ్యతను విజయవంతంగా నిర్వహించడంలో జట్టు సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది క్రీడాస్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకుంటే మరిన్ని విజయాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీసు సిబ్బందికి శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి శాఖకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల్లో విజయం క్రమశిక్షణ, సమన్వయం,నిరంతర సాధన ఫలితమని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పతక విజేతలు ఆర్ఎస్ఐ డి. రాకేష్ - రెజ్లింగ్‌లో కాంస్య పతకం,ఆర్ఎస్ఐ ఎన్అశోక్ - రెజ్లింగ్‌లో కాంస్య పతకం,హెడ్ కానిస్టేబుల్ (హెచ్ సి -721) అమిత్ కుమార్ సింగ్ - రెజ్లింగ్‌లో రజత పతకం, జూడోలో కాంస్య పతకం పొందారు.

## డంపింగ్ యార్డ్‌లో నిలువచేసిన పశుగ్రాసం తొలగింపు

- 'జనంసాక్షి' కథనానికి స్పందన



**చెన్నారావుపేట, జూలై 17 (జనంసాక్షి) :** డంపింగ్ యార్డ్( చెత్త సేకరణ కేంద్రం)లో అక్రమంగా నిల్వచేసిన పశుగ్రాసంను పుల్లయ్యబోడు తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న తొలగించారు. శుక్రవారం 'జనం సాక్షి' దినపత్రికలో 'పశుగ్రాసానికి అడ్డగా మారిన డంపింగ్ యార్డ్... పట్టించుకోని పాలకవర్గం, పంచాయతీ అధికారులు'.. అని వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారిని కల్పన వెంటనే స్పందించారు. పుల్లయ్యబోడు తండా గ్రామంలోని లింగ్య తండాలో ఉన్న డంపింగ్ యార్డులో అక్రమంగా నిల్వ చేసిన పశు గ్రాసం కట్టలను వెంటనే తొలగించాలని మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, పంచాయతీ కార్యదర్శి స్వప్నలను ఆదేశించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి స్వప్న గ్రామ సర్పంచ్ భూక్య బద్రిఈర్య, ఉపసర్పంచ్ తేజావత్ వాల్యల సహకారంతో డంపింగ్ యార్డ్ వద్దకు వెళ్లి అందులో అక్రమంగా నిల్వచేసిన పశుగ్రాసం కట్టలను గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగింప చేశారు. అలాగే డంపింగ్ యార్డ్ ను మొత్తం శుభ్రం చేయించారు. డంపింగ్ యార్డ్ లో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి వస్తువులు పెట్టకూడదని పెట్టినట్లయితే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కరోబార్ సందీప్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి వద్ద రూ.5.30 లక్షలు వసూలు చేసి మోసం
- నకిలీ నియామక పత్రాలు, సెల్ ఫోన్ స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి




**మావల, జూలై 18(జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ప్రధాన నిందితుడు మమ్మద్ బాబర్ ను అదిలాబాద్ టు టౌన్ పోలీసులు అరెస్టు చేసి ఆయనకు తరలించారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన జాబ్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడు ఆ-4 మహ్మద్ బాబర్ను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. 2025 అక్టోబర్ 14న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నుగురు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్ (స్కిల్ అసిస్టెంట్) ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, ఒకే కుటుంబానికి చెందిన నుగురు రవి, నర్సమ్మ, పృథ్విల నుంచి మొత్తం రూ.5.30 లక్షలు నగదు, ఫోన్‌పే ద్వారా వసూలు చేసి, అనంతరం గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో నకిలీ నియామక ఉత్తర్వులు అందజేసి మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో జూలై 16న విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన నిందితుడు ఏ-4 మహ్మద్ బాబర్, గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, కరీంనగర్ నివాసిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లేని గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నట్లు, ఈ మోసానికి ఏ-1 పల్లికొండ కార్తీక్ (నిర్మల్), ఏ-2 రాహులపెంట సతీష్ (సూర్యాపేట), ఏ-3 వడేకర్ నవీన్ కుమార్ (భైంసా)లను మధ్యవర్తులుగా ఉపయోగించి అమాయక నిరుద్యోగులను గుర్తించి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. వసూలు చేసిన డబ్బులో మధ్యవర్తులకు కమీషన్ ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని తానే తీసుకున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బాధితులకు ఇచ్చిన నకిలీ నియామక ఉత్తర్వుల ప్రతులు, ఒక రియల్‌మీ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఏ-1 పల్లికొండ కార్తీక్, ఏ-2 రాహులపెంట సతీష్, ఏ-3 వడేకర్ నవీన్ కుమార్లను గతంలోనే అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు, తాజాగా ఏ-4 మహ్మద్ బాబర్ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, ఉద్యోగాల పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రణయ్ కుమార్, విష్ణు ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 163 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**గోవిందరావుపేట, జూలై 17 (జనం సాక్షి) :** మండలంలోని మచ్చాపూర్ గ్రామ సమీపంలోని 163 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.బంధువుల కర్మ కార్యక్రమానికి అంకన్నగూడెం వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అర్రెశీ బిక్షపతి, ఈక చిన్న అప్పయ్య లను ఎదురుగా వస్తున్న ట్రక్కు వేగంగా ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు ట్రక్కు రోడ్డు పక్కన బోల్తా పడగా, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు కలిసి డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో కర్లపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.



## ఎన్బీడబ్ల్యూ వారెంట్ అమలు

- నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలింపు

**శాయంపేట, జూలై 17 (జనం సాక్షి) :** శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎడ్ల దొంగతనం చేసిన కేసుతో పాటు ఇతర పోలీస్ స్టేషన్లలో కూడా పలు కేసులు నమోదైన పరకాలకు చెందిన మోరె సాయి కుమార్ కొంతకాలంగా కోర్టుకు హాజరుకాక పోవడంతో పరకాల న్యాయస్థానం అతనిపై ఎన్బీడబ్ల్యూ జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు శాయంపేట పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి పరకాల న్యాయస్థానం ముందు హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించి జైలుకు తరలించాలని ఆదేశించింది. అనంతరం నిందితుడిని జైలుకు తరలించినట్లు శాయంపేట ఎస్ఐ జె. పరమేశ్వర్ తెలిపారు.

## నీట్ ఫలితాలలో మోషన్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం



**హనుమకొండ ప్రతినిధి జులై 17 (జనంసాక్షి) :** నీట్ ఫలితాలలో హన్మకొండలోని రాజస్థాన్ కోటా మోషన్ కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధిం చడం జరిగిందని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. నీట్ ఫలితాలలో మోషన్ కాలేజీ విద్యార్థులు భూక్యా అశ్విక 531 మార్కులు బొమ్మకంటి నిహారిక 425 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్త మ మార్కులు సాధించిన విద్యార్థుల ను, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపకు లను, సహకరించిన తల్లిదండ్రులను, కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్ ప్రిన్సిపాల్ మారపల్లి సమ్మయ్యలు అభినందించడం జరిగింది.

## కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు



**దస్తూరాబాద్, జూలై 17 (జనంసాక్షి):** కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన నల్లపు రాజవ్వ (60) అనే వృద్ధురాలు పంట చేనులో పని నిమిత్తం బయటకు వెళ్తున్న క్రమంలో కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చుట్టుపక్కల వారు కోతుల సమూహాన్ని తరిమి బాధితురాలైన నల్లపు రాజవ్వను వెనువెంటనే మెరుగైన వైద్యం కొరకు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల సంచారం ఎక్కువ కావటం గ్రామస్తులపై తరచు దాడులు చేస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతుల భారి నుండి కాపాడాలని కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ పక్రియ బీజేపీ కుట్ర

- రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి



చంద్రుగొండ, జూలై 17 (జనం సాక్షి) : భారతీయ జనతా పార్టీ రాబోయే ఎన్నికల్లో మరల గెలుపు కోసం కుటీల యత్నాలలో భాగంగా ఎస్ఐఆర్ పేరుతో ఇతర పార్టీల ఓట్లను తొలగించే కార్యక్రమం చేపట్టిందని ఈఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ ఏ ఒక్కరి ఓటు పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. శుక్రవారం చంద్రుగొండ మండలంలో ఆమెతోపాటు ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రుగొండ ప్రధాన సెంటర్ వద్ద గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. అశ్వరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారి ఆదినారాయణ కృషితో పాటు ఐటీడీఏ పీవో రాహుల్ ఆధ్వర్యంలో గ్రంథాలయ నిర్మాణం ఏర్పాటు చేయటం యువతకు గుండెకాయ లాంటిదని ఆమె అన్నారు. గత ప్రభుత్వ 10 సంవత్సరాల్లో చేయనటువంటి పనిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పట్టుబట్టి గ్రంథాలయ నిర్మాణానికి పూనుకోవడం ఆయన విద్యపై ఉన్న మక్కువను చూపుతుందన్నారు. ఇదే సందర్భంలో ఎంపీ రామసాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఎమ్మెల్యేలలో నెంబర్ వన్ వర్కర్ గా, అభివృద్ధి పనులకు నిధులు రాబట్టటంలో జారి ఆదినారాయణ ముందు వరుసలో ఉన్నారని అటువంటి ఎమ్మెల్యే దొరకటం మీ అదృష్టమని ఆయన కొనియాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి గత ప్రభుత్వాల తప్పిదాలను తెలియజేసి రానున్న ఎన్నికల్లో మరల ఎమ్మెల్యే జారె ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రంథాలయ ఏర్పాటుతో యువత ఉన్నత చదువులకు మార్గాన్ని చూపుతూ వారికి అన్నివేళలా గ్రూప్ వన్ గ్రూప్ టు ప్రిపరేషన్కు ఉపయోగపడేలా సంబంధిత పుస్తకాలను ఉంచటం జరుగుతుందని ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. తొలుత తుంగారంలో సీసీ రోడ్ల నిర్మాణ శంకుస్థాపన, చంద్రుగొండ బస్టాండ్ పున ప్రారంభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్లమోతు వెంకటరమణ, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో సాగయ్యే పంటలపై అవగాహన కల్పించండి

- అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, జులై 17 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ, తక్కువ నీటి వినియోగ పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న అంశంపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, సాగులో వైవిధ్యాన్ని పాటించి, తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ఆమె సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు వీలుగా మిల్లెట్స్, కూరగాయలు, పప్పు దినుసులు, పామాయిల్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ఆరుతడి పంటలు, తక్కువ రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యటించి, ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటల వివరాలను రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. బోరు బావుల ద్వారా పంట సాగు చేస్తున్న రైతులు వరి సాగు చేయొద్దని, రానున్న రోజుల్లో భూ గర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని తద్వారా పంట నష్టం వస్తుందని సూచించారు. కూరగాయలు సాగుకు ప్రభుత్వం ఎకరాకు 9,600 రూపాయలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు చేయాల్సిన పంటలపై జిల్లా కంటింజెంట్ (జిల్లా అత్యవసర ప్రణాళిక) ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఇంచార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి , జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్ సింగ్ అన్ని మండలాల ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ముసుగులో గంజాయి సాగు

- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 25 గంజాయి మొక్కలు, ఎండు గంజాయి స్వాధీనం



యాలాల, జూలై 17 (జనంసాక్షి) : యాలాల మండలంలోని ఓ ఆశ్రమంలో గంజాయి సాగు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చారు. యాలాల మండలం గోవిందరావుపేట శివారులో ఉన్న స్వామీజీ ఆశ్రమంపై టాస్క్‌ఫోర్స్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఆశ్రమ ఆవరణలో సుమారు 25 గంజాయి మొక్కలను, అలాగే ఎండు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆశ్రమంలో స్వామీజీతో పాటు ఓ మాతాజీ కూడా నివాసం ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టౌన్ సీఐ పరమేశ్వర్, ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు. సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహించిన అనంతరం స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు, ఎండు గంజాయిని సీజ్ చేశారు. ఆశ్రమంలో గంజాయి సాగు ఎలా జరిగింది? ఇందులో మరేవరిదైనా ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జరుగుతున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



సూర్యాపేట ప్రతినిధి, జూలై 17 (జనంసాక్షి) : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.దివ్య ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో పాల్గొన్న సిబ్బందికి కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్ రక్తపోటు, షుగర్, ఈసీజీ , సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షియం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో మొత్తం 229 మంది సిబ్బంది పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, డాక్టర్లు శ్వేత, సందీప్, తరిషక్, ఉమాదేవి మెడికల్ సిబ్బంది సంతు, దుర్గ,అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మండల సమాఖ్య సిబ్బంది, సెర్ప్,ఎంజీఎన్ఆర్ఈజీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్‌సీ పరీక్షలకు 102 సేవలే వినియోగించాలి



కల్వకుర్తి, జూలై 17 (జనంసాక్షి) : గర్భిణీ మహిళలను ఏఎన్‌సీ పరీక్షల కోసం ఆసుపత్రులకు తీసుకురావడంలో తప్పనిసరిగా 102 అంబులెన్స్ సేవలనే వినియోగించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల తీరుపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి ఏఎన్‌సీ పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలతో మాట్లాడి వారు బస్సులో వచ్చినట్లు తెలుసుకోవడంతో, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 102 సేవలను ఎందుకు వినియోగించలేదని ఆశా కార్యకర్తలను ప్రశ్నించారు. ఇకపై ప్రతి గర్భిణికి సురక్షిత, ఉచిత రవాణా కల్పించేందుకు 102 సేవలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అనంతరం ఏఎన్‌సీ విభాగంలో నమోదు వివరాలు, రోజువారీ పరీక్షల సంఖ్య, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, వైద్య సేవల నిర్వహణను పరిశీలించారు. గర్భిణీల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని పరీక్షలు సకాలంలో నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడిన కలెక్టర్ మందుల లభ్యత, వైద్యుల అందుబాటు, పరిశుభ్రత,సిబ్బంది స్పందనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. తనిఖీలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, ఆర్డీవో జనార్దన్‌రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మహమ్మద్,తహసీల్దార్ ఇబ్రహీం,డాక్టర్ శివరాం,డిప్యూటీ డీఎంహెచ్ఓతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విద్య, వసతి, భద్రతపై రాజీ లేదు

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



వెల్దండ, జూలై 17 (జనంసాక్షి) : వెల్దండ మండలం పరిధిలోని గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదట భోజనశాల, డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం,మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన,ఆత్మవిశ్వాసం పెంపొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన పాఠశాల సమీపంలోని గుట్ట ప్రాంతాన్ని తొలగించి ప్రాంగణంలోనే బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గిరిజన విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంలో ఆయనతో పాటు కల్వకుర్తి ఆర్డిఓ జనార్దన్ రెడ్డి,వెల్దండ తహశీల్దార్ కార్తిక్ కుమార్, ఎంఈఓ చంద్రుడు నాయక్, సర్పంచ్ జక్కుల శిరీష వెంకటేష్ యాదవ్,పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కోర్టు వినూత్న శిక్ష

- రూ. 24,500 జరిమానాతో పాటు రోడ్డుపై ట్రాఫిక్ విధులు నిర్వహించాలని న్యాయమూర్తి ఆదేశం



ఇబ్రహీంపట్నం, జూలై 17 (జనం సాక్షి) : మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులను, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన నలుగురిని శుక్రవారం పోలీసులు న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిబంధనలు ఉల్లంఘించిన వారందరికీ కలిపి మొత్తం రూ. 24,500/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అయితే, ఈ కేసులో అత్యధిక మోతాదులో మద్యం సేవించి పట్టుబడిన ఖానాపూర్‌కు చెందిన ఎం. వెంకట్ రెడ్డి (43), వి. శ్రీనివాస్ (28) అనే ఇద్దరు వ్యక్తులకు కోర్టు వినూత్న శిక్ష ఖరారు చేసింది. వారికి జరిమానాతో పాటు ఒక రోజు పాటు రోడ్డుపై నిలబడి ట్రాఫిక్ విధులు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు సదరు నిందితులతో ఈ రోజు ఇబ్రహీంపట్నం జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు తోటి రోడ్డు వినియోగదారుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. మద్యం సేవించిన వారు సొంతంగా వాహనాలు నడపకుండా క్యాబ్, ఆటో లేదా మద్యం సేవించని ఇతర వ్యక్తుల సహాయంతో సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుని బాధ్యత అని, "డ్రింక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండి సురక్షితమైన ప్రయాణం చేయాలని" ఆయన కోరారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో అమీరాబాద్ ఆదర్శం

- 93.14 శాతం నమోదుతో మండలంలో మొదటి స్థానం
- 66.51 శాతం నమోదుతో హుస్సేన్ నగర్ అత్యల్పం



న్యాల్‌కల్, జూలై 17 (జనం సాక్షి) : భవిష్యత్తులో ఎంతో కీలకం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) 2026 ఓటర్ జాబితా ప్రక్షాళన కార్యక్రమం మండలంలో చురుగ్గా కొనసాగుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు, జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో .."సర్ ప్రక్షాళన" కార్యక్రమం శరవేగంగా కొనసాగుతుంది. మండల తహసిల్దార్ ప్రభువులు, ఉప తహసిల్దార్ రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, రెవెన్యూ జీపిఓలు, బిఎల్ఓలు, తదితరుల చొరవ, పర్యవేక్షణలో కొనసాగుతోంది.

"సర్ ప్రక్షాళన"లో అమీరాబాద్ ఆదర్శం

మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు గాను 62 బిఎల్ఓలు, ఆరుగురు పర్యవేక్షణులు, అంగన్వాడి కార్యకర్తల సమక్షంలో ఓటరు జాబితా ప్రక్షాళన కొనసాగుతోంది. ఐతే మండలంలోని అమీరాబాద్ గ్రామం ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో మండలంలోని మొదటి స్థానం నిలిచింది. దాదాపు 146 కుటుంబాలకు 583 ఉన్నారు. గ్రామ బీఎల్ఓ లక్ష్మి, జిపిఓ గణేష్, గ్రామ సర్పంచ్ విజయ వైద్యనాథ్, ఉప సర్పంచ్ శోభ, గ్రామస్తులు అంబదాస్, దత్త రెడ్డి, విష్ణు, తదితరుల ప్రత్యేక చొరవతో.. ఈ నెల 17, శుక్రవారం నాటికి 93.14 శాతం మేర "ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ" (సర్) పూర్తి చేసి మండలంలోని మొదటి స్థానంలో నిలిచింది. 583 ఓటర్లకు గాను 545 ఓటర్లను అంతర్జాలంలో నమోదును పూర్తి చేశారు. 23గురు మృతి చెందడం, మరో 20కి పైగా వివాహం అవ్వడం,14 గురు మాత్రమే మిగిలున్న నేపథ్యంలో.. దాదాపు 97 శాతం "సర్ ప్రక్షాళన" పూర్తవడంతో మండలంలోని ఆదర్శంగా నిలిచింది. మండల కేంద్రమైన న్యాల్ కల్ లో 69.9 శాతం, అతి తక్కువగా హుస్సేన్ నగర్ లో 66.51 నమోదైనట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు.

# పిల్లలకు సరైన అంతరం ఉంటేనే ఆరోగ్యం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి కరస్పాండెంట్, జూలై 17 (జనం సాక్షి) : పిల్లలకు సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా, నైపుణ్యంతో ఉంటాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశానుసారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 11న నిర్వహించడం జరుగుతోందని అన్నారు. పిల్లలకు సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా మరియు నైపుణ్యంతో ఉంటాయి అనే థీమ్‌కు అనుగుణంగా పిల్లల మధ్య సరైన అంతరం పాటించడం వల్ల తల్లి మరియు శిశువు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కుటుంబం ఆరోగ్యవంతంగా, ఆర్థికంగా బలోపేతం అవుతుందని వివరించారు. కుటుంబ నియంత్రణలో భాగంగా క్యూర్ విధానాన్ని అనుసరిస్తూ ప్రతి దంపతికి వారి అవసరాలకు అనుగుణంగా కుటుంబ నియంత్రణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన కుటుంబాల నిర్మాణానికి పిల్లల మధ్య సరైన అంతరం అత్యంత అవసరమని తెలిపారు. సరైన వ్యవధిలో గర్భధారణ జరిగితే తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని పేర్కొన్నారు. యువతలో కుటుంబ జీవనం, పునరుత్పత్తి ఆరోగ్యం, బాధ్యతాయుతమైన తల్లిదండ్రుల పాత్రపై అవగాహన పెంపొందించాలని సూచించారు. 30 సంవత్సరాల లోపు వివాహాలు మరియు 20 సంవత్సరాల లోపు గర్భధారణలను నిరోధించే దిశగా ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. . ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా ఒకే బిడ్డతో శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతిని స్వీకరించిన కుటుంబాలను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు మరియు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.వీణ, డా.రామకృష్ణ, డా.సుమన్ కళ్యాణ్, డా.వంశీ కృష్ణ, డెమో పద్మ , జిల్లా మరియు మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## యుపీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట ప్రతినిధి, జూలై 17 (జనంసాక్షి) : టిజీ ఎస్సీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ద్వారా శిక్షణ పొంది ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్-1 వంటి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయగాథలతో రూపొందించిన బుక్ లెట్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. సూర్యాపేట జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి 10 నెలల యుపిఎస్సి ఉచిత కోచింగ్ కొరకు ఈ నెల 19వ తేదీ వరకు సంబంధిత వెబ్ సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. నాగయ్య పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9701775868లో సంప్రదించవచ్చని తెలిపారు.




# దూసుకెళ్లిన సూచీలు

## 24,300 ఎగువకు నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభా ల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలున్నా.. ప్రైవేట్ బ్యాంక్, ఐటీ, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా షేర్లలో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 950కి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,370.77 (క్రితం ముగింపు 77,186.87) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 78,282.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 964.58 పాయింట్ల లాభంతో 78,151.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయిం ట్ల లాభంతో 24,334.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.28గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా, టీసీఎస్, రిలయన్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ట్రెంట్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 85.96 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,996 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అయితే అంతకుముందు ఐటీ షేర్లు రాణించినా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాంటి దిగ్గజ షేర్లలో లాభాల స్వీకరణ ఫలితంగా దేశీయ సూచీలు స్తబ్దుగా ముగిశాయి. అంతర్జాతీయ భౌగోళిక- రాజకీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో ఒడుదొడుకులు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు తగ్గి 96.42 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1% తగ్గి 84 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ మినహా మిగతావి నష్టపోగా.. ఐరోపా మార్కెట్లు




ప్రతికూల ధోరణిలో ఆరంభమ య్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.48,000 కోట్లు తగ్గి రూ.480.54 లక్షల కోట్ల (4.99 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ పైకి.. నిఫ్టీ కిందకు: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,388.42 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 77,185.43) ఆరంభమైంది. ఆ తర్వాత తీవ్ర ఒడుదొడుకుల మధ్య కదలాడుతూ, ఒక దశలో 77,086.42 పాయింట్లకు దిగివచ్చింది. చివరకు 1.44 పాయింట్ల లాభంతో 77,186.87 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 5.75 పాయింట్ల నష్టంతో 24,072.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,050 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,186.50 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 16 లాభాల్లో, 14 నష్టాల్లో ముగిశాయి. ఇండిగో 1.84%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.73%, బజాజ్ ఫైనాన్స్ 1.57%, మారుతీ సుజుకీ 1.56%, ఎంఅండ్ఎం 1.2%, టైటన్ 1.05% పెరిగాయి. ఎటర్నల్ 2.82%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.86%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.64% నష్టపోయాయి. గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా గౌరవ్ పాండే నియమితులయ్యారు. లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో శుభారంభం చేశాయి. ఇష్యూ ధర రూ.214తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ట్రేడింగ్ 25.70% అధికంగా రూ.269 వద్ద ప్రారంభమైంది. చివరకు 22.83% లాభంతో రూ.262.85 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,689.58 కోట్లుగా నమోదైంది. ఏప్రిల్-జూన్‌లో నికర లాభం తగ్గడంతో ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ షేరుకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో 10.5% నష్టపోయి రూ.1,623.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 14.86% నష్టపోయింది కూడా. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు మదుపర్ల నుంచి విశేష స్పందన లభించింది. ఇష్యూ ముగిసేసరికి 41.66 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల నుంచి 3.6 రెట్ల స్పందన లభించింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు రావడంతో, ఆగస్టు 12 నుంచి నిఫ్టీ ఇండియా ఎఫ్‌పీఐ 150 సూచీలో డెరివేటివ్స్ కాంట్రాక్టు ప్రారంభిస్తామని ఎన్ఎస్ఈ తెలిపింది. ఈ సూచీల్లో ఫ్యూచర్స్, ఆప్షన్స్ కాంట్రాక్టులు ఉంటాయి. ఆరు నెలల సగటు విదేశీ పెట్టుబడుల ఫ్రీ-ఫ్లోట్

కారు రీప్లేస్ చేయాలన్న ఉత్తర్వులు..

## మారుతీ సుజుకీ సవాల్

దిల్లీ: ఇ-20 పెట్రోల్ వినియోగంపై ఓ వైపు అపోహలు, మరోవైపు ప్రభుత్వం స్పష్టత ఇస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇ-20 పెట్రోల్ ఇంజిన్ కలిగిన గ్రాండ్ విటారా కారులో తరచూ సమస్యలు వస్తున్నాయంటూ అందిన ఫిర్యాదుపై మారుతీ సుజుకీకి ఎదురుదెబ్బ తగిలింది. కొత్త కారును ఇవ్వాలంటూ రాయ్‌పుర్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాలు చేసేందుకు మారుతీ సుజుకీ సిద్ధమైంది. 2023 జనవరిలో తయారైన గ్రాండ్ విటారా స్ట్రాంగ్ హైబ్రిడ్ జెటా+ మోడల్‌ను 2024 జూన్‌లో ఓ వినియోగదారుడు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ఐదు నెలల్లోనే సమస్యలు తలెత్తడం, పనితీరు నెమ్మదించడాన్ని గ్రహించాడు. దీంతో వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించగా.. అనుకూలంగా తీర్పు వెలువరించింది. 45 రోజుల్లో కొత్త వాహనాన్ని ఇవ్వాలని, లేదా రూ.20.50 లక్షలు, ఆర్‌టీఓ, ఇన్సురెన్స్ ఖర్చులు కలిపి చెల్లించాలని కమిషన్ మారుతీ సుజుకీని ఆదేశించింది. వినియోగదారుడిని మానసిక క్షోభకు గురి చేసినందున లక్ష రూపాయలు, లిటిగేషన్ ఖర్చుల కింద మరో రూ.10వేలు కూడా చెల్లించాలని పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వును సవాలు చేయనున్నట్లు మారుతీ సుజుకీ తెలిపింది. ఇ-20 ఇంధనాన్ని వినియోగించుకోవడానికి ఆ కారు పూర్తి అనుకూలంగా ఉందని తెలిపింది. ఇ20 ఇంధనం కోసం అవసరమైన అన్ని సదుపాయాలు ఆ కారుకు ఉన్నాయన్న విషయం యజమాని మాన్యువల్‌లో కూడా వెల్లడించినట్లు పేర్కొంది. కల్తీ ఇంధనం నింపడం వల్లే తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయనడానికి తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేస్తామని మారుతీ సుజుకీ తెలిపింది.




రూ.7,500 కడితే రూ.లక్ష అంటూ

## ఆర్‌బీఐ పేరిట లేఖ..

అసలు నిజం ఇదీ!




**న్యూఢిల్లీ:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నా యి. అమాయకులకు సైబర్ వల విసిరి వారి బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరును ఉపయోగించి కొందరు కేటుగాళ్లు చేస్తున్న ఫేక్ ప్రచారాలపై కేంద్రం అప్రమత్తమైంది. రీఫండబుల్ ట్యాక్స్ పేరిట సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ వార్తలను నమ్మొద్దని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. రూ.7,500 రీఫండబుల్ ట్యాక్స్ కడితే ఆర్‌బీఐ రూ.లక్ష విడుదల చేస్తుందంటూ తాజాగా సోషల్ మీడియాలో ఓ లేఖ విస్తృతంగా ప్రచారం అవుతుంది. దీనిపై ఫ్యాక్ట్ చెక్ చేసిన కేంద్రం.. ఆ లేఖతో ఆర్‌బీఐకి గానీ, ప్రభుత్వానికి గానీ ఎటువంటి సంబంధమూ లేదని తేల్చింది. ఇలాంటి సందేశాలు, లేఖలకు స్పందించి ఎలాంటి చెల్లింపులూ చేయవద్దని ప్రజలను హెచ్చరించింది. ముందస్తు చెల్లింపులు, పన్నులు లేదా ప్రాసెసింగ్ ఫీజులకు బదులుగా నగదు చెల్లింపులు చేస్తామని ఆర్‌బీఐ ఎప్పుడూ ప్రకటనలు చేయదని స్పష్టం చేసింది. ప్రజలను నమ్మించడానికి సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ సంస్థల పేర్లు, లోగోలను వినియోగించి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఇటువంటి ప్రచారాలపై స్పందించే ముందు వాటిని అధికారిక వెబ్‌సైట్లలో ధ్రువీకరించుకోవాలని సూచించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,53,140 (22 క్యారెట్లు) | ₹ 1,67,064 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

## మార్కెట్ లీడర్ ‘వీవో’నే

దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ధరల పెరుగుదల కారణంగా వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో స్మార్ట్‌ఫోన్ సరఫరాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 10 శాతం క్షీణతను నమోదు చేసింది. గడిచిన ఆరేళ్లలో రెండో త్రైమాసికంలో ఇంతటి భారీ తగ్గుదల కనిపించడం ఇదే తొలిసారని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఏఐ నుంచి డిమాండ్ కారణంగా స్మార్ట్‌ఫోన్ మెమొరీ విడిభాగాల ధరలు ఈ ఏడాది విపరీతంగా పెరిగాయి. దీంతో మొబైల్ కంపెనీలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను దాదాపు 15 శాతం మేర పెంచాయి. ముఖ్యంగా బడ్జెట్ సెగ్మెంట్ (రూ. 15వేల లోపు) ఫోన్ల విక్రయాలు దాదాపు 45 శాతం మేర పడిపోయాయని కౌంటర్‌పాయింట్ నివేదిక వెల్లడించింది. దీంతో చాలా కంపెనీలు మాస్ మార్కెట్‌కు చేరువయ్యేందుకు 4జీ స్మార్ట్‌ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయని తెలిపింది. అల్ట్రా ప్రీమియం స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్ (రూ.45వేలు పైబడి) ఫోన్లు మాత్రం విక్రయాలు మాత్రం స్థిరంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. మెరుగైన ఫైనాన్సింగ్ ఆప్షన్లు ఇందుకు కారణమని పేర్కొంది. బడ్జెట్ ఫోన్ల అమ్మకాలు తగ్గడంతో చైనా మొబైల్ బ్రాండ్ల మొత్తం మార్కెట్ వాటా భారీగా క్షీణించినట్లు వెల్లడించింది.

**వివో టాప్ బ్రాండ్**

భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వివో హవా కొనసాగుతోంది. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి (ఐకూ కాకుండా) 18 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో నిలవగా.. శాంసంగ్ రెండో స్థానంలో నిలిచింది. టాప్- 5 బ్రాండ్లలో కేవలం శాంసంగ్ మాత్రమే 2 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిందని సదరు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఇక నథింగ్ బ్రాండ్ వేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలిచింది. ఏకంగా 105 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ జట్టుకు టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించడం, నథింగ్ ఫోన్ 4ఏ సిరీస్‌కు ఉన్న క్రేజ్ ఆ కంపెనీకి కలిసొచ్చింది.


# 2031 నాటికి 5 కోట్ల ప్రయాణికులు లక్ష్యం

రూ.10,000 కోట్లతో మౌలిక వసతుల విస్తరణ

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రణాళికలు

**హైదరాబాద్:** దేశంలోనే అత్యుత్తమ విమానయాన హబ్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దేందుకు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) వ్యూహాలు సిద్ధం చేస్తోంది. అయిదేళ్లలో (2031 సెప్టెంబరు కల్లా) విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల సామర్థ్యాన్ని 5 కోట్లకు పెంచాలన్నది సంస్థ లక్ష్యం. ఇందుకోసం ఎయిర్ పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ (ఏఈఆర్ఏ) తుది ఆమోదాలను అనుసరించి, విమానాశ్రయ విస్తరణ పనుల కోసం రూ.10,000 కోట్లకు పైగా మూలధన వ్యయం చేయనుంది. టెర్మినల్ వార్షిక ప్రయాణికుల సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి 3.7- 4 కోట్లకు పెంచడంతో పాటు, సరికొత్త రెండో టెర్మినల్, మరో రన్‌వే నిర్మాణం.. రెండు రన్‌వేలను అనుసంధానించే క్రాస్ ట్యాక్సీవేలను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించామని సంస్థ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దేశీయ విమానయాన సంస్థలు భారీగా కొత్త విమానాలకు ఆర్డర్లు ఇస్తున్నందున ప్రస్తుత 100 పార్కింగ్ స్టాండ్‌లను సంస్థ రెట్టింపు చేయనుంది. ఇందులో 10 పార్కింగ్ స్టాండ్‌ల పనులు సాగుతుండగా, ఉత్తర టెర్మినల్ విస్తరణలో మరో 10 స్టాండ్‌లు అందుబాటులోకి రానున్నాయి.

4 లక్షల మందికి ఉపాధి: తెలంగాణ రాష్ట్ర స్థూల విలువ జోడింపులో ఈ విమానాశ్రయ వాటా 5 శాతమని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. ఈ విమానాశ్రయ కార్యకలాపాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారని.. విస్తరణ



పూర్తయితే, 2038 నాటికి ఈ సంఖ్య 6 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.2 లక్షల కోట్ల అదనపు ఆర్థిక విలువ చేకూరుతుందని నివేదిక పేర్కొంది.

కనెక్టింగ్ ప్రయాణికులు అత్యధికం: శంషాబాద్ విమానాశ్రయానికి 27-30% మంది కనెక్టింగ్ ప్రయాణికులే వస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి.. ఇక్కడి నుంచి దుబాయ్, లండన్ వంటి అంతర్జాతీయ గమ్యాలకు వెళ్తున్నారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి చేస్తున్న డొమెస్టిక్-టు-డొమెస్టిక్ (డీ2డీ), డొమెస్టిక్-టు-ఇంటర్నేషనల్ (డీ2ఐ) ప్రత్యేక మార్గాలు కొన్ని నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. అప్పుడు కనెక్టింగ్ ప్రయాణికులు బయటకు రాకుండా, 5 అయిదు నిమిషాల్లోనే నేరుగా అంతర్జాతీయ ప్రాంగణాన్ని చేరుకోవచ్చు.


**ప్రైవేట్ జెట్‌లు పెరుగుతున్నాయి**

దిల్లీ-ఎన్‌సీఆర్ తరువాత దేశంలో అత్యధిక సంపన్నులు (హెచ్ఎన్ఐ) ఉన్న నగరంగా హైదరాబాద్ నిలవడంతో, ప్రైవేట్ జెట్ రాకపోకలు పెరిగాయి. దీనికోసం రెండేళ్ల క్రితమే అత్యాధునిక సదుపాయాలతో జనరల్ ఏవియేషన్ టెర్మినల్ నిర్మించగా.. రోజుకు సగటున 10-20 జెట్ ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ విమానాశ్రయం నుంచి ఎగుమతి అయ్యే సరకులో దాదాపు 60% ఫార్మా ఉత్పత్తులే ఉంటున్నాయి. అందుకే శీతల రవాణా సదుపాయాన్ని 50,000 టన్నుల నుంచి లక్ష టన్నులకు విస్తరిస్తున్నారు. దేశీయ కార్గో కోసం మరో లక్ష టన్నుల సామర్థ్యంతో కొత్త టెర్మినల్ నిర్మించే ప్రయత్నాల్లో సంస్థ ఉంది.

## రూ.250 లక్షల కోట్ల బయో ఎకానమీ

2047పై నీతి ఆయోగ్ నివేదిక

దిల్లీ: మనదేశ బయోఎకానమీ 2035 కల్లా 691 బి. డాలర్ల(దాదాపు రూ.66 లక్షల కోట్ల)కు, 2047 కల్లా 2.6 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.250 లక్షల కోట్ల)కు చేరుతుందని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. ఫలితంగా 3 కోట్లకు పైగా ఉన్నత స్థాయి ఉద్యోగాల సృష్టి జరుగుతుందని తెలిపింది. ప్రపంచంలోనే అగ్రగామి 3 బయోటెక్నాలజీ దేశాల్లో ఒకటిగా భారత్ నిలుస్తుందనీ అంచనా వేసింది. ఆహారం, ఇంధనం, పారిశ్రామిక వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పునరుత్పాదక బయోలాజికల్ వస్తువులతో ఏర్పడే ఆర్థిక నమూనాను బయోఎకానమీగా పరిగణిస్తారు. 2047 కల్లా ఆ స్థాయికి బయోఎకానమీని చేర్చాలంటే దేశవ్యాప్తంగా సమన్వయ కార్యాచరణ ప్రణాళిక వైపుగా నడవాలని సూచించింది. మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సాధికారిక కమిటీలు, అనుమతులు వేగంగా ఇచ్చేలా నియంత్రణ సంస్కరణలు, బయోసైన్స్ నాయకత్వం, నైపుణ్య బలోపేతం, రూ.50,000 కోట్లతో నిధి ఏర్పాటు తదితరాలు అవసరమని అభిప్రాయపడింది. 2014లో బయోఎకానమీ 10 బి. డాలర్లుగా ఉండగా, 2025 కల్లా 16 రెట్లు వృద్ధి చెంది 195.3 బి. డాలర్లకు చేరింది. ప్రస్తుతం దేశ జీడీపీలో 4.8% వాటా కలిగి ఉంది.



## పేటీఎం మొదటి బోనస్ ఇష్యూ!

**న్యూఢిల్లీ:** డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్, 25 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా వాటాదార్లకు బోనస్ షేర్ల ఇష్యూను ప్రకటించింది. తొలిసారిగా ఒక ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తం నికర లాభాన్ని నమోదు చేయడం, మార్కెట్ వాటాను భారీగా పెంచుకున్న నేపథ్యంలో.. వ్యాపారంపై నమ్మకానికి సంకేతంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలతో పాటు బోనస్ షేర్ల ప్రతిపాదనను పరిశీలించడానికి ఈనెల 20న కంపెనీ బోర్డు సమావేశం కానుంది. ఈ సమావేశంలోనే బోనస్ షేర్ల నిష్పత్తిని, రికార్డు తేదీని బోర్డు నిర్ణయించనుంది. బోనస్ ఇష్యూ వల్ల కంపెనీపై ఎటువంటి ఆర్థిక భారం ఉండదు. ప్రస్తుతం పేటీఎం వద్ద ఉన్న రూ.13,315 కోట్ల భారీ నగదు నిల్వలను భవిష్యత్తు వృద్ధి కోసం కొనసాగించనుంది. ఇదే సమయంలో షేరు ధర తగ్గడం వల్ల చిన్న, కొత్త మదుపర్లకు అందుబాటు ధరలో లభించి, మార్కెట్‌లో లిక్విడిటీ పెరుగుతుంది. 2024-25లో రూ.663 కోట్ల నికర నష్టాల్లో ఉన్న పేటీఎం, 2025-26లో ఏకంగా రూ.552 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఎబిటా రూ.1506 కోట్ల నష్టం నుంచి రూ.502 కోట్ల లాభానికి చేరింది. గత 12 నెలల్లోనే రూ.2000 కోట్లకు పైగా టర్న్‌రౌండ్‌ను కంపెనీ సాధించింది. 2025-26లో కంపెనీ మొత్తం ఆదాయం 22% పెరిగి రూ.8,437 కోట్లకు చేరింది. 2024 ఫిబ్రవరిలో రికార్డు కనిష్ఠాలకు పడిపోయిన పేటీఎం షేరు, అనంతరం బలంగా పుంజుకుని 2026 జులైలో 52 వారాల గరిష్ఠమైన రూ.1407ను నమోదుచేసింది.

## పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు ‘ఆరోగ్య భరోసా’

సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

## ట్రూకాలర్ వంటి యాప్‌లు స్పామ్ డేటాను టెల్కోలకివ్వాలి

నిబంధనల సవరింపులో ట్రాయ్



**దిల్లీ:** ట్రూకాలర్ వంటి కాల్ నిర్వహణ యాప్‌లకు టెలికాం నియంత్ర ణాధికార సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలను తీసుకురానుంది. ఇందు కోసం టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్ (టీసీసీసీపీఆర్)కు సవరణలు చేయాలని ప్రతిపాదించింది. తద్వారా కాల్ నిర్వహణ యాప్‌లు, ‘వినియోగదార్లు అం దించే స్పామ్ సమాచారాన్ని’ టెలికాం కంపెనీ (టెల్కో)లతో పంచుకోవాలని నిర్దేశిస్తోంది. ఈ సవరణలకు కొద్ది వారాల్లోనే తుదిరూపునిస్తారని ఈ అంశంతో సంబంధమున్న వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం వినియోగదార్లు లేవనెత్తే స్పామ్ రిపోర్టులన్నీ, యాప్‌ల వద్దే ఉంటున్నాయి. టెల్కోలతో ఆ సమాచారాన్ని అవి పంచుకోవడం లేదు. స్పామ్ కాల్స్, మెసేజ్‌లపై పోరాటాన్ని బలోపేతం చేయడం కోసం టీసీసీసీపీఆర్ (మూడో సవరణ) 2026 ముసాయిదాపై మార్చి 13న ట్రాయ్ ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లు, సెండర్లు, కాల్ నిర్వహణ యాప్‌లకు కఠిన నిబంధనలూ తీసుకురానుంది. దీనిపై వివిధ వర్గాల స్పందనలను ప్రస్తుతం ట్రాయ్ పరిశీలిస్తోంది.

## బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్

బర్న్‌హామ్‌ను ఆహ్వానిం చనున్నారు. ఇటీవల కీర్ స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. ఆండీ ముర్రే బర్న్‌హామ్ 1970లో వాయువ్య ఇంగ్లాండ్‌లోని మెర్సీసైడ్‌లో జన్మించారు. రాజకీయాలపై ఆసక్తితో లేబర్ పార్టీలో చేరిన ఆయన.. 2001 నుంచి 2017 వరకు ఎంపీగా పనిచేశారు. మాజీ ప్రధాని గార్డన్ బ్రౌన్ హయాంలో క్యాబినెట్‌లో కీలక పదవులు చేపట్టారు. ట్రెజరీ, కల్చరల్, ఆరోగ్య మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహించారు. లేబర్ పార్టీలో నాయకత్వ పగ్గాల కోసం ఆండీ గతంలో రెండు సార్లు పోటీపడ్డారు. 2015, 2017లో ఆ బాధ్యతల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ప్రధాని కావాలన్న తన కలను పక్కనబెట్టి.. 2017లో గ్రేటర్ మాంచెస్టర్‌కు మేయర్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బర్న్‌హామ్ మరోసారి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. దీంతో ప్రధాని పదవికి బరిలో నిలిచేందుకు ఆయనకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పార్టీకి నాయకత్వం వహించే వ్యక్తి బ్రిటన్‌కు ప్రధానిగా వ్యవహరిస్తారు. లేబర్ పార్టీలో బర్న్‌హామ్‌ని కీర్ స్టార్మర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా పేర్కొంటారు.

# రోబోటిక్స్‌తో జతకలిసిన ఏఐ

**ఎన్విడియా టెక్నాలజీతో ఫుజిత్సు ముందడుగు**

**టోక్యో:** జపాన్‌కు చెందిన కమ్యూనికేషన్స్ కంపెనీ ఫుజిత్సు, కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని అమెరికా దిగ్గజం ఎన్విడియా టెక్నాలజీని ఉపయోగించి ముందడుగు వేస్తోంది. రోబోటిక్స్‌లో జపాన్ అత్యుత్తమ తయారీ నైపుణ్యాన్ని ఏఐతో మేళవిస్తున్నట్లు ఫుజిత్సు పేర్కొంది. ఫిజికల్ ఏఐగా పిలుచుకునే సాంకేతికత కేవలం ప్రోగ్రామ్ చేసిన ఆదేశాలను పాటించడమే కాకుండా, సొంతంగా ఆలోచించగల స్మార్ట్, భవిష్యత్ రోబోలను తీసుకొస్తుంది. ఇవి ఫ్యాక్టరీలు, ఇళ్లు, ఆసుపత్రుల్లో సురక్షితంగా పని చేస్తాయి. జపాన్‌లో అగ్రశ్రేణి పారిశ్రామిక రోబో తయారీ సంస్థలైన ఫానుక్ కార్ప్, యాస్కావా ఎలక్ట్రిక్ కార్ప్, కవాసకి హెవీ ఇండస్ట్రీస్ సీఈఓలతో పాటు ఎన్విడియా కార్ప్ సీఈఓ జెన్సన్ హువాంగ్, ఫుజిత్సు సీఈఓ తకాహితో టోకిటా గురువారం టోక్యోలో




సమావేశమై ఈ విషయాన్ని ప్రకటించారు. జపాన్‌లో నెలకొన్న తీవ్రమైన కార్మికుల కొరతను రోబోలు పరిష్కరించగలవని కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన ప్రపంచంలో, వృద్ధుల జనాభా ఎక్కువగా సమాజాల్లో జపాన్ ఒకటి. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధులను చూసుకునేందుకు స్మార్ట్ రోబోలు సాయపడగలవని వారు పేర్కొన్నారు. స్వతంత్రంగా కదిలే రోబోలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, అయితే తయారీ నాణ్యత విషయంలో జపాన్‌కు ఉన్న ఖ్యాతి కారణంగా ఫిజికల్ ఏఐ ఆదేశానికి బాగా సరిపోతుందని హువాంగ్ అన్నారు. జపాన్ ప్రధాని సనయే తకైచి ఇటీవల ఒక ప్రణాళికను ప్రకటించారు. దీని ప్రకారం 2040 నాటికి ఫిజికల్ ఏఐ, సెమీకండక్టర్లు, డేటా కేంద్రాలతో పాటు వివిధ సాంకేతిక రంగాల్లో 370 ట్రిలియన్ యెన్ల (2.3 లక్షల కోట్ల అమెరికా డాలర్ల) కంటే ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఎరువులను అధిక ధరలకు అమ్మితే డీలర్లపై చర్యలు తప్పవు

**వ్యవసాయ శాఖ ఏడీఏ అంజనీ మిశ్రా**



**మంథని, జూలై 17, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లతో శుక్రవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు బి. రామకృష్ణ (కమాన్‌పూర్), కె. శ్రీకాంత్ (రామగిరి), డాక్టర్ డి. నవ్య (మంథని)తో పాటు డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ అంజనీ మిశ్రా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులపై అదనపు భారం పడకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువులను అధిక ధరలకు విక్రయించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయించిన డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలాగే పెసర, కంది, మినుములు వంటి ఆరుతడి పంటల విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఆదేశించారు. అలాగే, పారాక్వాట్ పురుగుమందు నిషేధంలో ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ దాని విక్రయం చేపట్టరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

## కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుంది

**లేబర్ కోడులను రద్దు చేయాలి : ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య**

**కంపెనీలలో కార్మికులకు ఉదోగ్య భద్రత కల్పించడం లేదు**



**మహేశ్వరం,జూలై17(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య అన్నారు.శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని లక్ష్మీ గార్డెన్ లో జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడులను రద్దు చేయాలన్నారు.కంపెనీలలో కార్మికులకు ఉదోగ్య భద్రత లేదన్నారు.కంపెనీల యాజమాన్యం కార్మికుల శ్రమతో దోపిడి చేస్తున్నారన్నారు.కార్మికులకు 26000 కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.తుక్కుగూడ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మాణం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దత్తు నాయక్,జిల్లా కార్యదర్శులు వనంపల్లి జైపాల్ రెడ్డి,వడ్ల సత్యనారాయణ,సక్రూ నాయక్,మద్దిలేటి,దేవేందర్ గౌడ్,రాజు,రాములు గౌడ్,పలువురు ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తా

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

రాయికల్ జనంసాక్షి :



శుక్రవారం రోజున జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి యం.ఏ.మోఖీద్ ఆధ్వర్యంలో రాయికల్ మండల అల్లిపూర్ గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలిసి అల్లిపూర్ గ్రామంలో కోనమ్మ చెరువు వద్ద గంగమ్మ తల్లి దేవాలయం నిర్మాణం మరియు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కి సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘ అధ్యక్షులు తోపారపు ప్రశాంత్, వార్డ్ మెంబర్ కల్లెడ గంగాధర్, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి కల్లెడ రాకేష్,అర్ముళ్ల పవన్, పళ్ళికొండ గంగాధర్, రవి, రెడ్డి, రాహుల్, శంకర్, శివకుమార్, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ రావు, దొబ్బల వేణు తదితరులు పాల్గొన్నారు.



- వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- 24 వేల ఎకరాల్లో సాగు.. వర్షాలే కీలకం
- పెట్టుబడి మునిగిపోతుందనే రైతుల ఆందోళన

# చినుకు చింత

## వరుణ దేవుడే ఆదుకోవాలి అంటూ ఆకాశం వైపు అన్నదాతల చూపు



**బంట్వారం, జూలై 17 (జనంసాక్షి) :** బంట్వారం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. సీజన్ ప్రారంభంలో అక్కడక్కడ కురిసిన చిరుజల్లులను నమ్ముకొని రైతులు అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసి సాగు పనులు చేపట్టారు. అయితే విత్తిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అనేక పొలాల్లో విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన చోట కూడా తేమ లేక మొక్కలు ఎండుముఖం పట్టడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

ప్రస్తుతం మండలంలోని రైతులందరి చూపు ఆకాశం వైపే నిలిచింది. "వరుణ దేవుడు ఎప్పుడు కరుణిస్తాడో... ఎప్పుడు వర్షాలు కురుస్తాయో" అనే ఆందోళన ప్రతి రైతు ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. బంట్వారం మండలంలో 2026-27 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సుమారు 24 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. పత్తి 12,500 ఎకరాలు, కంది 8,500 ఎకరాలు, వరి 800 ఎకరాలు, మొక్కజొన్న 210 ఎకరాలు, చెరకు 1,800 ఎకరాలు సాగయ్యాయి. ఈ పంటలన్నీ ప్రస్తుతం వర్షాల కోసం ఎదురు చూస్తున్నాయి. వర్షాలు లేకపోవడంతో కొంతమంది రైతులు బోరు బావుల నీటిని మోటార్లు, డ్రిప్ సిస్టమ్‌ల ద్వారా అందిస్తూ మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టడంతో రైతులకు ఈ అవకాశం లేకపోవడం మరో సమస్యగా మారింది. ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు విత్తనాలు, ఎరువులు, దున్నకం, కూలీల ఖర్చుల కోసం భారీగా పెట్టుబడులు పెట్టారు. కానీ సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఆ పెట్టుబడి మొత్తం ప్రమాదంలో పడింది. ఇప్పటికే కొన్ని పొలాల్లో రైతులు మళ్లీ విత్తాల్సిన పరిస్థితి నెలకొంది.

తేమ లేకపోవడంతో పత్తి, కంది వంటి ప్రధాన పంటల్లో ఎదుగుదల మందగించింది. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు పూర్తిగా ఎండిపోతుండగా, మరికొన్ని చోట్ల పసుపు రంగులోకి మారుతున్నాయి. రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో మంచి వర్షాలు కురిస్తేనే పంటలు గట్టెక్కే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించాలని బంట్వారం మండల రైతన్నలు కోరుకొంటున్నారు. మరోవైపు ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతన్నలు ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. మరి ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణిస్తాడో రైతులను నట్టేట ముంచేస్తాడో వేచి చూడాలి.

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 55 మంది ఇన్స్పెక్టర్ల బదిలీలు

**శేరిలింగంపల్లి, జూలై 17 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 55 మంది పోలీసు అధికారులకు ఉన్నతాధికారులు స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు బదిలీ అయిన అధికారులకు పోస్టింగులతో ఉత్తర్వులు అందంగా వారు శుక్రవారం విధుల్లో చేరారు. కూకట్పల్లి ఇన్స్పెక్టర్ కె వి సుబ్బారావు బదిలీలో భాగంగా మాదాపూర్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా ఉన్న జి. ప్రశాంత్ బాలానగర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధుల్లో చేరడం జరిగింది. ఈ క్రమంలో పి. రమేష్ మాదాపూర్ డిఐగా, టీ భూపతి రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా, డి. స్వామి గౌడ్ కూకట్పల్లి ఎస్హెచ్ఓగా, జి. శేఖర్ రెడ్డి కూకట్పల్లి డిఐగా, ఎన్. జయరాం మియాపూర్ ఇన్స్పెక్టర్ గా, జి. విజయకుమార్ కెపిహెచ్బి ఎస్హెచ్ఓగా మిగిలిన పోలీస్ అధికారులు సైతం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లడం జరిగింది. ఇప్పటివరకు పలువురు అధికారులు వెయిటింగ్ లిస్టులో ఉండగా ఈ దఫా బదిలీలలో వారికి వివిధ స్థానాలను కేటాయించినట్లు సైబరాబాద్ ఉన్నతాధికారులు వివరించారు. భారీ స్థాయిలో బదిలీలు జరగడం వల్ల అధికారుల స్థానభ్రంశంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ, మరింత జవాబుదారీతనం పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుందని సైబరాబాద్ పోలీస్ బాస్ డాక్టర్ ఎమ్. రమేష్ తెలియజేశారు.

## బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్





- ఆసుపత్రిలో అపరిశుభ్రతపై కలెక్టర్ అసంతృప్తి
- పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ

**బోధన్, జూలై 17 (జనంసాక్షి) :** బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కాన్పుల విభాగం, ఇమ్యూనైజేషన్ గది, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ తదితర విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణను, శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలన జరిపారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డితో కలిసి బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్ మెంట్లను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొని ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. బాన్సువాడ తో పాటు సరిహద్దు ప్రాంతాల నుండి గర్భిణీలు ఈ ఆసుపత్రిని సందర్శిస్తున్నారని, ప్రతి నెల సగటున 200 వరకు కాన్పులు జరుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెడికో లీగల్ కేసులు కూడా ఎక్కువగానే వస్తున్నందున, భద్రతాపరమైన అంశాల రీత్యా బోధన్ ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా పోలీసు శాఖకు ప్రతిపాదిస్తామని తెలిపారు. వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను, వైద్యులను, సిబ్బందిని సమకూరుస్తామని, అయినా కూడా వైద్య సేవలలో లోపాలు ఉంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. స్థానిక ఆర్డీఓ నేతృత్వంలో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి, ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయంపై అసత్య ప్రచారాలు మానాలి


**ఉపకులపతి అల్దాస్ జానయ్య**



**రాజేంద్రనగర్, జూలై 17 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంపై అసత్య ప్రచారాలు చేయొద్దని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ఏడవ వేతన సంఘం బకాయిల విషయంలో గత యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, తాము ఎంపీల సహకారంతో కేంద్రం నుంచి సుమారు రూ.30 కోట్ల బకాయిలు విడుదల చేయించామని తెలిపారు. విశ్వవిద్యాలయ ర్యాంకు 37వ స్థానం నుంచి 19వ స్థానానికి చేరిందని, రూ.500 కోట్ల ప్రత్యేక గ్రాంట్ కోసం కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంపీలు పార్టీలకతీతంగా సహకరిస్తున్నారని, వారిపై బురద జల్లడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. గత యాజమాన్యం చేసిన లోపాలను సరిదిద్దుతూ అనేక సంస్కరణలు చేపట్టామని ఆయన వెల్లడించారు.

## విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ప్రజా ఆరోగ్య,పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ...నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లో పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయలన్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.ఆసుపత్రులలో మందులు,పరీక్ష కిట్లు,వైద్య సిబ్బంది,అంబులెన్స్ సేవలు,వైద్య సేవ సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ విధానానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



**హయత్‌నగర్, జూలై 17 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యుత్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోనగర్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హయత్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ చట్టాన్ని అమలు చేసే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, క్రాస్ సబ్సిడీ రద్దు, విద్యుత్ డిస్కమ్‌ల ప్రైవేటీకరణ వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆరోపించారు. ఈ విధానాలు అమలైతే విద్యుత్ చార్జీలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతుందని అన్నారు. చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, షాపులకు లభిస్తున్న సబ్సిడీలు రద్దయ్యే అవకాశం ఉందని, పేదలకు అమలవుతున్న జీరో బిల్లు పథకం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యుత్ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కేసరి నర్సిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక వీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ముషం నరహరి, నాయకులు సీహెచ్ వెంకన్న, కొత్త గణేష్ గౌడ్, తిరుమల సంధ్య, కనకయ్య, జనార్దన్ గౌడ్, మూర్తి, జనార్దన్ రెడ్డి, రాధమ్మ, శక్తి మధు, టి. కృష్ణమూర్తి, రాములమ్మ, పద్మ, లింగం యాదవ్, యాదయ్య, పార్వతమ్మ, దయానంద్, ధనాజీ, రెడ్డమ్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

- 575 మార్కులతో విశ్వజీత్ రెడ్డి ప్రతిభ
- ఉత్తర తెలంగాణలో మరోసారి విజయదుందుభి
- నిరంతర కృషి పటిష్ట ప్రణాళికే ఇంతటి ఘన విజయానికి కారణం
- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేష్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జులై 17 (జనంసాక్షి) :** నీట్ – 2026 ఫలితాల్లో కరీంనగర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ – యూజీ పరీక్షలో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. 720 మార్కులకు గాను బి. విశ్వజీత్ రెడ్డి 575 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలవగా, జి. అర్చన 492, షేక్ హుస్సేన్ 468, ఎం.సాయి సాత్విక్ 450, ఇ. అఖిల్ 448, ఎన్.భార్గవి 439, ఎన్.స్ఫూర్తి శ్రీ 436, మహేశ్వరి 436, ఎం. సాత్విక 425, సీహెచ్. శ్రీషా 425, జూ. శిరీష 424, ఎన్. హారిక 410 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ఎం. రమేష్ రెడ్డి మాట్లాడుతూ... వివిధ కేటగిరీల్లో మరెందరో విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ప్రతి ముగ్గురిలో ఇద్దరిని వైద్యులుగా తీర్చిదిద్దుతూ విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల సమర్థ మార్గనిర్దేశం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఎంసెట్, ఐఐటీ – జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, ఉత్తర తెలంగాణలో శ్రీ చైతన్యను అగ్రస్థానంలో నిలబెడుతున్నారని చెప్పారు. నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### సింగరేణి కళాకారులకు సంగీత వాయిద్య

## పరికరాలను అందజేయండి

**అర్జీ 2 జిఎం బండి వెంకటయ్యకు వినతి పత్రం అందజేసిన కళాకారులు**



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ.2 కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు.. సింగరేణి కళాకారులకు సంగీత వాయిద్యాలను ఇప్పించాలని, అదేవిధంగా కలలను ప్రాక్టీస్ చేసుకోవడానికి సిఈఆర్ క్లబ్బులో ఒక గదిని కేటాయించాలని సింగరేణి ఉద్యోగ కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కనకం రమణయ్య, ఉపాధ్యక్షులు బోయిన రాజారాం, ప్రధాన కార్యదర్శి బుంభక్ రాకేష్, సంయుక్త కార్యదర్శి కోల క్రిష్ణ స్వామి, సహాయ కార్యదర్శి తాళ్ల పెల్లి నారాయణ, కోశాధికారి గీసల రామారావు, అరవింద్ కలిసి ఆర్జీ టు జి ఎం బండి వెంకటయ్యకు వినతి పత్రం అందించారు.

సింగరేణి కంపెనీలో క్రీడాకారులకు ఆట వస్తువులు, క్రీడా సామగ్రిని ఎన్నో సంవత్సరాల నుండి కంపెనీ అందజేస్తుందనీ, కళాకారులకు మాత్రము ఎలాంటి సంగీత వాయిద్య పరికరాలను, కాస్ట్యూమ్స్ ను అందజేయడం లేదన్నారు.ఉద్యోగ కళాకారులము, ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే కంపెనీ సాంస్కృతిక పోటీలలోను, కోల్ ఇండియా స్థాయి పోటీలలోను ఎన్నో పథకాలను సాధించి కంపెనీకి పేరు ప్రఖ్యాతులు తీసుకు వస్తున్నామని, అదే విధంగా సింగరేణి-డే ఉత్సవాలు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, ప్రతి సంవత్సరం జరిగే రక్షణ వారోత్సవాల కార్యక్రమాలలో కూడా ప్రదర్శనలు ఇస్తూ కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తున్నామన్నారు. కంపెనీ కళాకారులకు కూడా తగిన గుర్తింపును ఇవ్వాలని, ఈ సారైనా వార్షిక క్రీడా సాంస్కృతిక పోటీలు ప్రారంభం కాకముందే కళాకారులకు సంగీత వాయిద్యాలను, సాధన చేసుకొనుటకు ఒక గదిని కూడా కంపెనీ కేటాయించాలని కోరారు.జీఎం బండి వెంకటయ్య సానుకూలంగా స్పందించారని వ్యవస్థాపక అధ్యక్షులు కనకం రమణయ్య తెలిపారు.

## ఉద్యోగం పేరుతో మోసం.. డబ్బులడిగితే వేధింపులు

- యువకుడి ఆత్మహత్యకు కారణమైన మహిళ అరెస్ట్!
- రూ.55 వేల వసూలు.. చేసిన కిలాడీ లేడీ
- మానసిక వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్య
- రిమాండ్‌కు తరలింపు.. దర్యాప్తు కొనసాగుతోంది



**మర్రిగూడ, జూలై 17:** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన చాపల శివ (25) ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి యువకుడి వద్ద నుంచి రూ.55 వేల వసూలు చేసి, అనంతరం డబ్బులు తిరిగి కోరినప్పుడు మానసికంగా వేధించి, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంపట్నం మండలం నానికి చెందిన మంద భారతి అనే మహిళను మర్రిగూడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన మంద భారతి, చాపల శివ వద్ద నుంచి దశలవారీగా మొత్తం రూ.55 వేల వరకు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అయితే ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు తీసుకున్న డబ్బును కూడా తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉద్యోగం లేదా డబ్బుల విషయమై శివ ప్రశ్నించిన ప్రతి సారి అతనిని దుర్భాషలాడడం, అవమానించడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన శివ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మర్రిగూడ పోలీసులు, సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, విచారణలో లభించిన వివరాల ఆధారంగా నిందితురాలి పాత్రను నిర్ధారించి అరెస్టు చేశారు.

# దేవాదాయ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 191 పోస్టుల భర్తీ

- నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ
- రాజన్న ఆలయానికి 21 పోస్టుల కేటాయింపు
- 14 సంవత్సరాల తర్వాత భారీ నియామకాలు
- అర్చక వ్యవస్థ బలోపేతం, సాంప్రదాయ కళాకారులకు ప్రోత్సాహం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా 191 పోస్టులను భర్తీ చేస్తూ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. నియామక పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భర్తీ చేసిన 191 పోస్టుల్లో వేములవాడ రాజన్న ఆలయానికి 21 పోస్టులు కేటాయించారు. వీటిలో 11 మంది పరిచారకులు, 2 వైష్ణవ అర్చకులు, 2 తమ్మల అర్చకులు, ఒక అసిస్టెంట్ కుక్, ఒక శృతి వాద్యకారుడు, 2 డోలు వాద్యకారులు, 2 సన్నాయి వాద్యకారుల పోస్టులు ఉన్నాయి. దాదాపు 14 సంవత్సరాల తర్వాత దేవాదాయ ధర్మాదాయ శాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం విశేషం. ఆలయాల్లో నెలకొన్న సిబ్బంది కొరతను అధిగమించడంతోపాటు అర్చక వ్యవస్థను బలోపేతం చేయడం, సాంప్రదాయ వాద్య కళాకారులకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నియామకాలను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. నియామక పత్రాల కార్యక్రమానికి రాజన్న ఆలయం ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి, భోజన వసతి సహా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా ఈవో ఎల్. రమాదేవి ఎంపికైన అభ్యర్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం రాజన్న ఆలయం ఆధ్వర్యంలో హాజరైన ఉన్నతాధికారులకు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

### కొండగట్టు దేవస్థానంలో ఖాళీ పోస్టుల భర్తీ

**అర్చకులు, డోలు, సన్నాయి పోస్టులకు ఎంపిక**

మల్యాల, జూలై 17: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత పరీక్ష ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నియామక పత్రాలను అందజేశారు. పోస్టుల భర్తీ కోసం 18-05-2026న నిర్వహించిన అర్హత పరీక్ష ఆధారంగా మొత్తం 6 పోస్టులను భర్తీ చేశారు. వాటిలో 4 అర్చక పోస్టులకు తిరునహరి ఆకాష్ మనోజ్, వకుళాభరణం అరుణ్ కుమార్, ఆశ్రిత్ తిరుక్కోవెల, తిరుక్కోవెల అజయ్ ప్రసాద్‌లు ఎంపికయ్యారు. డోలు పోస్టుకు మంగలి సుదర్శన్ బాబు, సన్నాయి పోస్టుకు తిరుమల వెంకట అశోక్ ఎంపికయ్యారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు, ఐఏఎస్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండగట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్. అంజనారెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తే

# ఊరుకునే ప్రసక్తి లేదు

- రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలి
- గడువులోగా అమృత్ పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు
- కార్గిల్ చెరువు పునరుద్ధరణకు శంకుస్థాపన
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 17 (జనంసాక్షి) :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచులను బెదిరించి ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. "అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను కరెంట్ బిల్లులు, జీతాలకు ఎట్లా మళ్లిస్తారు? ఇది నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాయాల్సి ఉంటుంది. అవసరమైతే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తాం" అని చెప్పారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు కూడా నిధులివ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా? అని మండిపడ్డారు.

సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, పలువురు ఉన్నతాధికారులు మంత్రికి స్వాగతం పలికారు. ఆయా అధికారులతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ, స్థానిక బీజేపీ నేతలతో కలిసి అమృత్ 2 స్కీం కింద రూ.105 కోట్ల నిధుల అంచనా వ్యయంతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

పక్కనే ఉన్న కార్గిల్ యుద్ధ శకటాన్ని సందర్శించి, కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. జై జవాన్, జై కిసాన్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ అమృత్ 2 స్కీం కింద రూ.1.32 కోట్లతో కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులు చేపట్టి ఈ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని, దీంతోపాటు సిరిసిల్ల పట్టణ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువును సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కోరారు. అమృత్ కింద కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తున్నా గడువులోగా పనులు చేయడం లేదని, దీనివల్ల నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదముందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదని, సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇయ్యలేదని తెలిపారు. మోదీ ప్రభుత్వం వివిధ స్కీంల కింద నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. అమృత్ స్కీం కింద కేంద్రం నిధులిస్తుందని, ఇదే విధంగా గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులిస్తే వాటిని అభివృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులను డైవర్ట్ చేస్తున్నారన్నారు. నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. కేంద్రం ఏ ఉద్దేశంతో నిధులిస్తుందో ఆ లక్ష్యానికే ఉపయోగించాలన్నారు. లేనిపక్షంలో ఆ నిధులను దారి మళ్లిస్తే మాత్రం ఊరుకునేది లేదని, ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మరియు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు : మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథనిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ కేంద్ర భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల (టీఆర్,బీ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ రంగానికి అవసరమైన అత్యుత్తమ మానవ వనరుల్ని తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చు కునేలా అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఇక్కడ లభించనుంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల ద్వారా శిక్షణార్థులకు స్వయం ఉపాధితో పాటు ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక న్యాక్ సెంటర్ ను మంథనికి కేటాయించడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ రంగంలో ఉత్తర తెలంగాణ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ఈ కేంద్రం వారధిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**గంభీరావుపేట జూలై 17 (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో ఓ యువకుడు మద్యం కు బానిసై అప్పుల బాధతో ఉరి వేసుకున్న ఘటన చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే గండడపు స్వామి(37) భార్య భవాని తెలిపిన వివరాల ప్రకారం ఐదు సంవత్సరాల క్రితం కుటుంబంతో కలిసి ఇంటి నిర్మాణం నిర్మించుకొని హౌసింగ్ లోన్తోపాటు బంగారం ఆభరణాలు తాకట్టుపెట్టి ప్రైవేట్ ఫైనాన్సో రుణం తీసుకున్నాడు రుణం తీర్చలేక తీవ్ర ఇబ్బందులతో ఎదుర్కొంటూ మద్యానికి బానిసై గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య తల్లితో గొడవపడి వారు భయపడి పక్కింట్లో నిద్రించిన అనంతరం శుక్రవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో భార్య తల్లి మరియు పిల్లలు ఇంటికి వచ్చి చూడగా ఇంటి రేకుల షెడ్డు కు ఇనుప రాడ్కు ఉరివేసుకొని స్వామి కనిపించాడని అతని భార్య పోలీసులకు తెలిపినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## చారిత్రక జామా మసీదు విస్తరణకు శంకుస్థాపన

- రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సైనీ చేతుల మీదుగా ప్రారంభం
- రూ.90 లక్షల కమర్షియల్ కాంప్లెక్స్ త్వరలో పూర్తి



**గంభీరావుపేట జూలై 17(జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని చారిత్రక జామా మసీదు విస్తరణ, మరమ్మతులు, ఆధునీకరణ రూ.45 లక్షల పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సైనీ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన నిర్వహించారు. ఖురాన్ పారాయణం, ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ఉలేమాలు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రోజురోజుకు నమాజ్ చేసే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జామా మసీదును విశాలంగా విస్తరించి, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సైనీ మాట్లాడుతూ, గంభీరావుపేట తన స్వగ్రామమని, ఇక్కడి చారిత్రక జామా మసీదు ప్రాంత ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిందన్నారు. విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మసీదు ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటుగా సుమారు రూ.90 లక్షల వ్యయంతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తైన అనంతరం రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మసీదు కమిటీ సభ్యులు వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన చొరవ, మార్గదర్శకత్వంతో ఈ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మహబూబ్ అలీ, సయ్యద్ ఘూజ్నొద్దీన్ జుబైర్, మహ్మద్ యహ్యా అస్లం, సయ్యద్ సాదతుల్లా హుస్సైనీ, సయ్యద్ అసదుల్లా హుస్సైనీ, హాఫిజ్ అబుల్ కలాం, మహ్మద్ వసీమ్, సయ్యద్ హాష్మీ, సఫీఉద్దీన్ నయీర్, యాసిన్ హుస్సైన్, మహ్మద్ రహీముద్దీన్, మహ్మద్ తాహిర్, సయ్యద్ షరీఫ్, సయ్యద్ విలాయతుల్లా, మహ్మద్ ఆరిఫుద్దీన్, మహ్మద్ నజ్ముద్దీన్, నాసిర్ హుస్సైన్, మహ్మద్ షాహిద్ అలీ, ఆర్కిటెక్ట్ ఇంజనీర్ మహ్మద్ తురాబ్ అలీ, పురావస్తు సంరక్షణ నిపుణుడు మీర్ బరకతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లంపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా భూముల రీసర్వే

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలన,అధికారులకు సర్పంచ్ అలువాల శంకర్ కృతజ్ఞతలు**



**చిగురుమామిడి జులై 17(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి,గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూములు,గ్రామ సరిహద్దులు, భూ రికార్డులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే చేయనున్నారు.ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,అడిషనల్ కలెక్టర్ శ్రీ శ్రీనివాస్,ఆర్డీవో శాలిని,ఉల్లంపల్లి గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఎంఆర్ఓ కనకయ్య, ఆర్ఐ నాగరాజు, జీపీఓ రాంబులు, సర్వేయర్ బాలకృష్ణ తదితర అధికారులు పాల్గొని రీసర్వే ప్రక్రియను పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ ఉల్లంపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూముల రీసర్వే చేపట్టడం గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.ఈ రీసర్వే ద్వారా వ్యవసాయ భూముల హద్దులు స్పష్టతకు రావడంతో పాటు,గ్రామ సరిహద్దులు ఖరారు కావడం,భూ వివాదాలు తగ్గడం,రైతులకు శాశ్వత పరిష్కారం లభించడం వంటి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు.ఉల్లంపల్లి గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా యంత్రాం గానికి, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు, ఆర్డీవో శాలినికి, ఎంఆర్ఓ కనకయ్యకు, సంబంధిత అధికారులందరికీ సర్పంచ్ అలువాల శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక మండపాలపై పోలీసుల ఆంక్షలు

**గంగుల కమలాకర్ ఆగ్రహం**



**కరీంనగర్ టౌన్, జూలై 17, (జనం సాక్షి) :** కరీంనగర్ నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల ఏర్పాటుపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సప్తగిరి కాలనీలో మండపాలకు అనుమతులు నిరాకరించడంతో కాలనీవాసుల అభ్యర్థన మేరకు శుక్రవారం ఆయన అక్కడ పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, 38 ఏళ్లుగా కొనసాగుతున్న గణపతి, దుర్గానవరాత్రి ఉత్సవాలకు ఇప్పుడు అనుమతులు నిరాకరించడం సమంజసం కాదన్నారు. పోలీసులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇతర మండపాలకు అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు.బొమ్మకల్ హనుమాన్ విగ్రహం చోరీ ఘటనను ప్రస్తావిస్తూ, విగ్రహాన్ని దొంగిలించిన వారిని పట్టుకోవాల్సిన పోలీసులు, విగ్రహాన్ని వెతికి ప్రతిష్ఠించిన తనపై, బీఆర్ఎస్ శ్రేణులపై కేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. దేవుని విగ్రహాలను కాపాడుకోవాల్సిన పరిస్థితి రావడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. తన క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, కరీంనగర్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారని గంగుల ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్


- క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్ పర్సన్



**చొప్పదండి, జూలై 17( జనం సాక్షి):** క్రీడలలో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు నిరుత్సాహ పడకుండా భవిష్యత్తులో జరిగే క్రీడలకు సిద్ధం కావాలని, గెలిచినవారు పై స్థాయి పోటీలలో గెలుపొంది క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరితా శ్రీనివాస్ పేర్కొన్నారు.పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం, చొప్పదండిలో 34వ హైదరాబాద్ క్లస్టర్ స్థాయి బాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించి ఉద్యోగ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు .అనంతరం ప్రిన్సిపాల్ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ పోటీలలో ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, నాగర్కర్నూల్, అండర్ 14 అండర్ 17 అండర్ 19 విభాగాల్లో నిర్వహిస్తున్న వాలీబాల్ బాస్కెట్బాల్ హ్యాండ్ బాల్ పోటీలలో సిద్ధిపేట, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ జగిత్యాల జిల్లాల జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.అనంతరం సంకల్ప్ స్కిల్ ల్యాబ్, మ్యాథ్స్ పార్క్ అలాగే జాతీయ నాయకులు, ప్రఖ్యాత శాస్త్రవేత్తల విగ్రహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమళ్ళ మానస గంగయ్య కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు గుర్రం సుజిత్ రెడ్డి ,కౌన్సిలర్లు కొత్త సుమలత, కొట్టే సునీత, గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేశం, రాజశేఖర్ పాల్గొన్నారు.

## వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.
- కొత్తపల్లి, ములకనూరు, చిగురుమామిడిలో రోడ్డు నిర్మాణం అలైన్మెంట్ పరిశీలన



**కరీంనగర్ బ్యూరో, జూలై 17 (జనంసాక్షి) :** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజు తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించారు. ఫేజ్-1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయంగా బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాల పై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, ఆర్ అండ్ బి డీఈ కిరణ్, ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పూర్తి డిజిటలైజేషన్ దిశగా జిపిఎఫ్, పింఛన్ సేవలు

- ఆలస్యాన్ని నివారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా "అదాలత్"లు
- పింఛన్, జిపిఎఫ్, ఆడిట్ సమస్యల పరిష్కారానికి సరైన వేదిక
- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్.




**కరీంనగర్ బ్యూరో, జులై 17 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, పింఛన్ సేవల్లో నాణ్యత, వేగవంతం పెంచేందుకు ఈ సేవలను పూర్తిగా డిజిటలైజేషన్ చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ తెలిపారు. పింఛన్, జనరల్ ప్రవిడెంట్ ఫండ్ సేవల అదాలత్, అకౌంట్స్, ఆడిట్, పెన్షన్, జిపిఎఫ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వర్క్ షాప్ కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అదాలత్ కు విశేష స్పందన లభించింది. పింఛను, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము జమ కావడంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఈ అదాలత్‌లో తమ దరఖాస్తులను సమర్పించారు. కొన్ని సమస్యలను అక్కడే పరిష్కరించిన అధికారులు, మరిన్ని దరఖాస్తుల పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగులకు, డిడిఓ లకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల్లోని డిడివోలు ఆడిట్ నియమ నిబంధనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిపిఎఫ్ పింఛన్ ప్రతిపాదనలు పంపినప్పుడు సమగ్రంగా పరిశీలించి, నియమ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు జత చేసి పంపాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఈ అంశాలపై అవగాహన కల్పించి ప్రతిపాదన తయారీలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని అన్నారు. తద్వారా ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన వెంటనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి వారి ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో పొందుతారని తెలిపారు. రిటైర్మెంట్ తేదీ ముందుగానే తెలుస్తుంది కాబట్టి మూడు నెలల ముందే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. ఉద్యోగి, అధికారి, ఉన్నతాధికారి, ట్రెజరీ అధికారులు సమన్వయంతో ఈ ప్రతిపాదనలు పంపిస్తే విరమణ పొందిన వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన జిపిఎఫ్ పింఛను సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లాల్లో అదాలత్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అలాగే శాఖల వారీగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తున్నామని, పోలీస్, అటవీ తదితర శాఖలో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు పింఛన్ జిపిఎఫ్ సమస్యలు ఈ అదాలత్ లో పరిష్కరిస్తున్నామని అన్నారు. ఇప్పటికే డిజిటలైజేషన్ సేవలు ప్రారంభించామని, ఆర్థిక వ్యవసాయ తదితర శాఖలు మోడల్ గా ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో పూర్తి డిజిటలైజేషన్ దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు.

అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ... దీర్ఘకాలికంగా పింఛను, జిపిఎఫ్ సమస్యలు పరిష్కారం కాక, అసలు సమస్య ఎక్కడ ఉందో తెలియక అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ వేదిక వారి ఇబ్బందులను తొలగిస్తుందని తెలిపారు. ఆడిట్ అభ్యంతరాలు, అకౌంట్స్ సందేహాలు ఈ కార్యక్రమం ద్వారా డీడీవోలు నివృత్తి చేసుకునే అవకాశం వచ్చిందని అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవనం గడిపేందుకు పింఛన్ జిపిఎఫ్ ఎంతగానో ఉపయోగపడతాయని, అందువల్ల డిడివోలు అప్రమత్తంగా ఉండి సరైన విధంగా ప్రతిపాదనలు పంపాలని అన్నారు. విరమణ పొందిన వెంటనే వారికి సొమ్ము వచ్చేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నరేష్ కుమార్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ సోనార్కర్, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, వివిధ శాఖల డిడివోలు, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్లు, సబ్ ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతే లక్ష్యంగా పనిచేయాలి

- ఆర్‌టీఓలకు డైరెక్టర్ అభిలాష్ బిస్త్ పిలుపు



హైదరాబాద్, జూలై 17 (జనంసాక్షి) : రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలంటే టెక్నాలజీ ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్, సమర్థవంతమైన అమలు, ప్రజల్లో అవగాహన అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ పేర్కొన్నారు. తెలంగాణ రవాణా శాఖకు చెందిన ముగ్గురు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ల (ఆర్‌టీఓలు) కోసం అకాడమీలో 18-05-2026 నుండి 17-07-2026 వరకు నిర్వహించిన రెండు నెలల ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సందర్భంగా శుక్రవారం అకాడమీ లో నిర్వహించిన వాలెడిక్టరీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ సి.రమేష్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. శిక్షణను పూర్తి చేసిన డి. జగదీష్, పి. భూషి రెడ్డి, చైసాయి చరణ్‌లకు డైరెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ యూనిఫాం సర్వీస్‌లో ప్రతి నిర్ణయం ప్రజల ప్రాణాలకు, భద్రతకు సంబంధించినదని అన్నారు. అందుకే లా, ప్రొసీజర్, మోటార్ వెహికల్స్ యాక్ట్, రూల్స్‌పై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు. దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీస్ శాఖతో పాటు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ బాధ్యత కూడా అత్యంత కీలకమని తెలిపారు. 90 శాతం ప్రమాదాలు ఉద్దేశపూర్వకంగా జరగవని, సమర్థవంతమైన చెకింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ, డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో నాణ్యతను పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే మూడు స్తంభాలపై దృష్టి సారించి, టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్‌గా పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె సూచించారు. అకాడమీలో పొందిన శిక్షణ భవిష్యత్తులో ప్రజలకు మరింత బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అడిషనల్ కమిషనర్ సి. రమేష్ మాట్లాడుతూ, గతంలో అకాడమీలో 92 మంది ఏఎంవీఐలు, అనంతరం 15 మంది రెండో బ్యాచ్ ఏఎంవీఐలకు అందించిన శిక్షణ ఫీల్డ్‌లో ఎంతో ఉపయోగపడిందని, పోలీస్ శాఖతో సమన్వయంగా సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు దోహదపడిందని తెలిపారు. అదే విధంగా ఈ ముగ్గురు ఆర్‌టీఓలు కూడా ఈ శిక్షణ ద్వారా మోటార్ వెహికల్స్ యాక్ట్, చట్టపరమైన అంశాలు, అమలు విధానాలపై సమగ్ర అవగాహన పొందారని, అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన ముగ్గురు ఆర్‌టీఓలు మాట్లాడుతూ, ఈ ఇండక్షన్ ట్రైనింగ్ తమలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని మరింత పెంపొందించిందని తెలిపారు. ముఖ్యంగా అవుట్‌డోర్ ట్రైనింగ్, ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలు తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ఈ ముగింపు సమావేశంలో కోర్సు కో ఆర్డినేటర్ వేమా శ్రీనివాసరెడ్డి 2 నెలల శిక్షణ గురించి వివరించారు. ఔట్ డోర్ ఏడీ రాంబాబు రెండు నెలల శిక్షణ విజయవంతం కావటానికి సహకరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, కవిత, వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, ఆర్‌టీఓ రఘునాథ్ గౌడ్ ఎం వి ఐ శీతల , డీఎస్పీ రామారావు,బి కృష్ణ ఆర్ ఐ రామకృష్ణ, మరియు అకాడమీ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా


- రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం
- ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు 72% బొగ్గు సరఫరా
- ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా మరింత బొగ్గు సరఫరాకు కార్యాచరణ
- సింగరేణి-జెన్‌కో సమన్వయ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి




హైదరాబాద్, జూలై 17 (జనంసాక్షి) : రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తున్నట్లు.. అయితే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మరింత ప్రాధాన్యత క్రమంలో ఇంకా ఎక్కువ బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ ప్రస్తుత విద్యుత్ డిమాండ్, బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై తమ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినందున, రాష్ట్ర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా ఇరు సంస్థల సంబంధిత అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. నిరంతరాయ బొగ్గు రవాణాపై పర్యవేక్షణ కు ప్రత్యేక అధికారులను నియమిస్తా మన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రామగుండం ఎన్‌టీపీసీ, సింగరేణి థర్మల్ ప్లాంట్ కోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 72 శాతాన్ని సరఫరా చేస్తున్నట్లు సింగరేణి మార్కెటింగ్ విభాగం అధికారులు సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. అయితే విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ విద్యుత్ కేంద్రాల అవసరాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే బొగ్గు నుంచి సర్దుబాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బొగ్గు ఉత్పత్తి, రవాణా, రైల్వే రేకుల లభ్యత, రోడ్డు రవాణా తదితర అంశాల్లో సింగరేణి, జెన్‌కో అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఆయా ఏరియాల జీఎంలు చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గొద్దని, నాణ్యతలోనూ రాజీ పడకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. జెన్ కో థర్మల్ కేంద్రాల వద్ద బొగ్గు నిల్వల వివరాలను తెలిపారు. బొగ్గు రవాణాలో ఉన్న ఇబ్బందులపై స్థానిక ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జెన్ కో డైరెక్టర్లు నాగ్య, రాజశేఖర్, సీఈలు బిచ్చన్న, లక్ష్మయ్య, శ్రీప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్

## రైతుల్లో పెరుగుతున్న ఆందోళన



**సర్వే పేరుతో పొలాల్లో అధికారుల సందడి..**

**భూములు కోల్పోతామనే భయాందోళనలో రైతన్నలు**

**వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం, స్థానిక రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా అధికారులు చేపట్టిన భూసర్వే ప్రక్రియ, ఆ ప్రాంత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అభివృద్ధి ముసుగులో తమ జీవనాధారమైన భూములను ప్రభుత్వం లాగేసుకుంటుందేమోనని వారు భయాందోళన చెందుతున్నారు.**

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :

### భూమి పోతే మా బతుకు పోతుంది



ఏడు ఎకరాల పత్తి సాగుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఈ భూమే మాకు ఆధారం. పారిశ్రామిక అభివృద్ధి కావాలి, కానీ మా పొట్టకొట్టి కాదు. ప్రభుత్వం తగిన పరిహారంతో పాటు మా కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలి.

షెర్లవార్ రమేష్, రైతు (రాంపూర్)



### 2,600 ఎకరాల కోసం సర్వే

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం సుమారు 2,600 ఎకరాలను గుర్తించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా బోరజ్ మండలంలోని హత్తీఘాట్, గిమ్మ, గూడా, రాంపూర్ గ్రామాల్లో రెవెన్యూ మరియు పారిశ్రామిక శాఖ బృందాలు గత రెండు వారాలుగా భూసర్వే నిర్వహిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

### నమ్మకం కలిగించని అధికారుల హామీలు

"కేవలం సాగుకు పనికిరాని రాతి, బంజరు భూములను మాత్రమే సేకరిస్తాం. సారవంతమైన వ్యవసాయ భూములను, అటవీ ప్రాంతాన్ని తాకబోం" అని అధికారులు భరోసా ఇస్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో సాగు భూముల్లో కూడా సర్వే జరుగుతుండటంతో రైతులు వారి మాటల ను నమ్మడం లేదు.

### పరిహారం కంటే జీవనాధారమే ముఖ్యం

మార్కెట్ విలువ కంటే మూడు రెట్లు ఎక్కువ పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, రైతులు మాత్రం ఆందోళన వీడటం లేదు. "భూమి పోతే బతుకు పోతుంది. మాకు కేవలం డబ్బుల కంటే, మా జీవనాధారానికి గ్యారెంటీ కావాలి" అని రైతులు స్పష్టం చేస్తున్నారు.

### పర్యావరణంపై ఆందోళన

ప్రాజెక్టు పరిధిలో అటవీ ప్రాంతం కూడా ఉండటంతో పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పారిశ్రామికీకరణ వల్ల వన్యప్రాణుల మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగే అవకాశం ఉందని, దీనిపై సమగ్ర అధ్యయనం జరగాలని స్థానికులు కోరుతున్నారు. అభివృద్ధి అవసరమే అయినా, అది పర్యావరణాన్ని, రైతుల జీవనోపాధిని దెబ్బతీయని రీతిలో ఉండాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అభివృద్ధి పేరుతో పరిశ్రమలు రావడం అవసరమే. కానీ రైతుల జీవనాధారం, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం సున్నితమైన విధానాలతో ముందుకు సాగాలనే డిమాండ్ ఈ ప్రాంతంలో బలంగా వినిపిస్తోంది.

# ఆకాశంలో సూర్యకిరణాలు.. 'అల్ఫోర్స్'లో స్ఫూర్తికిరణాలు

- నీట్ - 2026 ఫలితాలలో 'అల్ఫోర్స్' చారిత్రాత్మక విజయం
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి






కరీంనగర్ బ్యూరో, జూలై 17 (జనంసాక్షి) : శుక్రవారం రోజు ప్రకటించబడిన నీట్ - 2026 ఫలితాలలో పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుందని మా అల్ఫోర్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యద్భుత మార్కులు సాధించి నిరూపించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆల్ఫోర్స్ విద్యార్థులు నీటి ఫలితాల్లో చరిత్ర సృష్టించారని, విద్యార్థులు సాధించిన ఫలితాల వివరాలతో డి. రిత్విక్ 647 మార్కులతో అత్యున్నత స్థానంలో నిలువగా, సిద్దాంత్ చతుర్వేది 564, సయ్యద్ మలాజుద్దీన్ 557, వసుల శ్రుత్విక 551, గులామ్ మహమ్మద్ హుస్సేన్ 548, బత్తుల అభిజ్ఞ 541, లింగంపల్లి అనంత్ సాయి 540, నార్ల శ్రీహిత 538, శ్రేయాంశ్ ద్వివేది 537, కొండ్ల అక్షిత 522, బొమ్మవరపు రుత్విక్ 515, జక్కుల శ్రీవైత్రి 512, టి. హర్షిత 509, సిద్దం సాత్విక 508, ఎ. సత్య బ్రాహ్మిణి 507, బి. అక్షర 505, నిద 502, గుంజేటి రిషిత 501, జహ్రా మాజీద్ 501 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారని తెలిపారు. నీట్ కోచింగ్ డాక్టర్స్ 30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ను అందించడం ద్వారా అల్ఫోర్స్ విజయపరంపర కొనసాగుతుందని,19 మంది విద్యార్థులు 500, ఆపై మార్కులు సాధించడము విశేషం. సుమారుగా 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలలో సీట్లు సాధించగలరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాని, పటిష్ట ప్రణాళికతో విద్యాబోదన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంటిత దీక్ష, పట్టుదల, కృషి వల్ల ఇంతటి ఘన విజయం సాధించడం జరిగింది. తక్కువ మంది విద్యార్థులతో అధికముగా సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమన్నారు. నీట్ అయిన, ఐఐటి అయిన విద్యార్థులను విజయమార్గంలో నడిపిస్తున్న సంస్థ అల్ఫోర్స్ అని, ఇంత వరకు ప్రకటించబడిన అన్ని ఫలితాలలో అల్ఫోర్స్ ముందంజలో ఉండడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రములో విద్యాభివృద్ధికై కృషి చేస్తున్న అల్ఫోర్స్ ను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ, తమ పిల్లలను అల్ఫోర్స్ లో చేర్పిస్తున్నందుకు వారికి మన స్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలిపారు. రాబోయే కాలములో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధముగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భముగా తెలియజేయుచునని, ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ అణిముత్యాలను అభినందిస్తూన్నాని, ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేయుచున్నానని తెలిపారు.

# మురికి నీటితో స్నానాలు.. పురుగుల అన్నం..

## హాస్టల్ దుస్థితిపై విద్యార్థుల ఆవేదన

- 106 మంది విద్యార్థినులు కేవలం 3 బాత్‌రూమ్‌లే..
- పురుగులబియ్యం, నాసిరకం ఆహారంపై విద్యార్థుల ఆరోపణలు
- డైనింగ్ హాల్ లేక ఎండా, వానలోనే వరండాలో భోజనాలు
- చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి



గుండుమాల్, జూలై 17 (జనంసాక్షి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వసతి కల్పించాల్సిన మోడల్ స్కూల్ వసతి గృహం ప్రస్తుతం సమస్యల నిలయంగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపిస్తున్నారు. వసతి గృహంలో తాగునీటి సమస్యతో పాటు స్నానానికి పరిశుభ్రమైన నీరు అందుబాటులో లేదని విద్యార్థులు చెబుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా లేకపోవడంతో నెలల తరబడి శుభ్రం చేయని సంపులోని మురికి నీటినే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా స్కూల్ ఆవరణలోని బోరు నుంచి బకెట్లలో నీరు తెచ్చుకుని వరండాలో స్నానాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. వసతి గృహంలో 106 మంది విద్యార్థినులు ఉండగా కేవలం మూడు బాత్‌రూమ్‌లలో మాత్రమే నీటి సౌకర్యం ఉందని, మిగిలిన బాత్‌రూమ్‌లలో ట్యాప్‌లు పనిచేయడం లేదని పేర్కొన్నారు. వాష్‌రూమ్‌లు, స్నానపు గదులు ఉపయోగానికి పనికిరాని స్థితిలో ఉన్నాయని తెలిపారు. ఆహార నాణ్యత కూడా ఆందోళనకరంగా ఉందని విద్యార్థులు ఆరోపించారు. బియ్యంలో పురుగులు ఏరే పనిని విద్యార్థులతోనే చేయిస్తున్నారని, కొన్ని సందర్భాల్లో పురుగులతో కూడిన అన్నం కూడా వడ్డిస్తున్నారని తెలిపారు. ఏడాది కాలంగా చికెన్, పండ్లు వంటి పోషకాహారం అందించలేదని వాపోయారు. భోజనం చేసేందుకు ప్రత్యేక డైనింగ్ హాల్ కూడా లేకపోవడంతో ఎండైనా, వర్షమైనా వరండాలోనే భోజనం చేయాల్సి వస్తోందని చెప్పారు. అదేవిధంగా డ్రైనేజీ గుంతలో మురుగు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే వసతి గృహాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, తాగునీరు, పరిశుభ్రత, ఆహార నాణ్యత, బాత్‌రూమ్‌లు, విద్యుత్ సౌకర్యాలు, డైనింగ్ హాల్ వంటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని వసతి గృహంలో అన్ని మౌలిక వసతులను కల్పించాలని స్థానికులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# పాలమూరులో పసికందు విక్రయం

- నెల రోజుల పసికందును లక్షకు విక్రయించిన తల్లిదండ్రులు...
- పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న తల్లిదండ్రులు..
- నెలరోజుల పసికందును బాల సదనుకు చేర్చిన సిబ్బంది...



మహబూబ్ నగర్ బ్యూరో జూలై 17( జనం సాక్షి ): ఆ ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. ముచ్చటగా నలుగురు మగ పిల్లలకు జన్మనిచ్చింది, చివరి సంతానాన్ని లక్షకు విక్రయించారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా చేతిలో డబ్బులు లేకపోవడంతో నెలరోజుల చివరి సంతానాన్ని పోషించడం ఇబ్బందిగా ఉందని విక్రయించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తెలుగు గూడెం గ్రామానికి చెందిన నీలమ్మ, కేశవులు ఈ దంపతులకు నలుగురు మగ పిల్లలే జన్మించారు. నాలుగోవ సంతానాన్ని బ్రోకర్ ద్వారా హన్వాడ మండలం మునిమోక్షం గ్రామం చెందిన వారి దగ్గర బంధువులకు లక్ష రూపాయలకు విక్రయించారు. తీసుకున్న లక్ష రూపాయల లో అనారోగ్యంతో ఉన్న కేశవులు తండ్రి మరణించడంతో సుమారు దహన ఖర్చులకు 70000 వేల రూపాయలు ఖర్చు కాగా ఆ దంపతులతో 30000 వేలు మిగిలాయి.. నెలరోజుల పసికందును విక్రయించిన విషయం ఆ నోట ఈ నోట పొక్కడంతో పాలమూరు రూరల్ పోలీసులు, బాల సదన్ అధికారులు ఆ పసికందును ఎక్కడ విక్రయించారో పూర్తి వివరాలు తెలుసుకొని పోలీసుల సహకారంతో మునుమోక్షం గ్రామానికి చేరుకొని అక్కడ ఉన్న పసికందును పాలమూరులోని బాలసదనకు చేర్చారు.

### ఎలా బయటకు తెలిసింది

పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెల 16వ తేదీ నీలమ్మ మగ సంతానానికి జన్మనిచ్చింది. తెలుగు గూడెం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ డిఈసి మాత్రలు ఇచ్చేందుకు వెళ్లగా అక్కడ అత్త కోడలు గొడవకు దిగడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది. పసికంది ఇంట్లో లేదని తెలుసుకున్న ఆశ వర్కర్ ఆ గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించారు. దీంతో పోలీసులకు, బాలసదన్ అధికారులు మునిమోక్షం గ్రామానికి వెళ్లి ఆ పసికందును వాళ్ళ ఆధీనంలోకి తీసుకున్నారు... దీనిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370